# ఆంధ్రభూమి




సంపుటి: 29 . సంచిక: 234 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | బుధవారం 24 జనవరి, 2018 | 20 పేజీలు | ధర: రూ.3.00

## శుభోదయం

**కలియుగం - 5119**
**శాలివాహన శకం - 1939**

శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం।
ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం,
శుక్లపక్షం; తిథి: శుద్ధ సప్తమి ఉ.11.42
నక్షత్రం: అశ్విని రా.తె.4.26;
వర్జ్యం: రా.12.30 నుండి 2.04 వరకు
విశేషాలు: రథసప్తమి;
దుర్ముహూర్తం: ఉ.11.36 నుండి 12.24 వరకు
రాహుకాలం: మ.12.00 నుండి 1.30 వరకు



చీకటినిజీల్చి వెలుగులుజిమ్మునతడు
విశ్వమును మేల్కొలిపెడి సన్మిత్రుడతడు
జవము జీవములనొసగి సాకునతడు
ఒక్క వందనమునకిచ్చు వందయేండ్లు



## ఆధార్ నెంబరిస్తే నష్టమేమిటి?

- ప్రైవేటు సంస్థల చేతుల్లో ఇప్పటికే పౌరుల వివరాలు
- పిటీషనర్లకు సుప్రీం ప్రశ్న

5




# రక్షిత ధోరణి వద్దు



ప్రపంచ ఆర్థిక ఫోరం వార్షిక సదస్సులో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

## ప్రపంచ దేశాలన్నీ కలిసి నడవాలి

- ముందుతరాలకు ఆదర్శం కావాలి
- స్వార్థచింతన మరీ ప్రమాదం
- పర్యావరణ రక్షణతోనే పుడమికి భవిత
- భారత్.. పెట్టుబడులకు మాగాణి
- తరలివస్తే శాంతి, సిరిసంపదలు
- దావోస్ వేదికపై మోదీ ఉద్ఘాటన

దావోస్, జనవరి 23: ఉగ్రవాదం, రక్షితవాదం, పర్యావరణ సమతూకానికి కలుగుతున్న విఘాతాలు ప్రపంచ దేశాలకు తీవ్ర ఆందోళన, ఆవేదన కలిగిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 20యేళ్ల తరువాత ప్రపంచ ఆర్థిక ఫోరం వేదికపై మాట్లాడిన తొలి భారత ప్రధానిగా నరేంద్ర మోదీ వర్తమాన ప్రపంచ సమస్యలను వివిధ దేశాల అధినేతలు, ప్రభుత్వాధినేతల దృష్టికి తీసుకొచ్చారు. రక్షితవాదం ఉగ్రవాదం కంటే ప్రమాదకరమని హెచ్చరించారు. అలాగే వాతావరణ మార్పులను నిరోధించి పుడమిని తక్షణ ప్రాతిపదికన పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ప్రపంచ శాంతిని కబళిస్తున్న ఉగ్రవాదాన్ని ఉమ్మడి శక్తితో అంతం చేయాలని పిలుపునిచ్చారు. డబ్ల్యుఇఎఫ్ వార్షిక సదస్సులో మంగళవారం మాట్లాడిన మోదీ, అంతర్జాతీయంగా భారత నాయకత్వ పటిమను మరింత ప్రస్ఫుటింపజేసేందుకు ప్రయత్నించారు. వర్తమాన ప్రపంచాన్ని చీలుస్తున్న అంశాల విషయంలో జాగరూకత వహించాలని, వాటిని నిర్మూలించుకోవడం, వైషమ్యాలను తొలగించుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ భవిష్యత్‌ను ఉమ్మడి ప్రాతిపదికన పంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గుణాత్మక, నిర్మాణాత్మకరీతిలో విధానాలను రూపొందించుకున్నపుడే రాబోయే తరానికి ఘనమైన, బలమైన భవితను అందించగలుగుతామని స్పష్టం చేశారు. రానున్న తరాలకు జవాబు చెప్పుకోవాల్సిన ప్రశ్నలెన్నో వర్తమాన ప్రపంచానికి ఎదురవుతున్నాయన్నారు. ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థ విభేదాలను, చీలికలను పెంపొందించేదిగానే ఉందన్న మోదీ, ఈరకమైన విఘాతక పరిస్థితులను నిర్మూలించుకుని కలిసిగట్టుగా పని చేయలేమా? అని ప్రపంచ నేతలను ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ కలిసి పని చేస్తే గుణాత్మకమైన భవిష్యత్‌ను పంచుకునే అవకాశం ఉంటుందని, ఇందుకు వీలుగా వైరుధ్యాలను, విభేదాలను పక్కనపెట్టి పని చేయాలన్నారు. చీలికల ప్రపంచంలో ఉమ్మడి భవితను సృష్టించుకోవడం అన్న అంశమే కీలకంగా ప్రపంచ ఆర్థిక ఫోరం తాజా సదస్సు జరుగుతోంది. మోదీ తన ప్రసంగం ద్వారా అమెరికాయే ముందు, దాని తరువాతే అన్నీ అన్న డొనాల్డ్ ట్రంప్ విధానాలను పరోక్షంగా ప్రస్తావించారు. దీని దృష్ట్యానే రక్షిత వాదానికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈవారం చివరిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ సదస్సులో పాల్గొనేందుకు వస్తున్నారు. చాలా దేశాలు స్వార్థచింతనతో తమ ప్రయోజనాలే ముఖ్యమన్న ధోరణితో వ్యవహరిస్తున్నాయని, దీనివల్ల ప్రపంచీకరణ ప్రయోజనాలకే విఘాతం కలుగుతోందని మోదీ తెలిపారు. ఇలాంటి ప్రతికూల ధోరణులు ఉగ్రవాదం లేదా వాతావరణ మార్పులకంటే తక్కువ ప్రమాదాన్ని తెచ్చేవేవీ కాదని హెచ్చరించారు. ఈ ఏడాది దావోస్ శిఖరాగ్ర సదస్సు ఎంచుకున్న ఇతివృత్తం భారత్‌కు ఎన్నో విధాలుగా వర్తిస్తుందని పేర్కొన్న ఆయన 'భారతీయులు ఎక్కడున్నా కూడా ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తారే తప్ప చీలికలు

– మిగతా 7వ పేజీలో



కేశవ మెమోరియల్‌లో జాతీయ స్థాయి సెమినార్‌ను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న ఉప రాష్టప్రతి వెంకయ్యనాయుడు

## దేశంలో అతిపెద్ద సంస్కరణ జీఎస్‌టీ

- ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసింది
- పేదవాళ్లు ధనవంతులవుతున్నారు
- ఎఫ్‌డీఐతో దేశానికి ఎంతో మేలు
- ఉప రాష్టప్రతి వెంకయ్యనాయుడు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 23: వస్తు సేవల పన్ను చట్టం దేశ స్వాతంత్య్రానంతరం ప్రభుత్వం తీసుకున్న అతిపెద్ద పన్ను సంస్కరణ అని ఉప రాష్టప్రతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. జీఎస్టీ వల్ల రాష్ట్రాలు వేసే అన్ని రకాల పన్నులూ, కేంద్ర ప్రభుత్వం వేసే అన్ని రకాల పన్నుల స్థానంలో ఒకే ఒక పన్ను చెల్లింపు వ్యవస్థ ఏర్పడిందన్నారు. వెంకయ్యనాయుడు మంగళవారం నాడు ఫైనాన్స్, టాక్సేషన్, మార్కెటింగ్ రంగాల్లో సమకాలీన సవాళ్లు అనే అంశంపై కేశవ మెమోరియల్ విద్యా సంస్థలు ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ స్థాయి సెమినార్‌ను ప్రారంభించారు. 90వ దశాబ్దంలో వచ్చిన సరళీకరణ వల్ల మన దేశం త్వరితగతిన ఎదిగే ఆర్థిక శక్తిగా ఆవిర్భవించిందని అన్నారు. 1991లో 225 డాలర్ల ఆర్థిక శక్తిగా ఉన్న భారత్ ఇపుడు రెండు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదిగిందని అన్నారు. పివి నర్సింహారావు ప్రభుత్వం ప్రారంభించిన సంస్కరణలను వాజపేయి ప్రభుత్వం, ప్రస్తుతం మోదీ ప్రభుత్వం కొనసాగిస్తోందని అన్నారు. రానున్న కాలంలో పెరుగుతున్న మధ్యతరగతి జనాభా భారతదేశ ఆర్థిక రంగాన్ని ఎంతో ప్రభావితం చేస్తుందని అన్నారు. 65 శాతం జనాభా 35 సంవత్సరాల లోపు వయస్సున్న

– మిగతా 7వ పేజీలో



## సకాలంలో పరిహారం చెల్లించకుంటే భూసేకరణకు బ్రేకులే

### ఏపీ, తెలంగాణకు హైకోర్టు హెచ్చరిక

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 23: భూసేకరణ ప్రక్రియలో యజమానులకు సకాలంలో నష్టపరిహారం చెల్లించకుంటే ప్రక్రియ నిలిపేస్తామని హైకోర్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలను హెచ్చరించింది. భూ యజమానులకు నష్టపరిహారం చెల్లించడంలో నిర్లక్ష్యం మానుకోవాలని హైకోర్టు సూచించింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్జి జి వెంకటకృష్ణయ్య హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి భూసేకరణ ప్రక్రియ, నష్టపరిహారం చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై లేఖ రాశారు. ఈ కేసుల్లో కోర్టు ఇచ్చిన అనేక ఉత్తర్వులు అమలుకు నోచుకోవడం లేదని వివరించారు. విచారణ కోర్టులు నష్టపరిహారం ఇవ్వాలంటూ ఇచ్చిన ఆదేశాలను కలెక్టర్లు అమలు చేయడం లేదన్నారు. ఈ లేఖను హైకోర్టు సూమోటోగా స్వీకరించింది. అనంతరం కేసును తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, జస్టిస్ ఎం గంగారావుతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించింది. తెలంగాణ, ఆంధ్ర ప్రభుత్వాలు భూసేకరణకు సంబంధించిన అంశాలపై వివరాలను సమకూర్చకపోవడం పట్ల హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. వచ్చే విచారణ తేదీ లోపల ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాల ప్రభుత్వ కార్యదర్శులు తామడిగిన వివరాలను సమకూర్చని పక్షంలో వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుందని కోర్టు

– మిగతా 7వ పేజీలో

## కృష్ణపట్నంలో రిఫైనరీ

- ఆసక్తి చూపుతున్న సౌదీ ఆర్మ్ కో
- ఇప్పటికే ఏపీలో పర్యటించిన ప్రతినిధులు
- దావోస్‌లో కంపెనీ చీఫ్‌తో బాబు భేటీ
- ఏపీయే అనువైనదంటూ ఆహ్వానం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 23: ఆంధ్రప్రదేశ్‌కు 974 కిలోమీటర్ల సముద్రతీరం ఉందని, కృష్ణా-గోదావరి బేసిన్‌లో అపార చమురు నిక్షేపాలు ఉన్నాయని, పెట్రోలియం శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు దేశంలో తమ రాష్ట్రం ఎంతో అనుకూలమని సౌదీ ఆర్మ్‌కో సంస్థకు సీఎం చంద్రబాబు సూచించారు. దావోస్ పర్యటనలో రెండోరోజు మంగళవారం సౌదీ ఆర్మ్‌కో ప్రెసిడెంట్ సైద్ అల్ హద్రమీతో బాబు సమావేశమయ్యారు. తమ రాష్ట్రాన్ని తాకుతూ రెండు పారిశ్రామిక కారిడార్లు ఉన్నాయని, కృష్ణపట్నాన్ని లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, రిఫైనరీ ఏర్పాటు వాణిజ్యపరంగా ఎంతో లాభసాటి అవుతుందని, స్వదేశంలో మార్కెటింగ్‌కు అనువుగా ఉంటుందని వివరించారు. పెట్రోలియం, రసాయన పరిశ్రమల ఏర్పాటు, విస్తరణకు తమ రాష్ట్రంలో ఇప్పటికే సానుకూల వాతావరణం ఉందని, హెచ్‌పీసీఎల్, గెయిల్ కార్యకలాపాలకు ఆంధ్ర ఆయువుపట్టుగా ఉందని వివరించారు. రాష్ట్రంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజనీరింగ్

– మిగతా 7వ పేజీలో



సౌదీ ఆర్మ్‌కో అధ్యక్షుడు సైద్ అల్ హద్రమీతో సమావేశమైన సీఎం చంద్రబాబు

# లోకేష్‌కు బాబు పుట్టినరోజు శుభాకాంక్షలు

విజయవాడ (బెంజిసర్కిల్), జనవరి 23: ఏపీ మంత్రి నారా లోకేష్‌కు సీఎం చంద్రబాబు నాయుడు ట్విట్టర్ వేదికగా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఈ ఇద్దరు నేతలు దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో పాల్గొంటున్న విషయం తెలిసిందే. పలు సంస్థలతో భేటీ అవుతూ పారిశ్రామికవేత్తలను ఏపీకి ఆహ్వానిస్తూ బీజీగా ఉన్నారు. మంగళవారం మంత్రి లోకేష్ పుట్టిన రోజు జరుపుకుంటున్న సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు తన కుమారుడు, మంత్రి లోకేష్‌కు ట్విట్టర్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు యువతకు ప్రతినిధి, చరిష్మాగల నాయకుడు లోకేష్ అని ప్రశంసించారు. ఏపీ రాష్ట్ర ప్రజలకు సేవలందించే దిశలో అంకిత భావంతో పని చేసేవిధంగా మరింత శక్తిమంతుడు కావాలని ఆకాంక్షించారు.

**షారుఖ్‌కు అభినందనలు**

బాలీవుడ్ స్టార్ సూపర్‌స్టార్ షారుఖ్ ఖాన్‌ను ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. షారుఖ్ ఖాన్ తాజాగా దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం ప్రత్యేక అవార్డును స్వీకరించడం, ఆయనను సత్కరించడంపై చంద్రబాబు ట్వీటర్ వేదికగా ప్రశంసల జల్లు కురిపించారు. బాలలు, మహిళల హక్కుల కోసం ఆయన చేస్తున్న సేవలకు షారుఖ్‌ను క్రిస్టల్ అవార్డుతో గౌరవించడం అభినందనీయమన్నారు.

## దుర్గగుడి ఈవోగా పద్మ

- నలుగురు ఐఏఎస్‌ల బదిలీ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: విజయవాడ దుర్గ గుడి ఈవోగా డాక్టర్ ఎం.పద్మను ప్రభుత్వం నియమించింది. ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఎండీగా వ్యవహరిస్తున్న ఆమెను పూర్తి స్థాయి ఈవోగా మంగళవారం నియమించింది. దుర్గగుడిలో తాంత్రిక పూజల వ్యవహారంలో అప్పటి ఈవో సూర్యకుమారిపై బదిలీ వేటు వేసి సాధారణ పరిపాలనా విభాగానికి బదిలీ చేసి, ఇన్‌చార్జి ఈవోగా దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనూరాధను ఇటీవల నియమించింది. అమె స్థానంలో పద్మను పూర్తిస్థాయిలో ఈఓగా నియమించారు. తదుపరి నియామకం జరిగేంత వరకూ ఆమె బ్రాహ్మణ కార్పొరేషన్ ఎండీగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. కార్మిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్‌ను రహదారులు, భవనాల శాఖకు బదిలీ చేసింది. ఆయన కార్మిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా కూడా కొనసాగుతారు. జీఏడీలో ప్రిన్సిపల్ సెక్రటరీగా వ్యవహరిస్తున్న గోపాల్ కృష్ణ ద్వివేదీని అదే హోదాలో పశుసంవర్ధక శాఖకు బదిలీ చేసింది. పశుసంవర్ధక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా వ్యవహరిస్తున్న జెఎస్‌వి ప్రసాద్‌ను జీఏడీకి బదిలీ చేశారు.

## గవర్నర్‌పై వ్యాఖ్యలు వెనక్కి

- సీపీఐ నారాయణ

నందిగామ, జనవరి 23: గవర్నర్ నర్సింహన్ తీరుపై సోమవారం తీవ్ర స్థాయిలో చేసిన విమర్శను వెనక్కు తీసుకుంటున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. కృష్ణా జిల్లా నందిగామలో జరుగుతున్న 24వ సీపీఐ మహాసభలో రెండవ రోజైన మంగళవారం కార్యక్రమాల్లో పాల్గొన్న నారాయణ మాట్లాడుతూ గవర్నర్ ప్రవర్తన తీరును నిరసిస్తూ జనవరి 26వ తేదీ నిర్వహించే కార్యక్రమానికి హాజరు కావడం లేదని పునరుద్ఘాటిస్తూ సోమవారం ఆయనపై పొరబాటున పరుషంగా చేసిన విమర్శను ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు.

### జీవిత ఖైదీల విడుదలపై ప్రభుత్వం కసరత్తు

## అధికారులతో కమిటీ ఏర్పాటు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని వివిధ కారాగారాల్లో జీవిత ఖైదు అనుభవిస్తున్న వారిని విడుదల చేసే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఉన్నతాధికారులతో కమిటీని నియమించింది. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు, ఖైదీల బంధువుల నుంచి జీవిత ఖైదీల విడుదలపై ప్రభుత్వానికి వినతులు అందాయి. 5 లేదా 7 సంవత్సరాలుగా జీవిత ఖైదు అనుభవిస్తూ, 65 సంవత్సరాలు దాటిన, వివిధ రకాల వ్యాధులతో ఇబ్బంది పడుతున్న ఖైదీల విడుదల కోరుతూ అనేక వినతులు అందాయి. సుప్రీం కోర్టు మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకుని, నిబంధనల మేరకు అర్హులైన వారిని విడుదల చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అధ్యక్షతన కమిటీని నియమించింది. కమిటీలో న్యాయ విభాగం సెక్రటరీ, డీజీపీ, సిఐడి చీఫ్ లీగల్ అడ్వైయిజర్, అదనపు డీజీపీ (ఇంటెలిజెన్సు), డీజీ (జైళ్లు) సభ్యులుగా ఉంటారు. అర్హుల జాబితాలను ఈ కమిటీ పరిశీలించి, తుది నిర్ణయం తీసుకుంటుంది.

## ఉద్యోగాల కల్పన, రైతులకు ఆర్థిక లబ్ధే లక్ష్యం

- 22 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు అనుమతి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 23: ఉద్యోగాల కల్పనతోపాటు వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధర చెల్లించి, రైతులకు ఆర్థిక లబ్ధి చేకూర్చడమే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాట్ల లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. స్వప్రయోజనాల కోసం ప్రభుత్వమిచ్చే రాయితీలు దుర్వినియోగం చేసే ఆయా కంపెనీ యజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన స్టేట్ లెవెల్ ఎంపవర్డ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో 22 యూనిట్లకు సీఎస్ అనుమతులు మంజూరు చేశారు. యూనిట్లు ఏయే ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారో అడిగి తెలుసుకున్నారు. ఎన్ని కోట్ల రూపాయలతో ఆయా యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు.. వాటి వల్ల ఎంత మందికి ఉపాధి లభించనుందో అనే వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సంబంధిత అధికారులు సీఎస్‌కు వివరించారు. స్థానిక వ్యవసాయోత్పత్తుల ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సీఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు కాబోతున్న ఫుడ్ ప్రాసెసింగ్ ఆయా కంపెనీ యజమాన్యాల పూర్వ పనితీరు, విశ్వసనీయతతోపాటు స్థానిక వ్యవసాయోత్పత్తుల దిగుబడుల ఆధారంగా యూనిట్ల ఏర్పాటయ్యేలా చూడాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ముందుకొస్తున్న కంపెనీలకు బ్యాంకులిస్తున్న రుణాలు, వడ్డీల వివరాలు స్వయంగా తెలుసుకోవాలన్నారు.

# జలవనరుల ఖర్చులపై జగడం!

- 'పట్టిసీమ'పై నిలదీసిన వైసీపీ
- వివరాలు వెల్లడించాలన్న విష్ణు
- ఆ ప్రాజెక్టే దిక్కన్న బీద
- వాడివేడిగా పీఏసీ భేటీ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: ప్రజాపద్దుల కమిటీ (పీఏసీ) సమావేశం మంగళవారం వాడివేడిగా జరిగింది. పట్టిసీమ ప్రాజెక్టుపై వైకాపా నిలదీయగా, వివరాలు వెల్లడించాలని బీజేపీ డిమాండ్ చేసింది. రాష్ట్ర జలవనరుల శాఖ ఖర్చులపై కమిటీ సభ్యులు అధికార పక్షాన్ని, అధికారులను నిలదీశారు. దీంతో సమావేశంలో అరుపులు, కేకలు చోటు చేసుకున్నాయి. ఆర్థిక రంగానికి సంబంధించి కాగ్ నివేదికపై చర్చించేందుకు వెలగపూడి సచివాలయం ఆవరణలోని అసెంబ్లీ అవరణలో ప్రజా పద్దుల కమిటీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్ అధ్యక్షతన మంగళవారం సమావేశమైంది. పట్టిసీమ ప్రాజెక్టుకు సంబంధించి లబ్ధిదారులైన రైతుల వివరాలు లేకపోవడంపై కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీటి సరఫరా ఆడిట్ నివేదికలు లేకపోవడం, పట్టిసీమ నుంచి పరిశ్రమలకు సరఫరా చేసిన నీటి వివరాలు వంటివి లేకపోవడాన్ని తప్పుపట్టింది. పట్టిసీమకు సంబంధించి 24 పంపులను డిజైన్ చేయగా, అందులో 11 మాత్రమే పని చేస్తున్నాయని, మిగిలిన వాటి సంగతి కమిటీ ప్రశ్నించింది. పుష్కరం లిఫ్ట్, తుంగభద్ర నటి పంపిణీ, గురు రాఘవేంద్ర ప్రాజెక్టుల్లోని లోపాలను కమిటీ సభ్యులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ మాట్లాడుతూ గురు రాఘవేంద్ర ప్రాజెక్టు, పోలవరం ప్రాజెక్టు పనులు జరుగుతుండగా, భారీ ఎత్తున పట్టిసీమ ప్రాజెక్టుకు నిధులు ఖర్చు చేయడంపై అధికారులపై మండిపడ్డారు. అయితే పట్టిసీమ వల్లే ఈ ఏడాది 100 టీఎంసీల నీటిని ఇచ్చామని ఎమ్మెల్సీ బీదా అదే స్థాయిలో సమాధానం ఇచ్చారు. కేంద్రం దయతలిస్తే, పోలవరం ప్రాజెక్టు పూర్తి అవుతుందని, లేకుంటే పట్టిసీమే ప్రాణాధారం అవుతుందని తెలిపారు. పట్టిసీమ ప్రాజెక్టుకు సంబంధించి అన్ని వివరాలను కమిటీ ముందు ఉంచాలని బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్ రాజు డిమాండ్ చేశారు. వచ్చే సమావేశంలో వివరాలు అందచేస్తామని అధికారులు తెలిపారు.

పట్టిసీమ కాంట్రాక్టరుకు ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. పట్టిసీమ ప్రాజెక్టుకు డయాఫ్రం వాల్ ఎందుకు నిర్మించాల్సి వచ్చిందో చెప్పాలని వైకాపా సభ్యులు డిమాండ్ చేశారు. మూడు సబ్ స్కీమ్‌లకు సంబంధించి డీపీఆర్‌లను తయారు చేసి, 14 స్కీమ్‌లను చేపట్టడాన్ని కాగ్ తప్పుపట్టడాన్ని చైర్మన్ గుర్తు చేశారు.

# ఏడాదిలో అధికారుల గృహ నిర్మాణం

- వేగంగా పరిపాలనా భవనాల పనులు
- మంత్రి నారాయణ స్పష్టీకరణ



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: రాజధాని పరిపాలనా భవనాల పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని, డిసెంబర్ 11న క్షేత్రస్థాయిలో నేలపాడు, రాయపూడి ప్రాంతాల్లో పర్యటన చేసిన నాటి నుండి ఈరోజు పనుల పురోగతిని ప్రత్యక్షంగా చూడవచ్చని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. మంగళవారం అమరావతి రాజధాని ప్రాంతంలోని నేలపాడు, రాయపూడి, అనంతవరం గ్రామాల్లో విలేఖరులతో కలిసి క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి ఇంజనీర్లకు, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా పరిశీలన చేపట్టారు. ప్రభుత్వం రైతులకు, ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి అమరావతి రాజధాని ప్రాంతం 217 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో తొమ్మిది నగరాలను రూపుదిద్దుతున్నామని అందులో అత్యంత నాణ్యతతో కూడిన పరిపాలనా భవనాలను షేర్ వాల్ టెక్నాలజీతో నిర్మించేందుకు పనులను వేగవంతం చేస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. నేలపాడులో నిర్మితమవుతున్న ఏపీసీఆర్‌డీఏ, ఎన్‌జీవోల ఇళ్ల నిర్మాణ పనుల ప్రగతిపై ఎల్ అండ్ టీ అధికారులతో మంత్రి సమీక్షించారు. అంతకు ముందు పీఎంఆర్‌వై, ఎన్‌టీఆర్ నగర్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి పురోగతిపై నిర్మాణాల పని తీరుపై కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకుని తగిన సూచనలు చేశారు. పర్యటనలో భాగంగా విలేఖరులతో మాట్లాడుతూ అమరావతి రాజధాని ప్రాంతంలో 1450 ఎకరాల్లో పరిపాలనా నగరం నిర్మిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఐఏఎస్ అధికారులు, ఉన్నతాధికారులు, గెజిటెడ్, ఎన్‌జీవోలు, నాల్గవ తరగతి ఉద్యోగులకు సంబంధించి 3,840 భవన సముదాయాలతో కూడిన 61 టవర్లను నిర్మిస్తున్నామన్నారు. ఏడాదిలోగా గెజిటెడ్, ఎన్‌జీవోల భవనాలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. 15 నెలల్లో పూర్తిస్థాయిలో పరిపాలనా భవనాలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

**కేసుల మాఫీ కోసమే బీజేపీతో కలుస్తానంటున్న జగన్**

కేసుల మాఫీ కోసమే బీజేపీతో కలుస్తానని ప్రతిపక్ష నేత జగన్ అంటున్నారని మంత్రి నారాయణ ఆరోపించారు. జగన్‌కు కేసులే తప్ప, రాష్ట్ర ప్రయోజనాలేవీ అవసరం లేదని ఆరోపించారు. ప్రత్యేక హోదాపై జగన్‌కు చిత్తశుద్ధి లేదని, ఆయన శ్రద్ధంతా కేసులపైనే అని ఎద్దేవా చేశారు.

# గిట్టుబాటు ధర రావాలి

- పంటకు మంచిధర వచ్చి రైతు పూర్తి ప్రయోజనం పొందాలి
- దావోస్ నుంచి టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం ఆదేశం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 23: చేతికొచ్చిన పంటకు తగు విధంగా గిట్టుబాటు ధర వచ్చి రైతే పూర్తి ప్రయోజనం పొందేలా గట్టి చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. దావోస్ నుంచి అధికారులతో మంగళవారం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. దావోస్‌లో వివిధ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నప్పటికీ, రాష్ట్రంలో రైతుల విషయంలో ప్రత్యేకంగా అధికారులతో సమాలోచనలు చేస్తూ ముఖ్యమంత్రి ఈ ఆదేశాలు జారీ చేశారు. చేతికొచ్చిన వరి పంటకు తగు విధంగా రైతులు ప్రయోజనం పొందేలా పగడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పట్టిసీమ వల్ల రైతులు ముఖ్యంగా కృష్ణాజిల్లా ప్రజలకు పుష్కలంగా పంట చేతికొచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. తద్వారా రైతులకు చేకూరిన అదనపు ప్రయోజనానికి తగు ప్రతిఫలం దక్కాలన్నారు. వ్యవసాయ, పౌర సరఫరాలశాఖ అధికారులు రంగంలోకి దిగి, రైతులకు అండగా నిలవాలని ఆదేశించారు. రైతులకు ఏ మాత్రం నష్టం కలిగినా సహించేది లేదని హెచ్చరించారు. ముఖ్యంగా కృష్ణాజిల్లా కలెక్టర్ అప్రమత్తంగా వ్యవహరించి గిట్టుబాటు ధరపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, రైతుల మేలు కోసం కృషి చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులను నమ్మి మోసపోకుండా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

### హెచ్‌పిఎఫ్‌ఎస్ లేని మద్యం దుకాణాలకు

# సరుకు సరఫరా నిలిపివేత

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: రాష్ట్రంలో కల్తీ, ఇరుగు పొరుగు రాష్ట్రాల మద్యం అమ్మకాల నియంత్రణకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ గట్టి చర్యలు చేపట్టింది. మద్యం తయారీ నుంచి పంపిణీ, నిలువ, విక్రయం వరకు ఎక్సైజ్ శాఖ కనుసన్నల్లో నడిచేలా అన్ని మద్యం దుకాణాల్లో 'హెడానిక్ పాత్ ఫైండర్ సిస్టం' (హెచ్‌పిఎఫ్‌ఎస్)ను విధిగా ప్రతి మద్యం దుకాణంలో ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. సుమారు రూ. 90వేల విలువైన ఈ సిస్టం కంప్యూటర్‌కు అనుసంధానమై ఉంటుంది. ఈ విధానం ద్వారానే సమీప మద్యం డిపోలకు అర్డర్‌లు ఇచ్చుకోవాల్సి ఉంది. అప్పుడే మద్యం నిలువ డెలివరీ జరుగుతుంది. వైన్ షాపుల్లో అయితే ఈ విధానం ద్వారానే ఎంఆర్‌పి, సంబంధిత బ్యాచ్ నెంబర్ వచ్చే బిల్లును కస్టమర్లకు అందించాల్సి ఉంది. ఏడాది క్రితమే ఈ విధానాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉన్నప్పటికీ యజమానులు ఎప్పటికప్పుడు వాయిదా అడుగుతూ వచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,300 వైన్‌షాపులు, 700 బార్ అండ్ రెస్టారెంట్‌లు ఉన్నాయి. సాలీనా రూ. 20వేల కోట్ల అమ్మకాలు జరుగుతాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం 3,500 వైన్‌షాపులు మాత్రమే వీటిని ఏర్పాటు చేసుకున్నాయి. ఈ నెల 20వ తేదీ నాటికి విధిగా ప్రతి దుకాణదారుడు ఈ సిస్టంను అమర్చుకోవాల్సి ఉంది. బార్ అండ్ రెస్టారెంట్లకు అయితే నెలాఖరు వరకు గడువు ఇచ్చారు. దీంతో ఈ విధానాన్ని అమర్చుకోని దుకాణదారులకు రాష్ట్రం వ్యాప్తంగా వివిధ డిపోల్లో ఈ నెల 21వ తేదీ నుంచి సరుకు సరఫరా నిలిపివేస్తూ మంగళవారం పలు చోట్ల ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేశారు. సరుకు డెలివరీ నిలిచిపోవటంతో బార్ యజమానులు ఉరుకులు పరుగులు తీస్తూ ఎక్సైజ్ మంత్రి జవహర్‌ను కలిసినట్లు తెలిసింది. ఆయన జోక్యం చేసుకుని వీరికి నెలాఖరు వరకు గడువు పొడిగింపచేసినట్లు తెలిసింది.

# పోలీసుల సొంతింటి కల నిజం చేస్తాం

- ఏపీ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్‌మీరా
- ఆయేషా కేసు పునర్విచారణపై హైకోర్టు ఆదేశాలు అందాయన్న డీజీపీ
- కోళ్ళ పందాలపై న్యాయస్థానానికి వివరిస్తామని స్పష్టీకరణ

విజయవాడ (క్రైం), జనవరి 23: పోలీసుశాఖలోని ప్రతి పోలీసుకు సొంత ఇంటి కల నిజం చేయాలన్నదే లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కె నాగుల్‌మీరా అన్నారు. రాష్ట్రంలోని పోలీసులందరికీ క్వార్టర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్థలం ఇస్తే కొంతలోనుతో పోలీసు సొంత ఇంటి కల నిజం చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. విజయవాడలో పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ బోర్డు మీటింగ్ మంగళవారం జరిగింది. డీజీపీతో పాటు హోం సెక్రటరీ అనూరాధ ఇతర పోలీసు ఉన్నతాధికారులు హాజరుకాగా.. పలు అంశాలపై చర్చించారు. అనంతరం చైర్మన్ మీరా విలేఖరులతో మాట్లాడుతూ పోలీసుశాఖ భవన సముదాయాల్లో రాష్ట్రం నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో సిఐడి కార్యాలయాలు, ఏసిబి, ఎస్పీల బంగ్లాలతోపాటు 22 కోట్లతో అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబ్‌కు సంబంధించి నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఇదిలావుండగా సమావేశానికి హాజరైన డీజీపీ ఎం మాలకొండయ్య అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ ఆయేషామీరా హత్య కేసు ప్రస్తావించగా కేసు పునర్విచారణపై హైకోర్టు ఆదేశాలు తమకు అందాయని, హైకోర్టు పర్యవేక్షణలో ఆయేషా కేసును సిట్ పునర్విచారణ చేస్తోందని చెప్పారు. కోడి పందాల నిర్వహణపై కోర్టు అడిగిన నివేదక సమర్పించనున్నట్లు తెలిపారు. కోడి పందాల నివారణకు పోలీసుపరంగా తీసుకున్న చర్యలను వివరిస్తామని చెప్పారు. పోలీసుల సొంతింటి ఇంటి కల నెరవేర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

### ఎస్‌ఎస్‌సి, ఇంటర్ పరీక్షల్లో

## మాస్ కాపీయింగ్‌పై ఆందోళన

- రెండు రాష్ట్రాల సీఎస్‌లు నివేదిక ఇవ్వాలి
- తెలుగు రాష్ట్రాలకు హైకోర్టు ఆదేశం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 23: ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ఎస్‌ఎస్‌సి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగడంపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. మాస్ కాపీయింగ్‌ను అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోతే, విద్యా ప్రమాణాలు దిగజారుతాయని హైకోర్టు పేర్కొంది. ఇన్విజలేటర్లు మాస్ కాపీయింగ్‌ను నిరోధించని పక్షంలో క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలంగాణ ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఏలూరుకు చెందిన డాక్టర్ శ్రీనివాస్ గుంటుపల్లి అనే వ్యక్తి దాఖలు చేసిన పిల్‌ను హైకోర్టు విచారించింది. ఈ పిల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, జస్టిస్ ఎం గంగారావుతో కూడిన ధర్మాసనం విచారించింది. పిల్లల విజ్ఞానం పెరిగేందుకు అవకాశం ఇవ్వకుండా, ప్రాధాన్యత ఇవ్వకుండా, ఎక్కువ మార్కులను సాధించాలనే వత్తిడికి గురి చేస్తున్నారని హైకోర్టు పేర్కొంది. దీనివల్ల విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నారని హైకోర్టు భావించింది. పరీక్ష కేంద్రాల్లో బాధ్యులైన ఇన్విజలేటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు సూచించింది. మాస్ కాపీయింగ్‌ను నిరోధించని పక్షంలో డిఇవోలు, విద్యా శాఖకు చెందిన ప్రిన్సిపల్ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని, వారిని జవాబుదారీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ తరపున న్యాయవాది వాదనలు వినిపిస్తూ, పరీక్ష కేంద్రంలో సిసి కెమెరాలు అమర్చుతున్నా, కాపీయింగ్ ఆగడంలేదన్నారు. కొన్ని ప్రైవేట్ స్కూళ్లు మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నాయన్నారు. అనంతరం ఈ కేసు విచారణను మూడు వారాల పాటు వాయిదావేశారు.

## కాపులకు బీసీ (ఎఫ్) సర్టిఫికెట్ ఇస్తేనే అసలైన రిజర్వేషన్

- కాపునేత ముద్రగడ

పొన్నూరు, జనవరి 23: రాష్ట్రంలోని అన్ని మండలాల్లో కాపులకు బీసీ (ఎఫ్) సర్టిఫికెట్ మంజూరు చేసినప్పుడే అసలైన రిజర్వేషన్ వర్తింప చేసినట్లవుతుందని కాపునాడు కన్వీనర్, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. గుంటూరు జిల్లా పొన్నూరులో మంగళవారం జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపుల రిజర్వేషన్ బిల్లుకు ఇప్పటికే శాసనసభ, శాసనమండలి ఆమోదంతో పాటు గవర్నర్ సంతకం కూడా చేశారన్నారు. ప్రభుత్వం తొలివిడతగా 700 పోస్టులు, రెండోవిడత మరో 700 పోస్టులను విడుదల చేయటమేకాక త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించనుందని, పోలీసు శాఖలో కూడా వేలాది ఉద్యోగాలు ఉన్నాయని, ఉద్యోగావకాశాలు అన్నీ పూర్తయ్యాక కాపులకు రిజర్వేషన్ ఇచ్చి ఏం ఉపయోగమని ప్రశ్నించారు. కాపు జాతికి అన్యాయం చేయవద్దని, ఆకలి తీర్చమని అడుగుతున్నట్లు తెలిపారు. రిజర్వేషన్ ప్రకటించి కాపు యువతను శాంతింప చేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పిన సీఎం నాలుగేళ్లయినప్పటికీ ప్రకటించలేదని, దీనివల్ల తమ జాతి ఉపాధి అవకాశాలను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాపులకు రిజర్వేషన్ వస్తుందనే నమ్మకం తమ జాతికి ఉందన్నారు. బీసీ కులాలకు ఎలాంటి రిజర్వేషన్ వర్తింప చేస్తున్నారో అలాగే తమకు కూడా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

### విద్యార్థుల ఆత్మహత్య కేసులో

# తెలుగు రాష్ట్రాలకు హైకోర్టు నోటీసులు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 23: ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో విద్యార్థులు చదువుల వత్తిడితో మానసిక ఆందోళనకు గురై ఆత్మహత్యలకు పాల్పడడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ కేసులో ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలతో పాటు నారాయణ, శ్రీచైతన్య కాలేజీల యాజమాన్యాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసును హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, జస్టిస్ ఎం గంగారావు విచారించారు. ప్రకాశం జిల్లాకు చెందిన లోక్‌సత్తా నేత దాసరి ఇమాన్యుయేల్ పంపిన లేఖను హైకోర్టు విచారించింది.

రెండురాష్ట్రాల్లో చాలా వరకు ప్రైవేట్ కాలేజీలు ఆంధ్రాకు చెందిన మంత్రి ఆధ్వర్యంలో నడుస్తున్నాయన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలపై కమిటీని నియమించినట్లు ఆంధ్రప్రభుత్వం ప్రకటించినా, ఇంతవరకు ఆ నివేదిక తయారు కానట్లు అనిపిస్తుందన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నోటీసులు ఇచ్చిన అనంతరం హైకోర్టు అఫిడవిట్లు దాఖలుచేసేందుకు మూడు వారాలు గడువు ఇస్తూ కేసు విచారణను వాయిదా వేసింది.


## ఎఎస్పీ సునీత, సీఐ మల్లికార్జునరెడ్డి సస్పెన్షన్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 23: పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ శాఖ ప్రతిష్ఠకు భంగం కలించినందుకు ఏసిబి అదనపు ఎస్పీ డి సునీత, కల్వకుర్తి ఇన్‌స్పెక్టర్ వై మల్లికార్జునరెడ్డిని సస్పెండ్ చేస్తునట్లు హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి ప్రకటించారు. ఈ రకమైన సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, శాఖకు మచ్చ తెచ్చే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ప్రకటనలో హెచ్చరించారు.


# కుల, మత ప్రస్తావన లేని రాజకీయాలే లక్ష్యం

- ఆంధ్ర జన్మనిస్తే.. తెలంగాణ పునర్జన్మనిచ్చింది
- మార్చి 14లోగా జనసేన పార్టీ పూర్తి ప్రణాళిక
- తెలంగాణ నాలుగేళ్ల పసిబిడ్డ, అందరం రక్షించుకోవాలి
- తెలంగాణ అంటే నాకు వ్యతిరేకత లేదు.. ఇష్టం.. ప్రేమ
- మడమ తిప్పే మనిషిని కాదు.. మాటమీద నిలబడతా
- సమన్వయకర్తల సమావేశంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్



ఆంధ్రభూమి బ్యూరో

కరీంనగర్, జనవరి 23: కుల, మతాల ప్రస్తావన లేని రాజకీయాలే జనసేన పార్టీ లక్ష్యమని ఆ పార్టీ అధినేత, సినీ నటుడు కొణిదెల పవన్‌కళ్యాణ్ స్పష్టం చేశారు. భారతదేశంలో కులాలను విస్మరించి రాజకీయాలు చేయలేమని, అన్ని కులాలను గౌరవించాల్సిన అవసరముందని అన్నారు. ఆఖండ భారత్ విడిపోయినప్పుడు.. పాకిస్తాన్ ముస్లిం దేశంగా, భారత్ హిందు దేశంగా కొందరు చెప్పారని, కానీ మన నాయకులు మాత్రం తమది సెక్యులర్ దేశమని చెప్పారని, అందుకే లౌకికవాద దేశంగా మనది మిగిలిపోయిందని తెలిపారు. మంగళవారం కరీంనగర్ శివారులోని శుభం గార్డెన్స్‌లో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గాల సమన్వయకర్తలతో పవన్ సమావేశమై మార్గనిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ ఏ పార్టీలైనా సిద్ధాంతాలు లేకుండా ముందుకు వెళ్లలేవని, జనసేనకు సంబంధించి ఏడు సిద్ధాంతాలను ప్రకటించారు. కులం, మతాలను కలిపే ఆలోచన విధానం, అవినీతి, అక్రమాలపై రాజీలేని పోరాటాలు, ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదం, పర్యావరణాన్ని కాపాడటమే పార్టీ లక్ష్యమని అన్నారు. మార్చి 14లోగా పూర్తి ప్రణాళికను ప్రకటిస్తానని చెప్పారు. రాజకీయాల్లోకి కొత్త రక్తం రావాల్సిన అవసరముందని అన్నారు. నిజమైన అభివృద్ధి, అవినీతి రహిత సమాజం ఒక్క రోజులో సాధ్యంకాదని, పాతికేళ్ల సుదీర్ఘ యుద్ధానికి అందరు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ తనకు జన్మనిస్తే.. తెలంగాణ పునర్జన్మ నిచ్చిందని అన్నారు. 2009లో కొండగట్టు అంజన్న తనను కాపాడారని, అందుకే ఈ గడ్డపై నుంచే పూర్తి స్థాయి రాజకీయాల్లోకి వస్తున్నానని అన్నారు. తెలంగాణ నేల తల్లికి ఆఖరి శ్వాస వరకు రుణపడి ఉంటానని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఇరు రాష్ట్రాల్లో నిబద్ధత, బాధ్యతతో కూడిన రాజకీయాలు మాత్రమే చేస్తానని అన్నారు. నేను పెరిగింది ఎక్కువగా తెలంగాణలోనేనని, తెలంగాణ భావోద్వేగం నాలో ఉంది కనుకే తెలంగాణ అంటే చాలా ఇష్టం.. ప్రేమ అని తెలిపారు. అలాగే, తెలంగాణ యాస, భాష, సంస్కృతిని నా సినిమాల్లో ప్రోత్సహిస్తానని గుర్తు చేశారు. సంస్కృతికి గౌరవం ఇవ్వకపోతే ఎవరికైనా బాధ కలుగుతుందని, తెలంగాణ యాస, భాషను గౌరవించి ఉనికిని బలంగా చాటిచెప్పాలని అన్నారు. బతుకమ్మ, సమ్మక్క-సారలమ్మ, సదర్ ఉత్సవాలను కాపాడుకోవాలని అన్నారు. కాంగ్రెస్ నేతలంతా నా అన్నదమ్ములే నని, తన అన్నయ్య చిరంజీవి కూడా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారని గుర్తు చేశారు. నేను ఎవరికీ తొత్తును కాదని, రాజకీయాల్లో వ్యక్తిగతంగా ఎవరితోనూ శతృత్వం లేదని, విధానాలపైనే విభేదిస్తానే తప్ప మరోటి కాదని, నన్ను విమర్శించే వారిని పట్టించుకునే సమయం తనకు లేదని అన్నారు. తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సిద్ధమని తెలిపారు. నేను మడమ తిప్పే మనిషిని కాను, మాట ఇస్తే తిరిగి వెనక్కి తగ్గే ప్రసక్తేలేదని వెల్లడించారు. జన సేనను వేరే పార్టీలో విలీనం చేయాల్సి వస్తే నేను మీ ముందు ఎలా ఉంటానని, 2019 ఎన్నికల్లో తెలంగాణలోనూ జనసేన పార్టీ పోటీ చేస్తుందని అన్నారు. తెలంగాణ యువత, ఆడపడుచుల ఆకాంక్షే జన సేన ఆకాంక్ష అని చెప్పారు. తెలంగాణ ఆశయాల కోసం జన సేన నిలబడుతుందని అన్నారు. నాకు అండగా ఉండండి.. మీ కుటుంబంలో ఒకడిగా చూడండి, నాకు డబ్బులు అవసరం లేదని, ప్రజాభిమానం మించిన సంపద ఏదీ లేదని తెలిపారు. నాకు పునర్జన్మ నిచ్చిన తెలంగాణ తల్లికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాంటూ పవన్ సమావేశాన్ని ముగించారు.



# తిరుమలలో నేడు మినీ బ్రహ్మోత్సవం

## ఒకే రోజు సప్త వాహనాలపై విహరించనున్న శ్రీవారు

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, జనవరి 23: కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుడు కొలువైవున్న తిరుమల పుణ్యక్షేత్రంలో రథసప్తమి వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. సర్వసాధారణంగా స్వామివారి బ్రహ్మోత్సవాల్లో తొమ్మిది రోజులు పాటు స్వామివారు రెండు పూటలా రోజుకు రెండు వాహనాలపై విహరిస్తూ భక్తులను అనుగ్రహిస్తారు. అయితే రథసప్తమి నాడు 5.30 గంటలకు సూర్యప్రభ వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో ఊరేగడానికి బయలుదేరుతారు. ఉత్తర మాడ వీధికి చేరుకుని అక్కడ సూర్యదయం కోసం వేచివుంటారు. భాస్కరుని లేతకిరణాలు స్వామివారి పాదాల నుంచి ఆపాదమస్తకం స్పృశించగానే భక్తులు చేసే గోవిందనామ స్మరణల మధ్య అర్చకులు కర్పూర హారతులు పట్టడంతో వాహనం తూర్పు మాడ వీధి మీదుగా వాహన మండపానికి చేరుకుంటుంది. అనంతరం 9గంటలకు స్వామి, అమ్మవార్లు చిన్న శేష వాహనంపై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. అనంతరం ఉదయం 11 గంటలకు గరుడ వాహనసేన, మధ్యాహ్నం 1 గంటకు హనుమంత వాహనంపైన విహరిస్తారు. అనంతరం 2 గంటలకు శ్రీవారి పుష్కరిణిలో శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహిస్తారు. ఈ చక్రస్నాన సమయంలో భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి పునీతులు అవుతారు. సాయంత్రం 4 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామివారు కల్పవృక్ష వాహనంపైన, సాయంత్రం 6 గంటలకు సర్వభూపాల వాహనంపైన , రాత్రి 8 గంటలకు చందమామ వెన్నెల వెలుగులు, విద్యుత్ దీపాల మధ్య బంగారు, వజ్రాభరణాలు ధరించి విశేషాలంకారంతో దేదీప్యమానంగా వెలుగుతూ చతుర్మాడ వీధుల్లో స్వామివారు విహరిస్తారు. దీంతో రథసప్తమి వేడుకలు పరిసమాప్తమవుతాయి. ఈ రథసప్తమి వేడుకల్లో పాల్గొనేందుకు ఉదయం 4 గంటల నుంచే భక్తులు చతుర్మాడ వీధుల్లో వేచి ఉంటారు. అత్యధికశాతం మంది

ఒకే రోజు ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారు సప్త వాహనాలపై విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. అందుకే ఈ పర్వదినాన్ని భక్తులు మినీ బ్రహ్మోత్సవంగా భావించి ఈ ఉత్సవంలో పాల్గొనేందుకు దేశం నలుమూలల నుంచి తరలివస్తారు. రథసప్తమి పర్వదినంలో స్వామివారిని తిలకించి తరించడానికి లక్ష మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగానే ఏర్పాటు చేస్తున్నారు. స్వామివారు ఉదయం భక్తులు సప్త వాహనాలను తిలకించడానికి తాము కూర్చున్న గ్యాలరీల్లోనే నిరీక్షిస్తుంటారు. వీరికి అవసరమైన అన్నపానీయాలు, అల్పాహారాలు, పాలు, టీ, కాఫీలను నిరంతరాయంగా అందించేందుకు శ్రీవారి సేవకులు తమ సేవలను అందించేలా టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈక్రమంలో మంగళవారం తిరుమల జేఈఓ శ్రీనివాసరాజు, సీవీఎస్వో ఆకె రవికృష్ణ, వీజీఓ రవీంద్రారెడ్డి, సదాలక్ష్మి ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు.

# ఫార్మా డీ విద్యార్థులకు న్యాయం చేస్తాం

## వైద్యశాఖ మంత్రి కామినేని

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: ఫార్మా డీ విద్యార్థులను ప్రభుత్వపరంగా ఆదుకుని తగిన న్యాయం అందించేలా కృషి చేస్తామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం విజయవాడలోని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ నివాసంలో ఫార్మా డీ విద్యార్థుల సంఘంతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఫార్మా డీ విద్యార్థుల సంఘం నేతలు, విద్యార్థులు, ఎమ్మెల్యేలు ప్రభాకర్‌చౌదరి, జితేందర్ గౌడ్‌లతో మంత్రి పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఫార్మా డీ కోర్సును విద్యార్థులు ఆరు బ్యాచ్‌ల వరకు కోర్సు పూర్తిచేసి బయటకు వెళ్లటం జరిగిందని, వారికి సరైన ఉద్యోగావకాశాలు లేవని వారు తెలియజేశారన్నారు. ఫార్మా డీ విద్యార్థులు ఇప్పటివరకు ఈ కోర్సును రాష్ట్రంలో 59 కాలేజీల ద్వారా 20వేల మంది పూర్తిచేశారన్నారు. దేశవ్యాప్తంగా 220 ఫార్మా డీ కాలేజీలు ఉన్నాయని, 10 సంవత్సరాలుగా ఇవి నడుస్తున్నాయన్నారు. మా వృత్తికి తగిన విధంగా గుర్తింపు లేదని వీరు తెలియజేశారన్నారు. కోర్సుకు సంబంధించి నిర్దిష్టమైన ప్రణాళిక లేకుండా మొదలు పెట్టినట్లు తెలుస్తుందని, వైద్యశాఖకు సంబంధం లేని కోర్సుగా ఫార్మా డీ కోర్సు ఉండటంతో పాటు సాంకేతిక విద్యాశాఖ పరిధిలో ఈ కోర్సుకి అనుమతులు ఇస్తున్నారన్నారు. రెగ్యులర్ ఎంబీబీఎస్ కోర్సులో సీటు రాని విద్యార్థులు ఫార్మా డీ కోర్సుల్లో చేరుతున్నారన్నారు.ఫార్మా డీ విద్యార్థులు సబ్జెట్ పరంగా చూస్తే ఎంబీబీఎస్ విద్యార్థులతో సమానంగా చదువుకుంటున్నారన్నారు. వీళ్ల సమస్యలు స్ట్రీమ్ లైన్ చేసేవరకు కొత్త కాలేజీలకు అనుమతులు ఇవ్వకూడదని నిర్ణయించడం జరిగిందన్నారు. ఫార్మా డీ విద్యార్థుల సమస్య నా దృష్టికి రాగానే దీనిపై చర్యలకు ఉపక్రమించడంతోపాటు విద్యార్థులతో చర్చించి తగిన పరిష్కారం కనుక్కునేందుకు కృషిచేస్తామన్నారు. ఉద్యోగావకాశాలు కల్పనకు, వారికి ఏ విధంగా న్యాయం చేయగలమో పరిశీలించటానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కమిటీలో అకడమిక్ డీఎంఈ (కన్వీనర్), హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ, డీజీ డ్రగ్స్, కమిషనర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సభ్యులతో కమిటీని నియమిస్తున్నామన్నారు. ఈ కమిటీ వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధి విధానాలను పరిశీలించి, విద్యార్థులతో చర్చించి ఒక నివేదిక ఇస్తుందన్నారు. ఈ కమిటీ నివేదిక 45 రోజుల్లో సమర్పించాలని ఆదేశించామన్నారు. ఒకసారి విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాస్‌తో చర్చిస్తామన్నారు. ఫార్మా డీ విద్యార్థులకు తప్పకుండా తగిన న్యాయం చేస్తామని, అదే విధంగా ఫార్మా డీ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులను వైద్యమిత్ర, జన ఔషధి కిందకు తీసుకునేందుకు గల అవకాశాలను పరిశీలిస్తామన్నారు.



మంత్రి కామినేనితో సమావేశమైన ఫార్మా డీ విద్యార్థులు

# ‘ఏమ్మా..ఫోన్ సౌకర్యం ఎలా ఉంది?

## దావోస్ నుంచి జాజివలస గ్రామానికి ఫైబర్ నెట్ ప్రారంభం ★ గ్రామస్థులతో ముఖ్యమంత్రి వీడియో ముచ్చట్లు





వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న జాజివలస గిరిజనులు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి/మారేడుమిల్లి, జనవరి 23: జాజివలస.. కొండలు, కోనల నడుమ మారుమూల జనజీవన స్రవంతికి దూరంగా, కనీసం ఫోను సదుపాయానికి కూడా నోచుకోకుండా ఉన్న గ్రామమది. తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీలోని వై.రామవరం మండలం, కనివాడ పంచాయతీ పరిధిలోని ఈ గ్రామం ఇప్పటివరకు ఎవరైనా వెళితే కనీసం మాట్లాడటానికి ఎలాంటి ఫోను సదుపాయం, నెట్ కనెక్షన్ ఉండేది కాదు. అలాంటి గిరిజన ప్రాంతాన్ని అక్కడ ప్రజలు ఏ మాత్రం ఊహించని విధంగా దావోస్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా వీడియో ఫోను ద్వారా పలుకరించి, వారి యోగక్షేమాలు అడిగేసరికి జాజివలస ప్రజలు పులకించిపోయారు. రంపచోడవరం నుంచి దాదాపు 80 కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ పల్లెను తొలిసారిగా మంగళవారం ఫోను, ఇంటర్నెట్, కేబుల్ టీవీ సదుపాయాలు పలకరించాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ సంస్థ వ్యయప్రయాసలకు ఓర్చి ఈ మారుమూల గిరిజన గ్రామాన్ని సాధారణ జనంతో మమేకమయ్యేలా కనెక్టివిటీ కల్పించింది. జాజివలసకు కల్పించిన ఈ సదుపాయాన్ని ముఖ్యమంత్రి దావోస్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. జాజివలసకు కల్పించిన నవ సాంకేతిక సదుపాయం పనితీరు ఎలా ఉందో స్వయంగా అక్కడ గిరిజనులతో మాట్లాడి తెలుసుకున్నారు. జాజివలస ప్రజలతో ఫోను ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అక్కడ ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ‘ఏమమ్మా ఈ సదుపాయం ఎలా ఉంది, దీని ద్వారా ఎలాంటి ఉపయోగాలు ఉంటాయని అనుకుంటున్నారని’ ఆయన గిరిజనులను అడిగారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

కలలో కూడా ఊహించని విధంగా స్వయంగా ఇలా ముఖ్యమంత్రి తమను పలుకరించే సరికి ప్రజలు ఆనంద డోలికల్లో తేలిపోయారు. ‘సారూ.. చాలా సంతోషం సారూ, మీరు మాతో ఇలా మాట్లాడటం, మా ఊరికి ఫోను ఇచ్చినారు మీరు, మీకు కృతజ్ఞతలు’ అని జాజివలస మహిళలు తెలిపారు. తమ ఊరికి ఊహించని విధంగా రోడ్డు కూడా వేస్తున్నారని అది తమకెంతో సంతోషంగా ఉందని తెలిపారు. దానికి ముఖ్యమంత్రి మాట్లాడుతూ ‘ఒక్క ఫోను ఏంటమ్మా మీ ఊరికి ఇప్పుడు ఇంటర్నెట్, కేబుల్ టీవీ అన్నీ వచ్చాయి. టెలీ మెడిసిన్ ఒక్కటేమిటీ, దీనివల్ల మీకు తెలియని ప్రయోజనాలు ఎన్నో కలగబోతున్నాయని’ అన్నారు. జాజివలసకు ఫైబర్ నెట్ సదుపాయం కల్పించడం తనకు చాలా ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు.

### ఫైబర్ నెట్‌కు అభినందనలు

జాజివలస గిరిజన గ్రామానికి వైర్‌లెస్ నెట్ సదుపాయాన్ని దిగ్విజయంగా కల్పించిన ఆంధ్ర ప్రదేశ్ ఫైబర్‌నెట్ సంస్థను, ఆ సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) అహ్మద్‌బాబు, అధికారులు, సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు. ‘గుడ్ చాలా బాగా చేశారు, ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలో ఇలా ఏ మాత్రం కనెక్టివిటీ లేని ప్రాంతాలకు ఇదే తరహా కనెక్టివిటీని కల్పించాలని’ సూచించారు. జాజివలసకు ఈ సదుపాయం ఎలా కల్పించిందీ ఫైబర్‌నెట్ సీఈఓ ఎ.బాబు వివరించారు.

### ప్రపంచంలోనే తొలిసారి...

ఏ మాత్రం కమ్యూనికేషన్ సదుపాయం కల్పించడానికి అవకాశం లేని మారుమూల ప్రాంతాలకు కూడా ఇలా ఏకంగా టెలిఫోను, కేబుల్ టీవీ, ఇంటర్నెట్ సదుపాయాన్ని వైర్‌లెస్ ద్వారా కల్పించడం ప్రపంచంలోనే ఇదే తొలిసారి అని ఫైబర్ నెట్ వర్గాలు తెలిపాయి. దీని కోసం ఫైబర్ నెట్ సంస్థ గూగుల్ ఎక్స్ సంస్థ సహకారం తీసుకుని ఎఫ్ఎస్ఓసీ ద్వారా ఈ సదుపాయం కల్పించింది. దీనికోసం ఏపీ ఫైబర్ నెట్ చేసిన ప్రయత్నాలు విజయవంతమయ్యాయి.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రంపచోడవరం ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, రంపచోడవరం ఐటీడీఏ పీవో దినేష్‌కుమార్, ఫైబర్ నెట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్స్

## ప్రిన్సిపాల్స్‌తో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ★ తొలిసారిగా ఎగ్జామినర్లకూ జంబ్లింగ్



ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, మరింత పారదర్శకంగా పరీక్షలను నిర్వహించేందుకు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన కాకినాడ జెఎన్‌టీయూ సమావేశ మందిరం నుండి ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్స్‌తో ప్రాక్టికల్ పరీక్షలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేయాలన్నారు. ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష తప్పనిసరిగా పాస్ కావాల్సిందేనని త్రి గంటా స్పష్టం చేశారు. ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష 27న, అదే విధంగా ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష 29న జరుగుతుందన్నారు. పారదర్శకంగా పరీక్షలు నిర్వహించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి సెంటర్‌లోనూ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ప్రతి ల్యాబరేటరీలోనూ 2 సీసీటీవీ కెమెరాలు ఉంటాయన్నారు. ఫిబ్రవరి 1 నుంచి 21వ తేదీ వరకు ప్రాక్టికల్స్ జరుగుతాయని, ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మరో సెషన్‌లో పరీక్షలు జరుగుతాయని మంత్రి గంటా తెలిపారు. గతంలో విద్యార్థులకు జంబ్లింగ్ విధానం ఉండేదని, ఇప్పుడు విద్యార్థులకు, ఇన్విజలేటర్లకు కూడా జంబ్లింగ్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. గతంలో మూడు రోజులకు ఒక్కసారి ఇన్విజలేటర్లను మార్చేవారని, కానీ ఇప్పుడు ప్రతి రోజు వారిని మార్చే విధానాన్ని తీసుకొచ్చామని తెలిపారు. విద్యార్థులు నేలపైన కూర్చొని పరీక్షలు రాస్తే సహించేది లేదని, అవసరమైతే నిధులు తీసుకొని పూర్తి స్థాయిలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. ప్రాక్టికల్స్ పరీక్షలకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను ఈ సందర్భంగా మంత్రి గంటాకు ఆర్‌జేడీలు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీ బీ ఉదయలక్ష్మి, ఆర్‌జేడీలు, అన్ని ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

# పవన్‌తో భేటీకి నేతల ఆసక్తి

## పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న టీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల అనుచరులు



ఆంధ్రభూమి బ్యూరో

ఖమ్మం, జనవరి 23: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కలిసేందుకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన పలువురు రాజకీయ నేతలు ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు సంబంధించి బుధవారం ఉదయం కొత్తగూడెంలోనూ, సాయంత్రం ఖమ్మంలోనూ ఆయనతో అపాయింట్‌మెంట్ కూడా తీసుకున్నారు. అధికార టీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్, టీడీపీలకు చెందిన పలువురు నేతలు ఆయనను కలిసి సంఘీభావం తెలపనున్నట్లు సమాచారం. ఇదే సమయంలో జిల్లాలో పార్టీల పరిస్థితులు, తమ నేపథ్యం కూడా చెప్పనున్నారు. మరోవైపు కొత్తగూడెం జిల్లా కేంద్రంలో పవన్‌కల్యాణ్ కార్యక్రమ ఏర్పాట్లను టీఆర్ఎస్‌కు చెందిన నేతలే చేస్తుండగా ఖమ్మంలో మాత్రం బహిరంగంగా బయటపడకుండా లోపాయికారిగా మద్దతిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా రెండుజిల్లాల పరిధిలో సుమారు 80కిలోమీటర్ల మేర బుధవారం పవన్‌కల్యాణ్ ర్యాలీ చేపట్టనుండగా ఇందుకు సంబంధించి ఆయా మండల కేంద్రాల్లో ఏర్పాట్లను కూడా టిఆర్ఎస్, కాంగ్రెస్ నేతలే చేపడుతున్నారు. అయితే కొందరు ప్రధాన నేతలు తాము బయటపడకుండా తమ అనుచరులతో ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఏర్పాట్లను పర్యవేక్షించే నేత ఖమ్మం ఎంపి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అనుచరుడుగా ఉన్నాడు. అంతేకాకుండా పవన్‌కల్యాణ్‌ను కలిసేవారిలో ఆ పార్టీలకు చెందిన ప్రధాన నేతలు కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా పవన్‌కల్యాణ్ జిల్లా పర్యటన తరువాత రాజకీయ పరిస్థితిని అంచనా వేసి అవసరమైతే మరుసటి రోజున ఆయనను హైదరాబాద్‌లో కలిసేందుకు మరికొందరు నేతలు సిద్ధమవుతున్నారు. గతంలో ప్రజారాజ్యం పార్టీలో చురుకుగా పాల్గొన్న నేతలతో పాటు ప్రస్తుతం అధికార టిఆర్ఎస్‌లో అసంతృప్తులుగా ఉన్న నేతలు కూడా ఈ జాబితాలో ఉన్నారు.

# చంద్రబాబుకు గుడి!

## పెన్షన్లు ఇచ్చి ఆదుకున్న సీఎం ★ ముందుకొచ్చిన హిజ్రాలు

## వెండి విగ్రహం సిద్ధం ★ నంద్యాల శివారులో నిర్మాణం

ఆంధ్రభూమి బ్యూరో

కర్నూలు, జనవరి 23: తమకంటూ ప్రత్యేక గుర్తింపునిచ్చి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో భాగస్వాములను చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు గుడి కట్టి కృతజ్ఞత చాటుకునేందుకు హిజ్రాలు సిద్ధమయ్యారు. కర్నూలు జిల్లా నంద్యాల పట్టణం నుంచి మహానందికి వెళ్లే మార్గంలో గుడి కట్టేందుకు అవసరమైన స్థలం, చంద్రబాబు వెండి విగ్రహాన్ని సిద్ధం చేశారు. త్వరలో గుడి నిర్మాణం పనులు ప్రారంభించనున్నారు. అటు స్త్రీ, ఇటు పురుషులు కాకుండా మూడవ వర్గంగా ఉన్న హిజ్రాలు సమాజంలో గుర్తింపునకు నోచుకోక, వెలివేసినట్లు సమాజానికి దూరంగా ఉంటూ హక్కుల కోసం దశాబ్దాల తరబడి పోరాడుతున్నారు. ఉద్యోగాలు, ఉపాధి వంటి అవకాశాలు లేకపోవడంతో భిక్షాటనను వృత్తిగా ఎంచుకుని జీవనం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ పథకాలను అన్నివర్గాల ప్రజలకు అందిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు ఇటీవల హిజ్రాల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించారు.

వారి సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటుచేసి నివేదిక తెప్పించుకున్నారు. అనంతరం హిజ్రాలకు ప్రతి నెల రూ.1500 పెన్షన్, పక్కాగృహం, వ్యాపారం చేయగల శక్తి ఉన్న వారికి సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. బాబు ఆదేశంతో కర్నూలు జిల్లాలో సుమారు 4 వేల మంది హిజ్రాలకు లబ్ధి చేకూరుతోంది. చంద్రబాబు చేసిన సహాయానికి కృతజ్ఞతగా ఆయనకు ఆలయం కట్టించాలని నంద్యాల ప్రాంత హిజ్రాలు నిర్ణయించారు. ఈ సందర్భంగా భారత జాతీయ సమత హిజ్రాల హక్కుల ఐక్య పోరాట సమితి వ్యవస్థాపకులు, అడ్వైజర్ విజయకుమార్ మాట్లాడుతూ నంద్యాల టీడీపీ నేత అభిరుచి మధు పది కిలోల వెండితో చంద్రబాబు విగ్రహాన్ని తయారు చేసి ఇస్తున్నట్లు తెలిపారు. విజయ మాట్లాడుతూ దశాబ్దాల పోరుకు న్యాయం జరిగిందని, సీఎం స్పందించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని నిర్ణయించడం హర్షనీయమన్నారు. తమవర్గం బాగోగులు పట్టించుకున్న ఆయన తమ పాలిట దేవుడేనని ఆమె అభివర్ణించారు.

# మంత్రి గంటాకు ‘టెట్’ సెగ!

## కాకినాడలో వాహనాన్ని అడ్డుకున్న అభ్యర్థులు ■ పరీక్ష వాయిదా వేయాలని డిమాండ్



కాకినాడలో మంత్రి గంటా వాహనాన్ని చుట్టుముట్టిన టెట్ అభ్యర్థులు

ఆంధ్రభూమి బ్యూరో

కాకినాడ, జనవరి 23: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టిఇటి) సమయాన్ని పొడిగించాలని డిమాండు చేస్తూ వేల సంఖ్యలో ఉపాధ్యాయ అభ్యర్థులు మంగళవారం రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వాహనాన్ని ముట్టడించారు. వాహనాన్ని చుట్టుముట్టిన సుమారు 2వేల మంది అభ్యర్థులు ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో మంత్రి కాన్వాయ్ ముందుకు కదల్లేని పరిస్థితిలో స్తంభించింది. తూర్పు గోదావరి జిల్లా కేంద్రం కాకినాడ నగరంలోని ఓ కార్పొరేట్ హోటల్‌లో మంత్రి మంగళవారం మధ్యాహ్నం విశ్రాంతి తీసుకున్న అనంతరం బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా అనూహ్యంగా వేలాదిగా అభ్యర్థులు హోటల్ వద్దకు చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ నినదించారు. దీంతో మంత్రి అభ్యర్థులనుద్దేశించి అక్కడే మాట్లాడారు. ఎంతమంది పరీక్ష వాయిదా వేయమని కోరుతున్నారో అంతేమంది వాయిదా వేయవద్దని కోరుతున్నారని చెప్పారు. గతంలో ఓసారి వాయిదా వేశామని, ఇటీవల మరో మూడు వారాలు వాయిదా వేశామని, ఇలా వాయిదాలపై వాయిదాలు వేసుకుంటూ పోతే ఎపుడు పరీక్ష నిర్వహించాలని’ మంత్రి ప్రశ్నించారు. ఇలా అయితే డిఎస్సీ ఎపుడు పెట్టాలి? జూన్ 12న పాఠశాలలు తెరిచేలోగా ఉపాధ్యాయ పోస్టులివ్వాలంటే ఎలా? అని గంటా అభ్యర్థులను ప్రశ్నించారు. పీజీ కోర్సు స్థాయిలో టెట్ సిలబస్‌ను 15రోజుల్లో ఎలా పూర్తిచేయాలని మంత్రి గంటాను ఆందోళనకారులు నిలదీశారు. ‘అనవసరంగా రోడ్డు మీద తిరక్కుండా చదువుకోవాలి కదా’ ఈసందర్భంగా మంత్రి వ్యాఖ్యానించారు. పేపర్-3ని మార్పుచేసి పరీక్ష నిర్వహించేలా అవకాశం కల్పించాలని, పేపర్-3ని వాయిదా వేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిగా అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారని మంత్రికి అభ్యర్థులు వివరించారు. దీనిపై ప్రభుత్వంతో మాట్లాడి తదుపరి నిర్ణయం తీసుకుంటామని గంటా హామీనిచ్చారు. ఆందోళనకారులు చాలాసేపు మంత్రి వాహనాన్ని ముందుకు కదలనివ్వకపోవడంతో పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తేవడంతో మంత్రి కాన్వాయ్ ముందుకు కదిలింది. అనంతరం టెట్ అభ్యర్థులు కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన ప్రదర్శన చేపట్టారు. కాగా టెట్ పై బుధవారం ఒక నిర్ణయం తీసుకుంటామని మంత్రి విలేఖర్లకు తెలిపారు. రాష్ట్రంలో సుమారు 4 లక్షల మంది టెట్‌కు ప్రిపేర్ అవుతున్నారన్నారు. ఒకటి, రెండు నెలల పాటు పరీక్ష వాయిదా వేయాలని అభ్యర్థులు కోరుతున్నారన్నారు.

# కడప కలెక్టరేట్‌లో తండ్రీకొడుకుల ఆత్మహత్యాయత్నం!

ఆంధ్రభూమి బ్యూరో

కడప,జనవరి 23: కుటుంబ కలహాలు తండ్రీకొడుకుల ప్రాణాల మీదకు తెచ్చింది. భార్య కాపురానికి రావడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తూ గంగరాజు, తండ్రి కోసం కొడుకు రాకేష్ వాస్మోయిల్ తాగి ప్రాణాలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. తండ్రి పరిస్థితి విషమంగా ఉండగా, కుమారుడు ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డాడు. కడప కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం జరిగిన ఈ సంఘటన కలకలం రేపింది. పులివెందుల మండలం మోట్‌నూత్నపల్లెకు చెందిన గంగరాజు(45), అతని కుమారుడు రాకేష్(12) మంగళవారం కడప కలెక్టరేట్‌లో వాస్మోయిల్ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మాకు న్యాయం చేయండి అంటూ గంగరాజు కేకలు వేస్తూ వాస్మోయిల్ తాగాడు. ఇది గమనించిన రాకేష్ తానూ వాస్మోయిల్ తాగాడు. కలెక్టరేట్ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న ఉద్యోగులు, కలెక్టర్ సెక్యూరిటీ, చుట్టుపక్కలవారు వారించే లోపే గంగరాజు ఎక్కువ మోతాదులో తాగాడు. వెంటనే 108 వాహనానికి ఫోన్‌చేసి వీరిని రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. గంగరాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. గంగరాజు ఆయన భార్య అంజలికి మధ్య ఏడాదికాలంగా మనస్పర్థలు ఉన్నాయి. చిన్న గొడవతో భార్య ఇంటిని వదిలి పెద్ద కుమార్తె, చిన్నకొడుకును తీసుకుని ప్రొద్దుటూరులో నివాసం ఉంటోంది. భార్య, పిల్లలను తనవద్దకు తెచ్చుకునేందుకు గంగరాజు అనేక ప్రయత్నాలు చేశారు. అయినా భార్య రావడానికి అంగీకరించలేదు. పోలీసులను ఆశ్రయించినా న్యాయం జరగలేదు. గంగరాజు తన పెద్దకొడుకుతో కలిసి గ్రామంలో ఉంటూ హోటల్ పని చేస్తున్నాడు. భార్య, కూతురు, కుమారుడు వేర్వేరుగా ఉండటంతో జీర్ణించుకోలేక పోయిన గంగరాజు తనకు ఎవ్వరూ న్యాయం చేయలేదంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.

# నరేంద్ర 'ధుని'

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
బుధవారం, 24 జనవరి 2018

వైవిధ్యాల మధ్య వైరుధ్యం లేని మానవ జీవన ప్రశాంత ప్రగతి ప్రస్థానం భారతీయుల సనాతన - శాశ్వత - సంస్కారం! ఈ సమన్వయ సంస్కారాన్ని ప్రపంచంలోని వివిధ దేశాల వారు అలవరచుకోవాలన్నది మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్విట్జర్లాండ్‌లోని 'దావోస్' ప్రాంగణంలో జరుగుతున్న 'ప్రపంచ ఆర్థిక సమాఖ్య మహాసమ్మేళన ప్రారంభ సమావేశంలో చేసిన ప్రసంగంలోని ఇతివృత్తం! ఆర్థిక ప్రగతితోపాటు, ఐహిక ఆరోగ్యాన్ని, శారీరక మానసిక ఆరోగ్యంతోపాటు జీవన సమగ్రతను పొందదలిచేవారు భారతీయ జీవనాన్ని అధ్యయనం చేయాలన్నది తన 'చారిత్రక' ప్రసంగంలో మానవాళికి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు. మానవాళి సముత్కర్ష అభ్యుదయం సనాతన ప్రశాంతి భారతదేశపు లక్ష్యమన్నది మోదీ చేసిన చారిత్రక పునరుద్ఘాటన! ఆర్థిక ప్రగతి, సృష్టిగత సమగ్ర వికాస ప్రక్రియ నుండి విభిన్నమైనదికాదని, ప్రత్యేకమైనది కాదని, సమగ్ర వికాస ప్రక్రియలో ఆర్థిక అభ్యుదయం ఒక అవిభాజ్య అంశమని భారతీయ ఋషి మునులు, కవులు, మేధావులు, పాలకులు, సంపన్నులు, సామాన్యులు అనాదిగా ధ్వనింప చేసిన జీవన వాస్తవానికి 'దావోస్' సమ్మేళన ప్రారంభ సభలో మోదీ చేసిన ప్రసంగ ప్రతిధ్వని.. ప్రపంచ ప్రజల ఈ సమగ్ర వికాసానికి అడ్డు తగులుతున్న మూడు ప్రధానమైన ప్రమాదాలను నరేంద్రమోదీ ఈ 'ప్రపంచ ఆర్థిక సమాఖ్య' - వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ - డబ్ల్యు.ఇ.ఎఫ్ - సభలో మన ప్రధాని వివరించడం సంపన్న దేశాల విధానాలకు పరోక్ష అభిశంసన! పర్యావరణంలో ప్రమాదకరమైన పరివర్తన, అంతర్జాతీయ బీభత్సకాండ, స్వయం కేంద్రీకృత - ఆత్మకేంద్రిత - విధానాలు మోదీ ప్రస్తావించిన మూడు ప్రమాదాలు! మొదటి రెండు ప్రమాదాలను గురించి జరుగుతున్న ప్రచారం మూడవ ప్రమాదం గురించి జరగడం లేదు. కానీ ఇది కూడ ప్రపంచ సమష్టి హితానికి మొదటి రెండు ప్రమాదాలంత తీవ్రస్థాయిలోనే నష్టం కలిగిస్తోందన్నది ప్రతినిధులకు మోదీ గలిగించగలిగిన ధ్యాస! ఒకవైపున 'ప్రపంచీకరణ'-పేరుతో ఒకే అంతర్జాతీయ సమాజం అవతరిస్తోందన్న నేపథ్యంలో అనేక దేశాలు ఈ స్ఫూర్తికి భిన్నంగా 'సంకుచిత - ప్రొటక్షనిస్ట్ - ఆర్థిక విధానాలను అవలంబిస్తున్నాయని, 'స్వయం కేంద్రిత' - సెల్ఫ్‌సెంట్రిక్ - ఆర్థిక ప్రయోజన సాధన కోసం కృషి చేస్తున్నాయని పేర్కొన్న మోదీ అమెరికా, ఐరోపా, చైనావంటి సంపన్న దేశాలను పరోక్షంగా అభిశంసించాడు! ఈ సంపన్న దేశాలు 'ప్రొటక్షనిస్ట్' 'సెల్ఫ్‌సెంట్రిక్' విధానాలను కొనసాగిస్తుండడం ప్రపంచీకరణ స్ఫూర్తిని నీరుకారుస్తోంది! ఈ మూడు ప్రమాదాల నుంచి ప్రపంచాన్ని కాపాడడానికి మోదీ 'ప్రతీకలు'గా చూపించిన మూడు పరిష్కారాలు భారత్, భారతీయత, భారతీయ సంస్కారం...

ప్రకృతిగతమైన సమన్వయానికి విభిన్నమైన వైరుధ్యం ఏర్పడినందువల్లనే ప్రపంచం ఛిన్నాభిన్నంగా మారి ఉందన్నది మోదీ చెప్పిన మాట.. "ఛిన్నాభిన్న సమాజానికి సర్వ భాగస్వామ్య భవిష్యత్తును సాధించడం లక్ష్యం"గా దావోస్‌లో ఈ 'సమాఖ్య' సమ్మేళనం జరుగుతోంది. ఈ లక్ష్య సాధనకు పై మూడు ప్రమాదాలు కల్పించిన వైరుధ్యం అవరోధంగా మారింది. కానీ భారతదేశం ఇప్పుడు మాత్రమేకాక అతి ప్రాచీన కాలం నుంచి కూడా ఛిన్నాభిన్నం చేయడానికి - తోడ్‌నేకాకామ్ - కాక, సమన్వయాన్ని పెంచడానికి - జోడ్‌నేకాకామ్ - స్వభావంగా సంతరించుకొని ఉందని మోదీ వివరించాడు. 'వాణిజ్య ప్రపంచీకరణ' - గ్లోబలైజేషన్ - కేవలం ఆర్థిక వ్యవహారాలకు పరిమితంగా మారి మిగిలిన జీవన రంగాల నుంచి మానవాళిని విడగొడుతున్న నేపథ్యంలో మోదీ సర్వసమగ్రమైన 'వసుంధరా పరివార' భావాన్ని 'దావోస్'లో పునరావిష్కరించగలిగాడు. ఇది "వసుధైవ కుటుంబకమ్.." పుడమి ఒక పల్లెమాత్రమేకాదు "ప్రపంచ ప్రజలందరూ ఒకే ఇంటివారు.." అన్న భారత జాతీయ సంస్కారం. సనాతన భారతీయ లక్ష్యం ఆర్థిక భౌతిక సమష్టి ప్రగతికి మాత్రమేకాక విశ్వమానవ సాంస్కృతిక ఆధ్యాత్మిక సుగతికి కూడ ప్రతీకలు..

ఈ సాంస్కృతిక ఆధ్యాత్మిక సుగతి ప్రకృతిలో మానవుడు సహజంగా తాదాత్మ్యం - తాల్‌మేల్ - చెంది ఉండడం. "మాతా భూమిః పుత్రోహం పృథివ్యాపి" అన్న వేద వాక్యాన్ని ఉటంకించడం ద్వారా నరేంద్రమోదీ ఈ సనాతన సత్యాన్ని పునరావిష్కరించాడు. "భూమి తల్లి నేను ఆమె పుత్రుడను" అన్న సత్యం జీవన ప్రవృత్తిగా మారిన మానవులు భూమిని కాలుష్యంతో గాయపరచరు. నీరు నిప్పు గాలి ఆకాశం భూమి - ఈ పంచభూతాలతో కూడిన ప్రకృతిలో పాంచభౌతికమైన మానవుడు భాగం.. ఇదీ భారతీయులకు ప్రకృతితో కల 'ఏకాత్మత', సృష్టితో కల 'తాదాత్మ్యము'. అందువల్లనే భారతీయ జీవన విధానం ప్రకృతిని పరిరక్షించింది. ప్రకృతిలోని వనరులను 'అవసరం' - నీడ్ - మేరకు ఉపయోగం ఈ పరిరక్షణ అని, 'అత్యాశ - గ్రీడ్ -తో కొల్లగొట్టడం వినాశహేతువని ఋషిమునులు మొదలు మహాత్మాగాంధీ వరకుగల భారతీయులు సంభావించిన తీరును మోదీ వివరించడం ప్రతినిధులను ప్రభావితం చేయగలిగింది. ప్రాకృతిక కాలుష్యం నిరోధించడానికి ప్రకృతిని మళ్లీ ఆరోగ్యవంతంగా జీవింప చేయడానికి ఏకైక పరిష్కారం, ఏకైక చికిత్స తరతరాల భారతీయత.. బీభత్సకాండ వల్ల జరుగుతున్న విధ్వంసాన్ని భారత దేశం శతాబ్దులుగా ప్రతిఘటించింది! వైవిధ్యాల మధ్య వైరుధ్యం లేని విశ్వ వ్యవస్థ భారతీయుల స్వప్నం, భారతీయుల సంకల్పం, భారతీయుల లక్ష్యం, భారతీయుల జీవనం కావడమే విజయవంతమైన ఈ ప్రతిఘటనకు ప్రాతిపదిక! వైవిధ్యాలను - మత వైవిధ్యాలను, భాషా వైవిధ్యాలను, ఇతరేతర అసంఖ్యాక వైవిధ్యాలను అనాది నుంచి ఆధునిక కాలం వరకు భారతీయులు పరిరక్షిస్తున్నట్టుగానే ప్రపంచంలోని ఇతర దేశాల వారు కూడ రక్షించాలన్నది మోదీ ప్రసంగంలోని 'ధ్వని'.. వైవిధ్య పరిరక్షణ బీభత్స విధ్వంసానికి విరుగుడు..

'ప్రపంచీకరణ' నియమాలను పాటించి ఇతరదేశాల హక్కులను సంరక్షించాలన్నది ప్రతి దేశానికి నరేంద్రమోదీ చెప్పిన పాఠం.. "తేన త్యక్తేన భుంజీథా" - అతడు సంతృప్తి చెంది వదలిపెట్టిన సంపదను నేను అనుభవిస్తాను - అన్నది ఉపనిషత్ మార్గం ఈ పాఠం! "నేను సంతృప్తి చెందిన తరువాత భోం చేయాలి.." అని భావిస్తున్న సంపన్న దేశాలకు ఇది దావోస్‌లో భారతీయుని ప్రబోధం.. "సహనౌభునక్తు.." ఇద్దరం కలసి మెలసి భోజనం చేద్దాము - ఒక్కరే అంతా తినేయరాదు - అన్న మరో మంత్రాన్ని కూడ ఉటంకించిన మోదీ "అందరూ ఆనందంగా ఉండాలి, అందరూ ఆరోగ్యంగా ఉండాలి, అందరూ భద్రంగా జీవించగలగాలి.. ఎవ్వరూ కూడా దుఃఖంలో భాగస్వామి కారాదు.." అన్న భారతీయమైన 'ప్రపంచీకరణ'ను మరోసారి ఆవిష్కరించాడు! "సర్వేపి సుఖినః సన్తు, సర్వే సన్తు నిరామయాః, సర్వే భద్రాణి పశ్యన్తు, మా కశ్చిత్ దుఃఖభాగ్ భవేత్"! రవీంద్ర కవీంద్రుని మాటలలో 'ముక్కలు చెక్కలు కాని ప్రపంచం" మోదీ ఆవిష్కరించిన లక్ష్యం...

# అంతులేని అనుమానాలకు జవాబేదీ?

అనేక మలుపులు తర్వాత జస్టిస్ లోయ అనుమానాస్పద మరణంపై సుప్రీంకోర్టు పునః విచారణ ప్రారంభించింది. దేశంలో దిగ్గజాలైన న్యాయవాదులు సుప్రీంకోర్టు హాలులో వాద ప్రతివాదుల తరపున హాజరయ్యారు. హరీష్ సాల్వే, దుష్యంత్ దవే, ముకుల్ రోహత్గీ, ఇందిరాజైసింగ్ తమ వాదనలు ప్రారంభించారు. బాంబే లాయర్ల సంఘం తరపున దవే హాజరయ్యారు. హరీష్ సాల్వే, ముకుల్ రోహత్గీ మహారాష్ట్ర ప్రభుత్వం తరపున, మహారాష్ట్ర జర్నలిస్టు బందురాజ్ లోనా తరపున ఇందిరాజైసింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనానికి, న్యాయవాదులకు మధ్య ఆసక్తిదాయకమైన చర్చ జరిగింది. దేశ న్యాయవ్యవస్థలో ఇంతకుముందెన్నడూ లేనంత సంక్షోభం నెలకొనడానికి గల కారణాల్లో జస్టిస్ లోయ మృతి కేసు ఒకటి.

పూర్వపరాల్లోకి వెళ్తే... సుప్రీంకోర్టు గాడి తప్పుతోందని నలుగురు సీనియర్ న్యాయమూర్తులు తమ అసంతృప్తి వ్యక్తం చేస్తూ వారు ప్రస్తావించిన కేసుల్లో ప్రధానమైనది జస్టిస్ లోయ అనుమానస్పద మరణంపై దాఖలైన పిటీషన్ ఒకటి. రోస్టర్‌కు తానే మాస్టర్ అని ప్రకటించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని బెంచ్‌కు అప్పగించడం సీనియర్ల అసంతృప్తికి కారణమైంది. సీనియర్ల గళాన్నివిన్న జస్టిస్ అరుణ్ మిశ్రా కేసు విచారణ బాధ్యతల నుండి తప్పుకున్నారు. కేసు పునః విచారణ చేయాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. కేసు విచారణకు ప్రధాన న్యాయమూర్తి కొత్త ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. ఈ బెంచ్‌లో ప్రధాన న్యాయమూర్తితోపాటు జస్టిస్ ఎ ఎం ఖాన్ విల్కర్, జస్టిస్ డి వై చంద్రచూడ్ సభ్యులుగా ఉంటారు. జస్టిస్ లోయ మృతి కేసుకు సంబంధించి అన్ని డాక్యుమెంట్లను తమ ముందుంచాలని వాది-ప్రతివాదిలను ప్రధాన న్యాయమూర్తి ఆదేశించారు. దాంతో కథ మళ్లీ ప్రారంభమైంది. జస్టిస్ లోయ కేసు పునఃవిచారణను సుప్రీంకోర్టు చేపట్టడంతో దేశం అంతా భవిష్యత్ పరిణామాలను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది.





సోహ్రాబుద్దీన్, అతని భార్య కౌసర్ బీ, వారి స్నేహితుడు తులసీదాస్ ప్రజాపతిని గుజరాత్ యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ 2005 నవంబర్ 3న హైదరాబాద్ నుండి సాంగ్లీ వస్తున్నపుడు బస్సులోనుండి దించి విడివిడిగా తీసుకువెళ్లి ఎన్‌కౌంటర్ చేసి చంపేశారనేది ఆరోపణ. ఈ కేసులో అప్పటి గుజరాత్ హోం మంత్రి అమిత్‌షా పేరు వినిపించింది. దాంతో కేసు విచారణను గుజరాత్ నుండి బాంబేకు మార్చారు. దానిపై విచారణ ప్రారంభించిన న్యాయమూర్తిని ఆకస్మికంగా మార్చేశారు. ఆయన స్థానంలో వచ్చిన రెండో న్యాయమూర్తి జస్టిస్ లోయ.

ముంబైలో సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తిగా వ్యవహరించిన జస్టిస్ బ్రిజ్ గోపాల్ హరికిషన్ లోయ (48) 2004లో బాధ్యతలు స్వీకరించే నాటికి కేవలం సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసు మాత్రమే విచారణలో ఉంది. దానిని ఆయన చేపట్టి విచారణ కొనసాగిస్తున్న సమయంలో హఠాన్మరణం చెందారు. సోహ్రాబుద్దీన్‌ను గుజరాత్‌కు చెందిన యాంటీ టెర్రరిజం స్క్వాడ్ ఎన్‌కౌంటర్ చేసింది. అప్పట్లో గుజరాత్ హోంమంత్రిగా ఉన్న ప్రస్తుత బిజెపి అధినేత అమిత్ షా పేరు ఇందులో ప్రస్తావనకు రావడంతో సోహ్రాబుద్దీన్ కేసు ప్రాధాన్యతను సంతరించుకుంది. జస్టిస్ లోయ 2014 డిసెంబర్ 1న ఆకస్మికంగా మరణించారు. సహచరుడు స్వప్నా జోషి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు హాజరైన జస్టిస్ లోయ నాగ్‌పూర్‌లోని సివిల్ లైన్స్‌లో ఉన్న రవి భవన్ అనే విఐపి అతిథి గృహంలో బస చేశారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా ఆయన చనిపోయారని కథనాలు వచ్చాయి. ఆయన మరణం వెనుక పెద్ద మిస్టరీ ఉందని లోయ సోదరి బియానీ తండ్రి హరికిషన్ ఆరోపించారు. అయితే కుమారుడు అనూజ్ మాత్రం తన తండ్రి మరణంలో ఎలాంటి సందేహాలు లేవని బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్ మంజులా చెల్లూర్‌ను వ్యక్తిగతంగా కలిసి వివరించాడు. అయితే ఆయన బయటివారి ఒత్తిళ్ల వల్లే అలా చెప్పి ఉంటారనే కథనాలు కూడా వినిపిస్తున్నాయి. జస్టిస్ లోయ సతీమణి మాత్రం బహిరంగ ప్రకటనకు వెనుకాడుతున్నారు. లోయకు ఛాతినొప్పి వచ్చినపుడు తామే కారులో ఆయనను దగ్గరలోని దండే ఆస్పత్రికి తీసుకువెళ్లామని జస్టిస్ శ్రీధర్ కులకర్ణి, జస్టిస్ శ్రీరామ్ మోదక్‌లు చెప్పడం, మరో కథనంలో రిక్షాలో ఆస్పత్రికి వెళ్లారనడం అనుమానాలకు తావిచ్చింది. జస్టిస్ లోయను ఆస్పత్రికి తీసుకువెళ్లినపుడు స్థానిక జడ్జి విజయకుమార్ బోర్డే కారును డ్రైవ్ చేశారని మరికొందరు చెప్పారు. దండే ఆస్పత్రికి తీసుకువెళ్లేసరికి అక్కడ ఇసిజి మిషన్ పనిచేయలేదని దాంతో సమీపంలోని కార్పొరేట్ ఆస్పత్రి మెడిట్రినాకు తీసుకవెళ్లేసరికే ఆయన మార్గమధ్యంలో చనిపోయారని మరో కథనం. జడ్జీలు ఆయనను తీసుకువెళ్లలేదని, ఆటోరిక్షాలోనే తీసుకువెళ్లారని ప్రత్యక్ష సాక్షులు చెప్పడం మరికొన్ని అనుమానాలకు తావిచ్చింది. ఆరు నిమిషాల్లో వెళ్లాల్సిన దూరానికి 43 నిమిషాలు ఎందుకు పట్టిందనేది కూడా అనుమానమే. జస్టిస్ లోయ మరణంపై అనుమానాలు అక్కర్లేదని గుండెపోటుతోనే మరణించారని జస్టిస్ భూషణ్ గవాయ్, జస్టిస్ సునీల్ షుక్రీ ఆనాడే చెప్పారు. లోయ దండే ఆస్పత్రికి వచ్చిన తర్వాత ఇసిజి చేశారని, అయితే ఆ ఇసిజిపై నవంబర్ 30వ తేదీ రాసి ఉందని, వాస్తవానికి ఆనాటికి లోయ అసలు నాగ్‌పూర్ రాలేదనేది మరో అంశం. ఈ మొత్తం వ్యవహారంలో బాంబే న్యాయమూర్తుల ప్రమేయం ఎక్కడా లేకపోయినా వారంతట వారే ఎందుకు ప్రకటన చేయాల్సి వచ్చిందనేది మరో అనుమానం. లోయ మరణించినట్టు తమకు ఐదు గంటలకే చెప్పారని, అయితే రికార్డుల్లో మాత్రం ఆయన మరణించింది 6.15 అని పేర్కొన్నారని లోయ కుటుంబ సభ్యులు చెప్పడం ఇంకో అనుమానానికి తావిచ్చింది. రక్తంతో చొక్కా ఎందుకు తడిసిపోయిందనేది ఇంకోకొత్త అనుమానం. ఛాతిలో నొప్పి వచ్చిన మాట నిజమే అయితే ఆయన శరీరంపైన గాయాలు, దుస్తులు రక్తంతో ఎందుకు తడిశాయని లోయ కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. చొక్కా కాలర్‌పై రక్తం ఉందని, ఫ్యాంట్ బెల్టు వ్యతిరేక దిశలో ఉందని, ఫ్యాంట్ క్లిప్ విరిగిపోయి ఉందని లోయ సోదరి ఆరోపించారు. మరో సోదరి మంధానే మాట్లాడుతూ మెడపై రక్తపు చారికలు ఉన్నాయని, తలపై గాయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రశ్నలకు ఇంత వరకూ సమాధానం లేదు. ఇందులో ఏది నిజమో, ఏది అవాస్తవమో కూడా తేలలేదు.

జస్టిస్ లోయ విచారించిన సోహ్రాబుద్దీన్ కేసులో తదుపరి న్యాయమూర్తి 2015లో అమిత్ షాకు క్లీన్ చిట్ ఇచ్చారు. అక్కడి నుండి అనుమానాలు మొదలయ్యాయి. అనుమానాలు నిజమో కాదో తెలియకున్నా ఇలాంటి కేసుల్లో విచారణ జరిపించకుండా ఉండటమంటే అది న్యాయవ్యవస్థకు మాయని మచ్చగా మిగిలిపోతుందని ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ పి షా సహా పలువురు తీవ్రంగా స్పందించారు. సంచలన కేసు కొనసాగుతున్న సమయంలో సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి మరణించడం దిగ్భ్రాంతికి గురిచేసింది. జస్టిస్ లోయ మృతిపై విచారణ కోరుతూ బాంబే హైకోర్టు, సుప్రీంకోర్టులలో మూడు పిటీషన్లు దాఖలయ్యాయి. వాటిలో ఒకటి బాంబే లాయర్స్ అసోసియేషన్ తరపున బాంబే హైకోర్టులో దాఖలు కాగా, సుప్రీంకోర్టులో రెండు పిటీషన్లు దాఖలయ్యాయి. సుప్రీంకోర్టులో ఒక కేసు కాంగ్రెస్ నేత తహసీన్ పూనావాలా దాఖలు చేయగా, మరో కేసు మహారాష్ట్ర జర్నలిస్టు బందురాజ్‌లోనే దాఖలు చేశారు. బందురాజ్‌లోనే తరపున సుప్రీంకోర్టులో ఇందిరా జైసింగ్ వాదిస్తున్నారు. ఆమె తన పిటీషన్‌ను డిసెంబర్ 12న దాఖలు చేశారు.

ప్రధాన విచారణలో ఇందిరాజైసింగ్ తన వాదనలు వినిపిస్తూ ఇదేదో ఒక కుటుంబానికి చెందిన కేసు కాదని అన్నారు. ఒక న్యాయమూర్తి మరణించినపుడు దానిపై విచారించాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థపై ఉందని పేర్కొన్నారు. మరో పక్క జస్టిస్ లోయ పోస్టుమార్టం రిపోర్టును అందజేయాలని సుప్రీంకోర్టు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. లోయ మృతిపై ఉన్న అన్ని అనుమానాలు నివృత్తి కావల్సి ఉందని ఆమె పేర్కొన్నారు. జస్టిస్ లోయను ఎవరో చంపారని మనం చెప్పలేం, కాని పరిస్థితి చూస్తే మాత్రం అది సహజమైన మృతిలా అనిపించడం లేదని ఇందిరా తన వాదన వినిపించారు. లోయ కుమారుడు అనూజ్ మాత్రం తన తండ్రిది సహజ మరణమేనని దానిని వివాదం చేయవద్దని చెబుతుండగా, లోయ సోదరి మాత్రం జస్టిస్ లోయ మరణం సహజంగా లేదని అంటున్నారు. కుటుంబ సభ్యులే భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. అనూజ్ మీడియాతో చెబుతున్నపుడు ఆయన బాడీ లాంగ్వేజి చూస్తే ఆయనలో ఆత్మవిశ్వాసం కనిపించడంలేదని, ఇందువల్ల అనుమానాలు పెరుగుతున్నాయని ఇందిరా చెప్పారు. సుప్రీంకోర్టుకు ఈ కేసు విషయంలో అంత తొందర ఎందుకు? కోర్టుకు నిజంగానే అంత ఆసక్తి ఉంటే జస్టిస్ కర్ణన్ కేసు మాదిరి జస్టిస్ లోయ మృతి చెందిన వెంటనే విచారణ జరిపి ఉండాల్సింది అని ఇందిరా వాదిస్తున్నారు.

## ఆద్యంతం అనుమానాలే

జస్టిస్ లోయ అనుమానాస్పద మరణం కేసు విచారణపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గతంలో తీసుకున్న నిర్ణయమే నలుగురు సీనియర్ న్యాయమూర్తులు మీడియా ముందుకు రావడానికి కారణమైందనేది నిర్వివాదాంశం. అమిత్‌షాకు అనుకూలంగా తీర్పు చెబితే 100 కోట్ల బంపర్ ఆఫర్ ఉందని సాక్షాత్తు నాటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మొహిత్ షా చెప్పారని లోయ సోదరి బియానీ ఆరోపించారు. గమ్మత్తు ఏమంటే లోయ మరణం తర్వాత సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం జడ్జీగా నియమితులైన ఎంబి గోసని అనే న్యాయమూర్తి సోహ్రాబుద్దీన్ ఎన్ కౌంటర్ కేసును విచారించారు. 2015 డిసెంబర్‌లో అమిత్ షా, ఇతర పోలీసు అధికారులపై కేసు కొట్టి వేశారు. 2014 డిసెంబర్ ఒకటో తేదీన లోయ మరణం తర్వాత ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని అనేక డిమాండ్లు వచ్చినా మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించలేదు. బాంబే హైకోర్టు సైతం పిటీషన్లను తోసిపుచ్చింది. అకస్మాత్తుగా ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గవాయి, జస్టిస్ షుక్రే రంగ ప్రవేశం చేసి, లోయ మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని కేసును కొట్టివేశారు. తర్వాత కుటుంబ సభ్యుల కథనాలతో కారవాన్ అనే పత్రిక ఒక కథనాన్ని ప్రచురించింది. ఆ కథనం ఆధారంగా హైకోర్టులో ఒక పిటీషన్ దాఖలైంది. అదే సమయంలో ఇటు సుప్రీంకోర్టులోనూ వేర్వేరు పిటీషన్లు దాఖలయ్యాయి. దీనిని పరిశీలించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఎ ఎం ఖాన్ విల్కర్, జస్టిస్ డి వై చంద్రచూడ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఇది చాలా సీరియస్ విషయమని వ్యాఖ్యానించింది. రానున్న రోజుల్లో ఈ వ్యవహారం ఎన్ని మలుపులు తిరుగుతుందో ఎదురుచూడాలి.

-బి.వి.ప్రసాద్

# ఓటరు చైతన్యమే శ్రీరామరక్ష

ఒక్క ఓటు గెలుపు ఓటముల నిర్ధారణ జరిగే ఎన్నికల వ్యవస్థ మనది. ఓటర్లు చురుకైన భాగస్వామ్యమే ప్రజాస్వామ్యయుత ఎన్నికల వ్యవస్థ విజయానికి కీలకం. ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించడంలోతే సరిపెట్టకుండా ఓటర్ల నమోదును చురుకుగా నిర్వహిస్తూ ఓటర్ల సంఖ్యను పెంచేందుకు ఎన్నికల సంఘం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ఏ రాజకీయ పక్షానికి తలవంచక స్వతంత్రంగా తన విధులు నిర్వహిస్తోంది. కేంద్ర స్థాయిలో భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ఎన్నికల సంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఓటర్లుగా నమోదైన వారికి గుర్తింపు కార్డులను కూడా అందజేస్తారు. 1971లో పురుష ఓటర్ల సంఖ్య 60.87 శాతం ఉంటే 2014 నాటికి అది స్వల్పంగా పెరిగి 67 శాతానికి చేరింది. అదేకాలంలో మహిళా ఓటర్ల సంఖ్య 49.11 శాతం నుంచి ఏకాయెకి 65.54 శాతానికి పెరిగింది. ఎన్నికల కమిషన్ నిరంతర ప్రయత్నాల వల్ల యువజనులు చైతన్యమై ఓటర్లుగా పేరు నమోదు చేయించుకున్నారు. ఓటర్ల ఆలోచనల్లో వస్తున్న మార్పులతోపాటు ఎన్నికల సంఘం కల్పించిన చైతన్యం కూడ ఒక కారణంగా పేర్కొంటున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కలిగించే విధంగా జాతీయ ఎన్నికల కమిషన్ కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఓటుహక్కు విలువను చాటిచెప్పేలా ఈ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఓటరుగా ఉన్నందుకు గర్వపడుతున్నాను, ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నాను అన్న నినాదాలను ఎక్కువగా ప్రచారంలోకి తీసుకువచ్చింది. 1950 నుంచి మనదేశంలో అమలులోకి వచ్చిన సార్వత్రిక వయోజన ఓటుహక్కు రాజకీయ చరిత్రలో విప్లవాత్మకమైన మార్పుగా చెప్పొచ్చు. ఓటరు దినోత్సవం నాడు కొత్తగా ఓటరు పేర్లు నమోదు చేస్తారు. ఓటుహక్కు వజ్రాయుధంలాంటిది. అందువల్లే ఎన్నికల్లో ఓటర్లు చురుకుగా పాల్గొనేలా ఎన్నికల సంఘం చైతన్య కార్యక్రమాలు చేపడుతోంది. నైతిక, ఉన్నత విలువలు ఉన్నవారిని ఎన్నుకుంటేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. నచ్చనివారికి ఓటు వేయకూడదనుకున్న ఓటరుకు తన ఓటుహక్కు వినియోగించుకునే వెసులుబాటును కల్పించింది 'నోటా' (నన్ ఆఫ్ ది ఎబోవ్). ఈ మీట నొక్కడం ద్వారా ఓటరు తిరస్కార ఓటుహక్కును వినియోగించుకోవచ్చు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లో తిరస్కార ఓటుహక్కును అమలు చేసిన దేశాలలో 14వ స్థానంలో భారత్ నిలిచింది. సుప్రీంకోర్టు సూచన మేరకు ఇది అమల్లోకి వచ్చింది. 2009లో ఈ 'నోటా' హక్కును తీసుకురావాలని ఎన్నికల సంఘం ప్రతిపాదించింది. అయితే 2013 సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు రూలింగ్ మేరకు ఆ తరువాత ఇది అమల్లోకి వచ్చింది. అందుకే ఓటుహక్కు విలువను తెలుసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో పాలుపంచుకోవాలి. ఓటరు నమోదు చేసుకోవడం, ఎన్నికలప్పుడు ఓటు హక్కు వినియోగించడం ప్రతీ పౌరుని విధి, బాధ్యత.



రేపు జాతీయ ఓటరు దినోత్సవం

-కె.రామ్మోహన్‌రావు

# 'అప్‌డేట్' అవని మావోయిస్టులు!

మావోయిస్టుల అధికార ప్రతినిధి ప్రతాప్ ఇటీవల ఒక వ్యాసంలో తమ పార్టీ జరుపుతున్న పోరాట ప్రభావాన్ని ఆకాశానికెత్తారు. బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ దేశాలతో పాటు మలయా, బర్మా, ఇండోనేషియా, కంపూచియా దేశాల్లోనే గాక జపాన్, ఆస్ట్రేలియా దేశాల ప్రజలను కార్మికవర్గాన్ని తాము జరుపుతున్న పోరాటం ఉత్తేజపరుస్తోందని, స్ఫూర్తిగా నిలుస్తోందని రాశారు.

భారతదేశంలో కార్మికులు, రైతులు, ఆదివాసులు, విద్యార్థులు, మేధావులు ఉద్యమబాట పట్టారని, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను ముందుకు తీసుకువెళుతున్నారని, ఈ అసమాన పోరాటం ప్రపంచవ్యాప్త ఉద్యమకారులను ఉత్తేజ పరుస్తోందని పేర్కొన్నారు. భారతదేశ, ప్రపంచ రాజకీయాల గురించి ఏమాత్రం పరిచయమున్నవారైనా ఈ అభిప్రాయాన్ని అభూతకల్పనగానే పరిగణిస్తారు. ఇలా తమనితాము గొప్పశక్తిగా, బలమైన పార్టీగా ప్రకటించుకుంటే హుందాగా ఉండదు.

ప్రతాప్ పేర్కొన్న దేశాల్లో వేళ్లమీద లెక్కించదగ్గ వ్యక్తులకు ఆకర్షించినంత మాత్రాన మొత్తం ఆయా దేశాల కార్మిక-కర్షకులను ఆకర్షించినట్టు, ఉత్తేజపరిచినట్టు కాదు. అయినా తమది అద్భుత పార్టీగా, గొప్ప భవిష్యత్ ఉన్న పార్టీగా తమకి తాము చిత్రించుకుంటే అది ఆత్మవంచనే అవుతుంది తప్ప వాస్తవం అవదు. వాస్తవేమిటో ప్రజలందరికీ తెలుసు. ప్రపంచమంతటా ప్రజలు మార్క్సిజాన్ని పక్కనపెట్టి, పారిశ్రామిక విప్లవాలు తీసుకొచ్చిన సాంకేతికతను ఆలింగనం చేసుకొని, ప్రజాస్వామ్య పద్ధతిలో పురోగమన దిశలో పయనిస్తున్నారు. ఏ సోషల్ మీడియాలోకి వెళ్లి పరిశీలించినా, ఇంటర్నెట్‌లోకి వెళ్లి శోధించినా వాస్తవం బోధపడుతోంది. ఈ సౌలభ్యం ఉన్నదని కూడా విస్మరించి అర్ధ శతాబ్దం క్రితం మాదిరి వాస్తవాల్ని పరిశీలించకుండా ప్రకటిస్తే ఎలా? 21వ శతాబ్దపు సాంకేతిక పరిజ్ఞానం విస్ఫారుతున్న తరుణంలో మావోయిస్టులు ఇలా ప్రపంచాన్ని ఉత్తేజ పరుస్తున్నామని అవాస్తవాల్ని ప్రకటించడం భావ్యం కాదు, భావదారిద్ర్యం తప్ప.

భారత ప్రజలపై సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం, బడా భూస్వామ్యం అనే మూడు పర్వతాలు పెనుభూతంగా ఉన్నాయని, వాటిని కూకటివేళ్లతో పెకిలించివేయకుండా భారత ప్రజలకు విముక్తి లేదని చెబుతూ తమ పార్టీ ప్రజలను ఆ విముక్తి పథంలో నడిపిస్తోందని, ఈ విధానం ప్రపంచాన్ని ఆకర్షిస్తోందని అన్నారు. భారత ప్రజలు భూస్వామ్యం, పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదం కింద నలిగిపోతున్నారన్న విశ్లేణ ఎంత శాస్త్రీయమైనదో, ఎంత వాస్తవికమైనదో ఎవరికి వారే అంచనా వేసుకోవచ్చు.

ఇలా వంద సంవత్సరాల క్రితపు భావజాలాన్ని ఏమాత్రం జారిపోకుండా గట్టిగా పట్టుకుని, కాపాడుకుంటూ అవసరమైనప్పుడు ఇలా అక్షరరూపం ఇచ్చి మావోయిస్టులు ఎంతకాలం ప్రజలను మభ్యపుచ్చుతారు? ఈ ప్రశ్న ఎవరైనా వేస్తారన్న వెరపు సైతం లేకుండా అవాస్తవాలనే శాస్త్రీయమని విశ్వసించి రచనలు చేస్తేఎలా? వాస్తవానికి కొలంబియా మావోయిస్టు గెరిల్లాలు (ఫార్క్) చేతులెత్తేసి, ఆయుధాలు అక్కడి ప్రభుత్వానికి అప్పగించి జనజీవన స్రవంతిలో కలసిపోయిన సంగతిని ప్రస్తావించే ధైర్యం ప్రతాప్‌కు లేదు. భారత మావోయిస్టులకన్నా, నక్సలైట్లకన్నా ముందునుంచే ఫార్క్ గెరిల్లాలు మావోయిజం వెలుగులో పోరాడి చివరికి తత్త్వం బోధపడి ఆయుధాలను విసర్జించారు. ఇదికదా వాస్తవ పరిస్థితి. ఫిలిప్పైన్స్, పెరు తదితర దేశాల్లోనూ మావోయిస్టు భావజాలంగలవారు పలచనయ్యారు.

ప్రపంచవ్యాప్త వామపక్షాలకు, వామపక్ష తీవ్రవాదులకు ఉత్తేజాన్నిచ్చిన లాటిన్ అమెరికా దేశాల పరిస్థితి ఇప్పుడు ఎలా ఉన్నదో అందరికీ తెలుసు. క్యూబా సైతం అమెరికాతో చేతులు కలపి పనిచేస్తోంది. వెనిజులాలో చేసిన ప్రయోగం బెడిసికొట్టింది. కాంబోడియాలో మావోయిస్టు భావజాలం గల నాయకులకు అక్కడి ప్రభుత్వం భారీ శిక్షలు విధించింది. అక్కడి ప్రజలు ఆ ఆలోచనలనుంచి పూర్తిగా బయటపడ్డారు. నేపాల్ మావోయిస్టుల పరిస్థితి ప్రపంచం ముందు ఉంది. వారిప్పుడు అక్కడి పార్లమెంట్ లాబీల్లో కనిపిస్తున్నారు. కానీ ప్రతాప్ మాత్రం తన రచనలో నేపాల్ కార్మిక-కర్షకులను సైతం తమ పోరాటం ఉత్తేజపరుస్తోందని పేర్కొనడం విడ్డూరంగాక ఏమవుతుంది? అతిశయం అనిపించకుండా మరేమనిపించుకుంటుంది?

ఇలా అతిశయం, అవాస్తవాలతో పొద్దుపుచ్చితే ఆ పార్టీకి విశ్వసనీయత ఉంటుందా? తమది దేశవ్యాప్త పార్టీగా ప్రకటించుకుని ఇలా తప్పుడు అవగాహనను ప్రజల్లో కలిగించడం భావ్యమా? బర్మా పేరు మయన్మార్‌గా మలయా పేరు మలేసియాగా కంపూచియా పేరు కాంబోడియాగా మారి దశాబ్దాలవుతున్నా పాత పేర్లనే పేర్కొనడమంటే మావోయిస్టు నాయకులు 'అప్‌డేట్' కావడానికి ఇష్టపడటం లేదన్న విషయం స్పష్టమవుతోంది. ప్రపంచ పరిణామాలను పట్టించుకోవడానికి ఆసక్తి చూపడం లేదని అర్థమవుతోంది.

భారతదేశానికి అనుసరించిన వ్యూహం.. ఎత్తుగడలను భారతదేశంలో ప్రస్తుతం ఆచరణలో పెడుతూ అది కాస్త ఇప్పుడు ప్రపంచంలోని పలు దేశాల ప్రజలను ఉత్తేజ పరుస్తోందని పేర్కొనడం హాస్యాస్పదం. ఏడు దశాబ్దాల క్రితపు వ్యూహం - ఎత్తుగడలు, భావజాలం, ఆలోచనలు ఇప్పుడు నాల్గవ పారిశ్రామిక విప్లవం పరిఢవిల్లుతున్న సమయంలో ఉత్తేజకరంగా కనిపించడం, భావించడం ఎంతటి అమాయకత్వం?

చైనా, భారతదేశాల మధ్య అనేక సామ్యాలున్నప్పటికీ కీలకమైన దేశకాలమాన పరిస్థితులు ప్రధానమన్న అంశాన్ని బొత్తిగా పట్టించుకోకుండా ప్రజల ధనప్రాణాలతో చెలగాటమాడటం ఆహ్వానించదగ్గ అంశమవుతుందా?

దేశవ్యాప్తంగా ప్రతిఘటన ప్రాంతాలు, గెరిల్లా జోన్‌లు, గెరిల్లా బేస్‌ల నిర్మాణం, బేస్ ఏరియాల ఏర్పాటు, బలమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ నిర్మాణం.. అంటూ పచ్చని అడవులను ఎర్రబార్చడం, ఆదివాసీలను బలి తీసుకోవడం, అమాయకుల చేత ఆయుధాలు పట్టించడం, కాలం చెల్లిన అమాయకుల చేత ఆయుధాలు పట్టించడం, కాలంచెల్లిన తమ సిద్ధాంతాలకు వారిని ఆహుతి చేయడం పూర్తిగా అన్యాయం.. అధర్మం.

ఉన్న ప్రజాస్వామ్యాన్ని విస్మరించి లేని భూస్వామ్యం, ధనస్వామ్యం, దళారీ సామ్రాజ్యవాదం పేర ఆటవిక పద్ధతిలో అడవులకే పరిమితమై ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోజురోజుకు బలోపేతమవుతున్న నగర-పట్టణ, ఉత్పత్తి రంగాలను మార్క్స్ ప్రవచనాలతో ప్రక్షాళన చేస్తామనుకోవడం పేరాశ మాత్రమే..

ప్రపంచవ్యాప్తంగా ప్రజాజీవితం ఓ కొత్త కక్ష్యలో పరిభ్రమిస్తోందన్న సంగతిని గమనించకుండా, అటువైపు దృష్టి సారించకుండా, డిజిటల్ టెక్నాలజీ తీసుకొచ్చిన విప్లవాన్ని గమనంలోకి తీసుకోకుండా, మానవ ఆలోచనల్లో వచ్చిన మార్పులను పసిగట్టకుండా తమకు తోచిన విధంగా ప్రణాళికలు రచించుకుని, ఊహాలోకాల్లో విహరిస్తూ 2050 సంవత్సరం నాటికి ఎర్రకోటపై ఎర్రజండా ఎగరేస్తామని బీరాలు పలకడం భారత ప్రజలను మోసగించడమే, వారిని తప్పుదోవ పట్టించడమే అవుతుంది.

అభివృద్ధికి దూరంగా ఉన్న బడుగు-బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే, వారు సాధికారతతో జీవించాలంటే సాయుధ పోరాటం, గెరిల్లా జోన్లు, బేస్ ఏరియాలు ఏర్పాటు చేయడం కాదు, వారి జ్ఞాన పరిధిని విస్తరించడం, స్వయంగా తమ హక్కులను, బాధ్యతలను తాము గుర్తించడం.. ఈ కీలకమైన అంశాన్ని విస్మరించి ఎన్ని జిమ్మిక్కులు చేసినా, ఎన్ని పాచిపోయిన సిద్ధాంతాలను వల్లెవేసినా వారు సాధికారతను సాధించలేరు. సాధికారతను సాధించడానికి మించిన సాయుధ పోరాటం ప్రపంచంలో మరొకటి లేదు!

-వుప్పల నరసింహం.. 9985781799

# ఉత్తరాయణం

## పరిణామ సిద్ధాంతం.. అధికారిక రాద్ధాంతం


కేంద్ర మానవ వనరుల శాఖ సహాయమంత్రి సత్యపాల్‌సింగ్ డార్విన్ పరిణామ సిద్ధాంతం తప్పు అని సెలవిచ్చారు. దానికి ఆయన తెచ్చిన ఋజువేమిటంటే ఆ సిద్ధాంతం చెబుతున్నట్టుగా కోతి నుంచి మనిషి పుట్టాడన్నది ఎవరూ చూడలేదు, రాయలేదు కదా అన్నది. వాదన బాగానే ఉంది. కానీ ఒక శాస్త్రీయ సిద్ధాంతం తప్పు అని నిరూపించడానికి వితండ వాదన ఒక్కటే సరిపోదు. ప్రత్యామ్నాయ వైఖరికి మద్దతుగా బలమైన, నిరూపించదగ్గ సాక్ష్యాలు కావాలి. అవి లేకుండా మాట్లాడడం కేవలం సొంత అభిప్రాయం కిందే మిగిలిపోతుంది. ఆయన ఇంతటితో ఆగినా బాగుండేది. పాఠ్యాంశాల్లోంచి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించాలని ఏకాయెకీ తీర్మానించారు. అది బరితెగింపు. బాధ్యతారాహిత్యం. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేలా ప్రభుత్వం కృషి చేయాలని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు చెబుతున్నాయి. అమాత్యులు అందుకు భిన్నంగా ప్రవర్తించకూడదు. డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని ప్రపంచం అంగీకరించింది. ససాక్ష్యంగా ఋజువుచేయనిదే, నేను ఏది చెబితే అది సత్యం అంటే కుదరదు. బాధ్యతాయుత పదవుల్లో ఉండేవారు ఆషామాషీగా మాట్లాడకుంటా ఉంటే మేలు. మంత్రిగారు కోతి నుండి మనిషి ఉద్భవించాడని నమ్మలేకపోవచ్చు. కానీ బుద్ధుల్లో మనిషి నుండి కోతిగా మారొచ్చనేది నమ్మితీరాలి. అదే.. పరిణామ సిద్ధాంతం. కాకపోతే ఉల్టాపల్టా!

డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

## యూట్యూబ్‌లో కాళేశ్వరం పనులు

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇటు గవర్నర్, అటు కేంద్రం ఈ ప్రాజెక్టుల వేగాన్ని చూసి అచ్చెరువొందుతున్నాయి. ఒకప్పుడు ఈ ప్రాజెక్టు గురించి విపులంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేసిన సీఎం పట్టుదలగా ఆ ప్రాజెక్టు పనులు చేయించడాన్ని గవర్నర్ ప్రశంసించడం విపక్షాలకు నచ్చినట్లు లేదు. వారి విమర్శల్లో పదును లేదు. నిజానికి ఈ ప్రాజెక్టు పనులు జరుగుతున్న తీరు, దశలపై నెలనెలా వీడియో తీసి వాటిని యూట్యూబ్‌లోను, ప్రభుత్వ వెబ్‌సైట్లలోనూ ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అప్పుడు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న పని ఏమిటో తేటతెల్లం అవుతుంది. కువిమర్శలు చేస్తున్నవారికి సమాధానం చెప్పినట్లూ ఉంటుంది. నిజానికి తెలంగాణలో రైతులకు కాళేశ్వరం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. ఇలాంటి పనులపై సరైన విమర్శలు చేయకపోతే విపక్షాలు ప్రజలకు దూరం అవుతారు. బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రాజెక్టు పనుల్లో లోపాలను ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని సరైన మార్గంలో పెడితే అప్పుడు విపక్షాలకు విలువ ఉంటుంది. రాజకీయ వైరంతో విమర్శలు చేస్తే ఉపయోగం ఉండదు సరికదా నష్టం తప్పదు.

-చామర్తి వెంకటరామకృష్ణ, హైదరాబాద్

మంగళవారం రాజ్‌పథ్‌లో నిర్వహించిన రిపబ్లిక్ డే పరేడ్ ఫుల్‌డ్రెస్‌డ్ రిహార్సల్స్‌లో పాలుపంచుకున్న బ్రహ్మోస్ క్షిపణులు, బిఎస్ఎఫ్ మహిళల మోటార్ సైకిల్ విన్యాసాలు

# గణతంత్ర వేడుకల్లో ఘనతలెన్నో!

**అలరించనున్న ఆసియాన్ పతాకం ■ కనువిందు చేసే మహిళా మోటార్‌సైకిల్ రెజిమెంట్ ■ అతిథులుగా వస్తున్న పది దేశాల అధినేతలు**

న్యూఢిల్లీ, జనవరి 23: సైనిక పాటవం, దేశ సంస్కృతి, వైవిధ్యం వంటి అంశాలతోపాటు ఈ నెల 26న ఇక్కడ జరిగే గణతంత్ర వేడుకల్లో తొలిసారిగా ఎన్నో ప్రత్యేకతలు చోటుచేసుకుంటున్నాయి. రాజ్‌పథ్ వద్ద 'ఆసియాన్' పతాకం గగన వీధిలో తొలిసారిగా ఎగరబోతోంది. 'ఆసియాన్'లోని పది సభ్య దేశాలకు చెందిన అధినేతలు ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు ఈ వేడుకలకు అతిథులుగా హాజరవుతున్నారు. బీఎస్‌ఎఫ్‌లోని మహిళా మోటార్‌సైకిల్ రెజిమెంట్ ఆధ్వర్యంలో సాహసకృత్యాలు ఆహూతులను అలరించబోతున్నాయి. అయిదు 'ఎంఐ-17వీ5' హెలికాప్టర్లు ఈ వేడుకల్లో పాల్గొంటున్నాయి. ప్రధాని మోదీ నిర్వహిస్తున్న 'మన్ కీ బాత్' కార్యక్రమంలోని విశేషాలను తెలిపేలా 'ఆకాశవాణి' పలు శకటాలను ఏర్పాటు చేస్తోంది. ఆదాయపు పన్ను శాఖ కూడా వినూత్నరీతిలో శకటాన్ని ఏర్పాటు చేస్తోంది. నేవీకి సంబంధించిన ఐఎస్ విక్రాంత్ నౌక, డిఆర్‌డివోకు చెందిన 'నిర్భయ్' క్షిపణి, అశ్విని రాడార్ సంస్థల నమూనాలను ప్రదర్శిస్తారు.

# పొత్తుల ఎత్తులకు పదును!

- బీజేపీతో కలిసేది లేదన్న శివసేన
- కాంగ్రెస్‌తో కటీఫ్ అన్న ఎస్పీ.. బీఎస్పీదీ అదే దారి
- ప్రజాస్వామ్య శక్తులతో కలుద్దామని సీపీఎం తీర్మానం
- ఆంధ్ర, తెలంగాణలో కొత్త పొత్తులకు అవకాశం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 23: లోక్‌సభ ఎన్నికలు మరో 15నెలల దూరంలో ఉడడంతో జాతీయ, ప్రాంతీయ స్థాయిలో రాజకీయ సమీకరణాల రూపురేఖలు మారుతున్నాయి. లోక్‌సభతోపాటు మరికొన్ని రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు ఎవరితో పోటీ చేయాలనే అంశంపై కొన్ని పార్టీలు అప్పుడే తమ నిర్ణయాలు ప్రకటిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో కలిసి పనిచేసే ప్రసక్తే లేదంటూ మిత్రపక్షమైన శివసేన ఏకంగా ఒక తీర్మాన ఆమోదించి అందరిని ఆశ్చర్యపరిస్తే, కాంగ్రెస్‌తోపాటు ఇతర ప్రజాస్వామ్య శక్తులతో కలిసి పనిచేయాలని సీపీఎం తీర్మానం చేసింది. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుల మధ్య విభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పని చేయకుండా స్వతంత్రంగా ఎన్నికల బరిలోకి దిగాలని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ నాయకత్వంలోని సమాజ్‌వాదీ, మరో మాజీ ముఖ్యమంత్రి, బీఎస్పీ అధినాయకురాలు మాయావతి తీసుకున్న నిర్ణయాలు కూడా రాజకీయ వర్గాలను ఆలోచింపచేస్తున్నాయి. ఆంధ్ర, తెలంగాణలో కూడా కొత్త సమీకరణాలు చోటుచేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి.

2019లో జరిగే లోక్‌సభ, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు శివసేన మంగళవారం ప్రకటించింది. దీనితో బీజేపీ, శివసేన మధ్య ఎన్నో ఏళ్లనుండి కొనసాగుతున్న ఎన్నికల పొత్తు తెరపడినట్లయింది. బీజేపీ, శివసేన మధ్య చాలాకాలం నుండి వివాదం కొనసాగుతోంది. ముంబాయిలో జరిగిన జాతీయ కార్యవర్గం సమావేశంలో శివసేన ఈ నిర్ణయం తీసుకున్నది. శివసేన ఇకమీదట మహారాష్ట్రతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ హిందుత్వకోసం పోరాటం చేస్తుందని పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే ప్రకటించారు. ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై పెద్దఎత్తున విమర్శలు గుప్పించారు.

ఇలావుండగా ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోకూడదని సీపీఎం గత ఆదివారం పశ్చిమ బెంగాల్‌లో జరిగిన సెంట్రల్ కమిటీ సమావేశంలో తీర్మానించటం తెలిసింది. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ మధ్య కొనసాగుతున్న విభేదాలు ఈ తీర్మానంతో రోడ్డెక్కాయి. 2019 లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు చేసుకోవాలని సీతారాం ఏచూరి ఒక తీర్మానం ప్రతిపాదించారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ కూటమిని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్‌తో చేతులు కలపటం ఎంతో అవసరమని ఏచూరి వాదించారు. దీనికి ప్రతిగా కారత్ మరో తీర్మానం ప్రతిపాదిస్తూ బీజేపీ-ఆర్ఎస్ఎస్ కూటమిని ఎదుర్కొనేందుకు వామపక్షాలు, కాంగ్రెస్‌తోపాటు ఇతర ప్రజాస్వామ్య శక్తులతో కలిసి పని చేయవలసిన అవసరం ఉన్నదని ప్రతిపాదించారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ కూటమిని పకడ్బందీగా ఎదుర్కోవాలంటే ఇలాంటి కూటమి ఎంతో అవసరమని కారత్ వాదించారు. సెంట్రల్ కమిటీలో ఈ రెండు తీర్మానాలపై ఓటింగ్ జరగ్గా ప్రకాశ్ కారత్ ప్రతిపాదించిన తీర్మానం 55-31 ఓట్లతో విజయం సాధించింది. పశ్చిమ బెంగాల్, త్రిపుర సీపీఎం యూనిట్లు సీతారాం ఏచూరి తీర్మానానికి మద్దతిస్తే కేరళ యూనిట్‌తోపాటు మరికొన్ని ఇతర రాష్ట్రాల యూనిట్లు ప్రకాశ్ కారత్ తీర్మానానికి మద్దతిచ్చాయి. సీపీఎం ఇప్పుడు వామపక్షాలు-కాంగ్రెస్ కూటమికి బదులు వామపక్షాలు-కాంగ్రెస్-ఇతర ప్రజాస్వామ్య శక్తులతో కూడిన కూటమిని ఏర్పాటు చేసి 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమిని ఎదుర్కొంటాయి.

ఇదిలాఉంటే ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పోటీచేసిన సమాజ్‌వాదీ పార్టీ, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేయాలనే నిర్ణయానికి వచ్చింది. లోక్‌సభ ఎన్నికల్లో తాము ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోం, ఎస్పీ స్వతంత్రంగా పోటీ చేస్తుందని పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ప్రకటించారు. పొత్తు మూలంగా గందరగోళం నెలకొంటోంది, ఇది తమ పార్టీకి ఎంతమాత్రం మంచిది కాదని ఆయన స్పష్టం చేశారు. త్వరలోనే తాను రాష్ట్రంలో పాదయాత్ర చేపడతాని అఖిలేష్ ప్రకటించారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవటం తనకు ఎంతమాత్రం ఇష్టం లేదని మాజీ కేంద్ర మంత్రి ములాయం సింగ్ యాదవ్ సైతం ప్రకటించటం కాంగ్రెస్‌ను మరింత నిరుత్సాహ పరిచింది. బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి కూడా 2019 లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేయాలని ఆలోచిస్తోంది. కాంగ్రెస్ లేదా మరో ప్రతిపక్ష పార్టీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని ఆమె గత వారం లక్నోలో చెప్పారు. ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకోవటం వలన తమ పార్టీకి నష్టం కలుగుతోందని ఆమె తెలిపారు. అయితే ఇప్పుడు ఊపిరి పోసుకుంటున్న ఈ సమీకరణాలు ఇదేవిధంగా ఉండిపోకుండా కొన్ని మార్పులు, చేర్పులు జరుగుతాయి. లోక్‌సభ ఎన్నికల సమయంలోనే ఈ సమీకరణాలపై స్పష్టత వస్తుంది.

# ఆధార్ నెంబరిస్తే నష్టమేమిటి?

- ప్రైవేటు సంస్థల చేతుల్లో ఇప్పటికే పౌరుల వివరాలు
- పిటిషనర్లకు సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ, జనవరి 23: ఆధార్‌ను అనేక అంశాలతో ముడిపెట్టిన నేపథ్యంలో దీన్ని సవాల్ చేస్తున్నవారికి సుప్రీం కోర్టు కీలక ప్రశ్నలు సంధించింది. ఆధార్ రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై జరుగుతున్న విచారణ సందర్భంగా అనేక కీలక విషయాలను తెరమీదకు తెచ్చింది. ప్రస్తుత నెట్‌వర్క్ ప్రపంచంలో ప్రతి వ్యక్తికి సంబంధించిన వివరాలు ప్రైవేటు కంపెనీలకు అందుబాటులో ఉన్నాయని ఒక వ్యక్తి ఆధార్ వివరాలు ఇతరులకు అందుబాటులో ఉంటే వచ్చే తేడా ఏమిటి? అని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఆధార్ పిటిషన్లను విచారించింది. పౌరుల వ్యక్తిగత వివరాలు ప్రైవేటు కంపెనీలకు అందుబాటులో ఉన్నాయని అలాంటప్పుడు ఆధార్ నంబర్ ఇవ్వడం వల్ల నష్టమేమిటని పిటిషనర్లను ప్రశ్నించింది. పౌరులు నెట్‌వర్క్ సమ్మిళితమైన ప్రపంచంలో జీవిస్తున్నారని రాజ్యాగ ధర్మాసనం స్పష్టం చేసింది. ఆధార్ నమోదు ప్రక్రియలో భాగంగా సేకరించిన బయోమెట్రిక్ సమాచారాన్ని కేంద్రీయ డేటాబేస్‌లో నిక్షిప్తం చేశారని, ఈ నేపథ్యంలో గుర్తింపు అవసరాల కోసమే పౌరులు 12 అంకెల ఆధార్ నంబర్ ఇవ్వాల్సి వస్తోందని న్యాయమూర్తులు ఏకే సిక్రీ, ఎఎం ఖన్వీకర్, డివై చంద్రచూడ్, అశోక్ భూషణ్‌తో కూడిన బెంచ్ పిటిషనర్లను ప్రశ్నించింది. ఈ సందర్భంగా మాట్లాడిన న్యాయవాది దివాన్ ఆధార్ నమోదు బాధ్యతను ప్రైవేటు సంస్థలకు అప్పగించారని వారు సేకరించిన ఈ వివరాలకు భద్రత ఏమిటని ప్రశ్నించారు.

ఆధార్ నమోదులో పాలుపంచుకున్న 49వేల ప్రైవేటు ఏజెన్సీలకు గత ఏడాది ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిందని, ఈ నేపథ్యంలో పౌరుల వ్యక్తిగత భద్రత ఏమిటన్న ఆందోళన మొదలైందని అన్నారు. ప్రభుత్వం తరపున ఏ ప్రతినిధి లేకుండానే ప్రైవేటు ఏజన్సీలు ఈ వివరాలు సేకరించాయని కోర్టుకు తెలిపారు.

## మూడు నెలల్లో తేల్చండి

### రాజీవ్ హంతకుల విడుదల లేఖపై కేంద్రానికి సుప్రీం స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జనవరి 23: రాజీవ్‌గాంధీ హత్యకేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న ఏడుగురు దోషులను విడుదల చేసే విషయంలో 2016లో తమిళనాడు ప్రభుత్వం రాసిన లేఖపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. రాజీవ్ హత్యకేసు దోషులను విడుదల చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అయితే 2015 నాటి సుప్రీం కోర్టు ఉత్తర్వు ప్రకారం కేంద్రం అనుమతితోనే దీన్ని అమలుచేయాల్సి ఉంటుందని 2016 మార్చి 2న రాసిన లేఖలో తమిళనాడు సర్కార్ స్పష్టం చేసింది. 3 నెలల్లో తమిళనాడు లేఖపై నిర్ణయం తీసుకోవాలని న్యాయమూర్తులు రంజన్ గొగోయ్, ఎఎం సప్రే, నవీన్ సిన్హాలతో కూడిన సుప్రీం ధర్మాసనం అదనపు సొలిసిటర్ జనరల్ పింకీ ఆనంద్‌కు కోరింది. తమిళనాడు ప్రభుత్వం తరపున వాదించిన సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది రాజీవ్ హంతకుల డిమాండ్‌కు మద్దతు తెలిపారు. వీరిని విడుదల చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ లేఖపై ఎలాంటి జాప్యం లేకుండా స్పందించాలని కేంద్రాన్ని కోరారు.

## కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై దాఖలైన పిటిషన్ కొట్టివేత

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 23: కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి విద్యార్హత వివాదంపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. కోమటిరెడ్డి ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు విచారణలో ఉన్న పిటిషన్‌కు సంబంధించి అనుబంధ పిటిషన్‌ను అనుమతించాలంటూ కంచర్ల భూపాల్‌రెడ్డి సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం జస్టిస్ జాస్తి చలమేశ్వర్ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. నామినేషన్ పత్రాల్లో తన విద్యార్హతను కోమటిరెడ్డి బీఈగా చూపారని, కాని ఉత్తీర్ణత సాధించలేదని, వీటికి సంబంధించిన కొన్ని పత్రాలు తమ వద్ద ఉన్నాయని, ఉమ్మడి హైకోర్టులో అనుబంధ పిటిషన్ వేయగా తోసిపుచ్చిందని, దీన్ని అనుమతించేలా ఆదేశాలు జారీ చేయాలని సుప్రీం కోర్టును భూపాల్‌రెడ్డి ఆశ్రయించారు.

ఈ వివాదానికి సంబంధించిన పిటిషన్ ఉమ్మడి హైకోర్టులో విచారణలో ఉన్నందున అక్కడే వాదనలు వినిపించాలని ధర్మాసనం సూచించింది. హైకోర్టు విచారణలో ఉన్న ప్రధాన పిటిషన్ విచారణ సమయంలో వాదించుకోవాలని సూచిస్తూ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

## తాలిబన్‌ను కట్టడి చేయండి

### పాక్‌కు తేల్చిచెప్పిన అమెరికా

వాషింగ్టన్, జనవరి 23: ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దు వెంబడి పదే పదే ఉగ్రదాడులకు పాల్పడుతున్న తాలిబన్ నేతలను తక్షణం అరెస్టు చేయడమో లేదా బహిష్కరించడమో చేయాలని పాకిస్తాన్‌కు అమెరికా గట్టిగా సూచించింది. ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్‌లోని ఓ హోటల్‌పై ఉగ్రదాడి ఫలితంగా 22 మంది మరణించడంపై అమెరికా తీవ్రంగా స్పందించింది. కాబూల్ హోటల్‌లో 22 మంది మరణానికి తామే కారకులమంటూ తాలిబాన్లు ప్రకటించిన నేపథ్యంలో అమెరికా అధ్యక్ష భవనం నుంచి ఓ ప్రకటన వెలువడింది. హోటల్‌లో జరిగిన మారణకాండలో 8మంది ఆఫ్ఘన్లతో పాటు 14 మంది విదేశీయులు ప్రాణాలు కోల్పోయారు. తాలిబన్లను తక్షణం కట్టడి చేసేందుకు, ఉగ్రవాద మూఠాలకు ఆశ్రయం ఇవ్వకుండా ఉండేందుకు పాకిస్తాన్ వెంటనే చర్యలు తీసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఉగ్రవాదుల దాడులతో నష్టపోతున్న ఆఫ్ఘనిస్తాన్‌కు తాము అన్ని విధాలా అండగా ఉంటామని, నరమేధంలో సాధారణ పౌరులు మరణించడం విచారకరమని 'వైట్‌హౌస్' మీడియా కార్యదర్శి సారా శాండర్స్ తెలిపారు. ఉగ్రవాదంపై పోరాడే ఆఫ్ఘన్ సైనికులకు అమెరికా సహకరిస్తుందని ఆమె ప్రకటించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాదాన్ని విస్తరింపజేయాలని ప్రయత్నిస్తున్న వారికి తగిన గుణపాఠం చెబుతామన్నారు.

## సీజేఐను అభిశంసించేందుకు విపక్షాలతో చర్చలు: ఏచూరి

న్యూఢిల్లీ, జనవరి 23: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దీపక్ మిశ్రాను పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో అభిశంసించే విషయమై అన్ని విపక్ష పార్టీలతో చర్చిస్తున్నట్లు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. ఆయన మంగళవారం ఇక్కడ విలేఖరులతో మాట్లాడుతూ, సహచర న్యాయమూర్తులే దీపక్ మిశ్రాపై ఇటీవల ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. 'ఎంపిక చేసిన కేసుల'ను కొంతమంది జడ్జీలకు అప్పగిస్తూ మిశ్రా వివక్ష చూపుతున్నారని ఇటీవల నలుగురు న్యాయమూర్తులు ఆరోపించిన సంగతి తెలిసిందే.

దేశ న్యాయవ్యవస్థలోనే తొలిసారిగా న్యాయమూర్తులు ఇలా సీజేఐ వ్యవహార శైలిపై విమర్శలు చేయడం సంచలనం రేపింది. ఈ అనుకోని పరిణామంతో న్యాయవ్యవస్థ, రాజ్యాంగంపై ప్రజలకు అనుమానాలు కలిగే పరిస్థితి ఏర్పడింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన న్యాయమూర్తిని అభిశంసించే విషయమై కాంగ్రెస్ సహా ఇతర విపక్ష పార్టీలతో తాము చర్చలు జరుపుతున్నట్లు ఏచూరి వెల్లడించారు. 2018-19 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ఈ నెల 29 నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతాయి. జనవరి 29 నుంచి ఫిబ్రవరి 9 వరకూ, ఆ తర్వాత విరామం అనంతరం మార్చి 5 నుంచి ఏప్రిల్ 6 వరకూ బడ్జెట్ సమావేశాలు జరుగుతాయి.

# అమలు చేయాల్సిందే

## పద్మావత్ విడుదల ఉత్తర్వుపై సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి 23: సంజయ్ బన్సాలీ వివాదాస్పద చిత్రం 'పద్మావత్' విడుదలకు సంబంధించి గతంలో ఇచ్చిన ఆదేశాల్లో మార్పులు చేయడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. ఇంతకు ముందు తాము ఇచ్చిన ఆదేశాలకే కట్టుబడి ఉన్నట్టు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా సారథ్యంలోని ధర్మాసనం మంగళవారం నాడు స్పష్టం చేసింది. పద్మావత్ చిత్రాన్ని దేశవ్యాప్తంగా విడుదల చేసుకోడానికి సర్వోన్నత న్యాయస్థానం ఈ నెల 18 గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గుజరాత్, రాజస్థాన్‌సహా అన్ని రాష్ట్రాల్లోనూ ఈ నెల 25న చిత్రం విడుదల చేసుకునేలా బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. అయితే సుప్రీం కోర్టు తన ఆదేశాల్లో మార్పులు చేయాలంటూ రాజస్థాన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు పిటిషన్లు దాఖలు చేశాయి. రెండు రాష్ట్రాల పిటిషన్లను తిరస్కరించిన సుప్రీం కోర్టు' ఇంతకు ముందు మేం ఇచ్చిన ఆదేశాలను ప్రజలు అర్థం చేసుకోవాలి. దానికి కట్టుబడి ఉండాలి. శాంతి భద్రతలు చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే' అంటూ జస్టిస్ ఎఎం ఖన్వీకర్, జస్టిస్ డివై చంద్రచూడ్‌తో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. 'పద్మావత్ విడుదలకు సంబంధించి గతంలో మేం ఇచ్చిన ఆదేశాల్లో ఎలాంటి మార్పులూ ఉండవు' అని బెంచ్ తేల్చిచెప్పింది. 'మా ఆదేశాలను పాటించాల్సిందే'నంటూ రాజస్థాన్, మధ్యప్రదేశ్‌కు తెలిపింది. అలాగే శ్రీ రాష్ట్రీయ కర్ణిసేన పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది. కర్ణిసేనతోపాటు అఖిల భారతీయ క్షత్రియ మహాసభ సంజయ్‌లీలా బన్సానీ చిత్రం విడుదలయ్యే అన్ని థియేటర్ల ఎదుట బైఠాయిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే వివిధ రూపాల్లో రెండు సంస్థలూ నిరసన కార్యక్రమాలు చేస్తున్నాయి. బాలివుడ్ నటి దీపక్ పదుకొనే హీరోయిన్‌గా నటించిన పద్మావత్ చిత్రం విడుదలపై పలు రాష్ట్రాల్లో నిషేధించారు. చిత్ర నిర్మాతలు సుప్రీం కోర్టును ఆశ్రయించగా నిషేధాన్ని ఎత్తివేయడంతోపాటు విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చిత్ర ప్రదర్శన, ప్రేక్షకుల భద్రత, థియేటర్ల వద్ద బందోబస్తు కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. అందరూ రాజ్యాంగానికి లోబడే నడచుకోవాలని ధర్మాసనం పేర్కొంది.



మంగళవారం ముంబయిలోని సిద్ధివినాయక స్వామిని దర్శించుకున్న దీపికా పదుకొనే. శుక్రవారం ఆమె నటించిన పద్మావత్ విడుదలవుతున్న విషయం తెలిసిందే.

# హామీలన్నీ అమలు చేయాల్సిందే

- అప్పుడే అసెంబ్లీ సీట్ల పెంపునకు ఒప్పుకుంటాం
- ఢిల్లీలో రాహుల్‌తో సమావేశమైన పీసీసీ అధ్యక్షుడు రఘువీరా

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 23: ప్రత్యేక హోదాసహా విభజన హామీలన్నీ నెరవేరిస్తేనే పార్లమెంట్‌లోని ఉభయ సభల్లో శాసనసభ స్థానాల పెంపునకు సంబంధించిన చట్ట సవరణ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సహకరిస్తుందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘువీరారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీ ఎన్నికైన అనంతరం మొదటిసారి ఆంధ్రా పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజుతో కలిసి ఢిల్లీలో సమావేశమయ్యారు. అనంతరం రఘువీరారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ సంస్థాగత అంశాలు, పరిస్థితులను రాహుల్ గాంధీకి వివరించినట్టు చెప్పారు. ఇటీవల కాంగ్రెస్ చేపట్టిన పోలవరం యాత్ర గురించి రాహుల్‌కు తెలిపినట్టు వివరించారు. పోలవరం ప్రాజెక్టును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, విభజన హామీలు అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లినట్టు వెల్లడించారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో లోక్‌సభలో 184 నిబంధన కింద విభజన హామీల అమలు అంశంపై చర్చకు నోటీసు ఇవ్వాలని రాహుల్ గాంధీని కోరినట్టు తెలిపారు. ఈ సందర్భంలోనే ఆంధ్రప్రదేశ్ విభజన హామీలపై లోక్‌సభలో ప్రస్తావించే అంశంపై కాంగ్రెస్ లోక్‌సభా పక్ష నేత మల్లికార్జున ఖర్గేని సంప్రదించి రాహుల్ సలహాలు, సూచనలు ఇచ్చినట్టు చెప్పారు. ఏపీ విభజన హామీలను గాలి కొదిలేసి శాసనసభ సీట్ల పెంపుపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు దృష్టి సారించారని ఆయన ఆరోపించారు. అసెంబ్లీ స్థానాల పెంపునకు తమ పార్టీ వ్యతిరేకం కాదని, ప్రత్యేక హోదాతోసహా విభజన హామీలన్నీ అమలు చేస్తేనే పార్లమెంట్‌లో సీట్ల పెంపు ప్రతిపాదనకు సహరిస్తామని ఆయన స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల్లో విభజన హామీల అమలుకు మిత్రపక్షాలతో కలిసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని వెల్లడించారు. పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్నప్పుడు విభజన హామీల అమలుపై ఢిల్లీలో ఆందోళన చేపట్టాలని రాహుల్ సూచించారని వెల్లడించారు. రాష్ట్రానికి సంబంధించిన సమస్యలపై అంశాలవారీగా కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని పేర్కొన్నారు.



ఢిల్లీలో విలేఖరులతో మాట్లాడుతున్న రఘువీరా

# మధ్యలో ఎన్ఐఏ ఏంటీ?

## లవ్ జిహాదీ కేసులో సుప్రీం సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జనవరి 23: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లవ్ జిహాదీ కేసులో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. హాదియా మేజర్ అయినందున ఎవర్ని పెళ్లాడాలో నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ ఆమెకు ఉందని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ప్రకటించింది. అలాగే ఈ కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తీరును కోర్టు తప్పుపట్టింది. ఇద్దరు మేజర్లు పెళ్లి చేసుకుంటే మధ్యలో ఎన్ఐఏ దర్యాప్తు చేయడానికి ఏముంటుంది? అని జస్టిస్ ఎంఎం ఖన్వీకర్, జస్టిస్ డివై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం నిలదీసింది. అలాగే మేజర్ అయిన హాదియా స్వేచ్ఛను కాదని ఆమెను బలవంతంగా తల్లిదండ్రులకు అప్పగించలేమని సుప్రీం తేల్చిచెప్పింది. హాదియా, షాఫిన్ జహాన్‌ల పెళ్లి చెల్లదంటూ కేరళ హైకోర్టు తీర్పునివ్వడం కుదరదని బెంచ్ స్పష్టం చేసింది. ఎవర్ని వివాహం చేసుకోవాలో నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ హాదియాకు ఉంది. ఆమె మేజర్ అంటూ సుప్రీం వ్యాఖ్యానించింది. కేసు తదుపరి విచారణ ఫిబ్రవరి 22కు వాయిదా వేసింది. గత ఏడాది నవంబర్ 27న హాదియాకు తల్లిదండ్రుల కస్టడీ నుంచి సుప్రీం కోర్టు విముక్తి ప్రసాదించింది. మెడికో అయిన యువతి చదువుకు ఎలాంటి ఆటంకం కల్పించవద్దని, కాలేజీకి వెళ్లనీయమని కోర్టు ఆదేశించింది. హిందూ కుటుంబానికి చెందిన 25 ఏళ్ల యువతి హాదియాగా పేరుమార్చుకుని ముస్లిం యువకుడు జహాన్‌ను పెళ్లాడింది. వీరి వివాహం చెల్లదంటూ కేరళ హైకోర్టు రద్దుచేసింది. దాన్ని జహాన్ సుప్రీం కోర్టులో సవాల్ చేశాడు.

# ఖగోళంలో మరో అద్భుతం

**4న భూమికి దగ్గరగా గ్రహశకలం**



వాషింగ్టన్, జనవరి 23: భూమికి దగ్గరగా ఉన్న మరో మధ్యస్థాయి గ్రహ శకలం పుడమి దిశగా దూసుకువస్తోంది. ఫిబ్రవరి 4న ఈ ఖగోళ ఘటన జరిగే అవకాశం ఉందని ఏజే 129 అనే గ్రహశకలం భూమికి సమీపం నుంచి దూసుకుపోయినా ఎలాంటి ముప్పు ఉండదని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ(నాసా) వెల్లడించింది. ఈ గ్రహ శకలం భూమికి అతి దగ్గరగా వచ్చినా దీనికి మనకు మధ్య ఉండే దూరం భూమికి, చంద్రుడికి మధ్య ఉండే దూరం కంటే పది రెట్లు ఎక్కువని నాసా తెలిపింది. అంటే 4.2 మిలియన్ కిలోమీటర్ల దూరం నుంచి ఈ గ్రహశకలం భూమిని దూసుకుపోతుందని వివరించింది. గత 14 సంవత్సరాలుగా ఈ గ్రహశకల భ్రమణ తీరును తాము గమనిస్తునే వస్తున్నామని, ఇప్పుడు కచ్చితంగా అది భూమికి ఎంత చేరువుగా రాబోతుంది ఎంత వేగంగా దూసుకుపోతుందన్న వివరాలను తెలుసుకోగలిగామని నాసా తెలిపింది. ఏ విధంగా చూసినా కూడా ఈ గ్రహ శకలం భూమిని ఢీకొనే అవకాశం లేదని, అలాగే మరో వందేళ్ల వరకూ దీనివల్ల భూమికి ఎలాంటి ముప్పు ఉండదని నాసాకు చెందిన పాల్ షోడాస్ వెల్లడించారు. 2002లో ఈ గ్రహ శకలాన్ని తాము గుర్తించామని దీని పరిమాణం 1.2 కిలోమీటర్ల మేర ఉండొచ్చని తెలిపారు. ఇది భూమిని సమీపించే టప్పుడు దీని వేగం సెకనుకు 34 కిలోమీటర్లని, భూమికి అతి దగ్గరగా ఉన్న గ్రహ శకలాలు అన్నింటికంటే కూడా ఏజే 129 చాలా ఎక్కువని చెప్పారు.

## అలాస్కా దీవిలో భూకంపం

అలాస్కా, జనవరి 23: ఉత్తర అమెరికాలోని కొడియాక్ దీవిలో మంగళవారం తెల్లవారుజామున 7.9 పాయింట్ల తీవ్రతతో పెను భూకంపం సంభవించింది. దీని తీవ్రత నేపథ్యంలో సునామీ హెచ్చరికను జారీ చేసినప్పటికీ తరువాత దాన్ని ఉప సంహరించుకున్నారు. రిక్టర్ స్కేల్‌పై అత్యధికంగా ఉండడంతో అలాస్కా తీర ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలు జారీ కావడంతో ప్రజలు భయంతోపరుగులు పెట్టారు. కొన్ని గంటల భయాందోళనల నేపథ్యంలో ఆ హెచ్చరికలను అధికారులు ఎత్తివేశారు. భూకంపం స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 12.30కు సంభవించింది. అలాస్కా ఖాతంలోని కోడియాక్ దీవికి ఆగ్నేయంగా 170 మైళ్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్టు తెలిపారు.

## 'పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి'

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 23: తెలుగు రాష్ట్రాల్లోని సఫాయి కర్మాచారుల సంక్షేమంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని అఖిల భారత సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. హరిద్వార్‌లో జరిగిన అఖిల భారత సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ జాతీయ కార్యవర్గ సమావేశాలు ముగిసాయి. పారిశుద్ధ్య కార్మికుల నియామకాలలో ఔట్ సోర్సింగ్ విధానాలను రద్దుచేయాలని కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని ఈ సమావేశాల్లో తీర్మానించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన నాయకులు భూపతి అప్పారావు, గండేటి శ్రీనివాస్ రావు, లీలాప్రసాద్, మన్మథరావు, ఆనందరావు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు.

# బిజినెస్

# భారత్‌లో 10 శాతం వృద్ధిరేటు సాధ్యమే

## నీతి ఆయోగ్ మాజీ ఉపాధ్యక్షుడు పనగరియా




న్యూయార్క్, జనవరి 23: కార్మిక చట్టాలు, భూసేకరణ వంటి రంగాల్లో సంస్కరణలు చేపడితే, పది శాతం వృద్ధిరేటును సాధించడం భారత్‌కు అసాధ్యమేమీ కాదని నీతి ఆయోగ్ మాజీ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగరియా అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మొదటి మూడేళ్ల పాలనలో ఆర్థిక వృద్ధిరేటు 7.5 శాతానికి చేరుకుందని ఆయన గుర్తుచేశారు. న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వ విద్యాలయంలో జరిగిన ఓ సదస్సులో ఆయన మాట్లాడుతూ, కార్మిక చట్టాలు, భూసేకరణ అంశాల్లో సంస్కరణలు తీసుకురావాల్సి ఉందన్నారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న పెద్దనోట్ల రద్దు, వస్తుసేవా పన్ను (జీఎస్టీ) అనే రెండు ప్రధాన సంస్కరణల కారణంగా వృద్ధిరేటు స్వల్పంగా క్షీణించిందని ఆయన తెలిపారు. ‘2022 నాటికి నవీన భారత్’ అనే మోదీ ఆశయాల ప్రభావంతో కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రముఖుల ప్రసంగాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పనగరియా భారత ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులను వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి భారత్ 6.5 శాతం వృద్ధి రేటును సాధించే అవకాశం ఉందన్నారు. 8 శాతం వృద్ధిరేటును సైతం భారత్ సాధిస్తుందనడంలో ఎలాంటి అనుమానం లేదని, ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందన్న విషయంలోనూ సందేహం లేదన్నారు. భారత్ రెండంకెల వృద్ధి రేటును సాధించాలంటే కొన్ని కీలక రంగాల్లో సంస్కరణలు అవసరమని ఆయన విశ్లేషించారు. కాగా, చైనా వృద్ధి రేటు 5 శాతానికి పతనమవుతుందని ఆయన అంచనా వేశారు.

కొద్దిరోజుల్లో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్ గురించి సమావేశంలో కొందరు ప్రశ్నించగా, గత ఏడాది బడ్జెట్‌తో పోల్చిచూస్తే 2018-19 బడ్జెట్‌లో అనేక మార్పులు ఉంటాయని పనగరియా అన్నారు. కొద్దిరోజుల్లో సంస్కరణల ఆధారిత బడ్జెట్ రాబోతోందని ఆయన జోస్యం చెప్పారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి కీలక సంస్కరణల తర్వాత ప్రవేశ పెడుతున్న బడ్జెట్‌పై అన్ని వర్గాల వారూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని అన్నారు. సంస్కరణలను సూచించేలా బడ్జెట్ ఉండవచ్చని, వ్యవసాయ రంగంపై బడ్జెట్‌లో తగినంతగా దృష్టి సారించాలని అన్నారు. భారత్‌లో నిరుద్యోగం మరీ అంత ఎక్కువగా లేదని, ఉపాధి అవకాశాలను కల్పించాల్సి ఉందన్నారు. ఉద్యోగాలు ఇచ్చేవారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని, ఇది దీర్ఘకాలంగా ఉన్న డిమాండ్ అన్నారు. నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడిగా మూడేళ్ల పాటు తాను సంతృప్తికరంగా విధులు నిర్వహించానని పనగరియా తెలిపారు. బడా పారిశ్రామికవేత్తల నుంచే సమస్యలు ఎదురవుతున్నాయని, అయినా ప్రభుత్వం వారి జోలికి వెళ్లడం లేదని, భారత్‌లో అవినీతిపై ప్రధాని మోదీ పోరాటం చేస్తున్నారని అన్నారు.

# స్టాక్‌మార్కెట్ సంచలనం

## 11వేల మైలురాయిని దాటిన నిఫ్టీ




ముంబయి, జనవరి 23: దేశీయ స్టాక్‌మార్కెట్లలో సంచలనాల పరంపర కొనసాగుతోంది. గత వారం రోజులుగా దూకుడు మీదున్న సూచీలు ఈ వారం కూడా అదే జోరును కొనసాగిస్తున్నాయి. అంతకంతకూ దూసుకుపోతూ లభాల తీరాలను తాకుతున్నాయి. 2018-2019 సంవత్సరాల్లో ప్రపంచంలోనే అత్యంత వేగంగా దూసుకుపోతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని ‘అంతర్జాతీయ ద్రవ్య నిధి’ (ఐఎంఎఫ్) ప్రకటించిన నేపథ్యంలో నిఫ్టీ, సెన్సెక్స్ దూకుడును కొనసాగించడం గమనార్హం. దావోస్‌లో ప్రపంచ ఆర్థికవేత్తల సదస్సు ప్రారంభమైన సందర్భంగా ‘వరల్డ్ ఎకనమిక్ అవుట్‌లుక్’ (డబ్ల్యుఇఒ) వివిధ దేశాల్లో ఆర్థిక వ్యవస్థ పరిణామాలను అంచనా వేసింది. ఆసియాలో వలే యూరోపియన్ షేర్లలోనూ మంగళవారం దూకుడు కనిపించింది. అమెరికాలో ‘షట్‌డౌన్’కు తెరపడడంతో అక్కడి షేర్ మార్కెట్ బలం పుంజుకుంది.

భారతీయ స్టాక్ మార్కెట్‌లో మంగళవారం నాడు కూడా సూచీలు కొత్త రికార్డులతో ట్రేడింగ్‌కు శ్రీకారం చుట్టాయి. మార్కెట్ చరిత్రలోనే తొలిసారిగా జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజి ‘నిఫ్టీ’ 11వేల మైలురాయిని దాటి దూసుకువెళ్లింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజి ‘సెన్సెక్స్’ కూడా 36వేల బెంచ్ మార్క్‌దాటి ట్రేడ్ అయింది. సానుకూల అంతర్జాతీయ సంకేతాలు, రాబోయే కేంద్ర బడ్జెట్‌పై ఆశావహ అంచనాలు మార్కెట్ సెంటిమెంటును బలపరచడంతో సూచీలు జీవన కాల గరిష్ఠాలను సాధించడం మొదలైంది. నిఫ్టీ 117.50 పాయింట్లకు చేరుకుని 11,083 వద్ద కొనసాగింది. సెన్సెక్స్ 210 పాయింట్ల లాభంతో 36,008 వద్ద కొనసాగింది. ఇన్ఫోసిస్, వేదాంతా లిమిటెడ్, యాక్సిస్ బ్యాంకు, ఎస్‌బీఐ, టాటాస్టీల్ తదితర సంస్థల షేర్లు లాభాల్లో దూసుకువెళ్లాయి. అంబూజా సిమెంట్, ఐషర్ మోటార్, విప్రో, జీల్, హింద్ పెట్రో షేర్లు నష్టపోయాయి.

**2018-2019 సంవత్సరాల్లో ప్రపంచంలోనే అత్యంత వేగంగా దూసుకుపోతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని ‘అంతర్జాతీయ ద్రవ్యనిధి’ (ఐఎంఎఫ్) ప్రకటించిన నేపథ్యంలో నిఫ్టీ, సెన్సెక్స్ దూకుడును కొనసాగించడం గమనార్హం.**

# మీ సాంకేతిక పరిజ్ఞానం అమితాశ్చర్యం!

★ సంస్థలకూ అంత నాలెడ్జ్ ఉండదేమో?

★ బాబును ప్రశంసించిన ఏజిల్ లాజిస్టిక్ సీఈఓ తరక్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 23: దావోస్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఏజిల్ లాజిస్టిక్స్ సీఈఓ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సీఈఓ తరక్ సుల్తా అల్ ఎస్సా, డైరెక్టర్ ఉగెన్ మెన్ వ్యాపార విస్తరణకు ప్రణాళికలతో ఉన్నామని ముఖ్యమంత్రికి వివరించారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నామని, ముఖ్యంగా సాంకేతికంగా ముందున్న ఆంధ్రప్రదేశ్ వైపు దృష్టి సారించామని బాబు దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వ నేతగా ఉన్న వ్యక్తి నుంచి సాంకేతికతకు సంబంధించిన మాటలు వినడం నాకు అమితాశ్చర్యంగా ఉంది. సంస్థలకు సంబంధించిన వారు కూడా ఇంత పరిజ్ఞానంతో మాట్లాడలేరని తరక్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా విమానాశ్రయాల్లో గ్రౌండ్ ఆపరేషన్స్ నిర్వహణ పట్ల ఈ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇండియాలో ముంబై, ఆఫ్రికాలో మరికొన్ని నగరాల్లో ఉన్న ఈ సంస్థ ఎయిర్‌పోర్టుల్లో గ్రౌండ్ ఆపరేషన్స్ నిర్వహిస్తోంది. కాగా ఏపీ అవసరాలు ఎలా ఉన్నాయో అధ్యయనం చేస్తామని బాబుకి తెలిపారు. ‘మీరు మాచేత పెట్టుబడులు పెట్టించేందుకు మమ్మల్ని ఒప్పించనవసరం లేదు. ఎందుకంటే మీ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని మేము ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకున్నాం. అది ఎప్పుడు ఎలా అన్నదే ఆలోచిస్తున్నాం. త్వరలో అమరావతికి వచ్చి కార్యాచరణ చేపడతామని’ తరక్ సీఎంకు హామీ ఇచ్చారు.

# ఏపీతో కలిసి పని చేసేందుకు సిద్ధం

## పే పాల్ వైస్ ప్రెసిడెంట్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని పే పాల్ వైస్ ప్రెసిడెంట్ రిచర్డ్ నాష్ వెల్లడించారు. దావోస్‌లో ఆయనతో రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత సమస్యలు అధిగమించేందుకు టెక్నాలజీ ఉపయోగిస్తున్నామని వివరించారు. ఒక స్టార్ట్ అప్ రాష్ట్రంగా అధునాతన టెక్నాలజీ వినియోగంతో మూడున్నర ఏళ్లలో అభివృద్ధి సాధించామన్నారు. రాష్ట్రంలో ఐటి అభివృద్ధికి అనేక రాయితీలు ఇస్తున్నామన్నారు. ల్యాండ్ రికార్డులన్నీ బ్లాక్‌చైన్ ఫ్లాట్‌ఫార్మ్ పైకి తీసుకువచ్చామన్నారు. విశాఖలో వీసాతో కలిసి పని చేస్తున్నామని, వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న సేవలను నగదు రహితంగా మార్చామన్నారు. తాము అందిస్తున్న సహకారాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. పే పాల్ వైస్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ తమ సంస్థ కార్యకలాపాలు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఏపీతో కలిసి పని చేసేందుకు సిద్ధమని వెల్లడించారు.

# అమరావతిలో ఫ్యూచరిస్టిక్ క్యాంపస్

## సీఎంకు తెలిపిన ఎస్‌బీఐ చైర్మన్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: అమరావతిలో ఫ్యూచరిస్టిక్ క్యాంపస్ ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్ తెలిపారు. దావోస్‌లో సీఎంను ఆయన మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ అమరావతి అభివృద్ధిని నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. రాజధాని నిర్మాణానికి చేస్తున్న కృషిని అభినందించారు. అమరావతిలో ప్రాంతీయ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. దీనిపై చైర్మన్ సానుకూలంగా స్పందించి, ఫూచరిస్టిక్ క్యాంపస్ ఎర్పాటు చేస్తామని తెలిపారు.

# తొలి ఎకనామిక్ సిటీగా జక్కంపూడి

## మంత్రి దేవినేని ఉమా

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: గ్రామాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించి పట్టణాలకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. విజయవాడ రూరల్ జక్కంపూడి-షాబాద్ బీసీ కాలనీలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి దేవినేని మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా జక్కంపూడిలో ఎకనామిక్ సిటీ నిర్మించనున్నామన్నారు. ఈ సిటీలో పరిశ్రమలు, ఐటీ కంపెనీలు స్థాపించి ఉద్యోగాలు ఇక్కడి వారికే కల్పిస్తామని మంత్రి తెలిపారు. మార్చి మాసాంతానికి అన్ని గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేయాలని, లేకుంటే సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా వచ్చి గ్రామాల్లో కూర్చుని దీక్ష చేస్తారని మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ సంవత్సరంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తిచేస్తామన్నారు.

# ‘మిడ్‌టెక్’ సెంటర్ ప్రతినిధులతో బాబు భేటీ

## విశాఖ పార్కులో యూరోపియన్ సెగ్మెంట్ ప్రారంభం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 23: గత ఏడాది ఈడీబీతో అవగాహన ఒప్పం దం చేసుకున్న మిడ్‌టెక్ ఇన్నోవేషన్ సంస్థ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు దావోస్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 50 సంస్థలతో లెటర్ ఆఫ్ ఇంటెంట్ చేసుకుంది. 150 కంపెనీలను ఏపీకి తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తొలిదశలో 60 సంస్థలను తీసుకువచ్చేందుకు సంప్రదింపులు పూర్తిచేశామని సంస్థ ప్రతినిధులు చెప్పారు. కేవలం పెట్టుబడులను తీసుకురావడమే కాకుండా ఆ సంస్థలకు ఆశాజనకంగా ఉండేలా ఏపీలో ఎకో సిస్టమ్ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నామని, అత్యున్నత సాంకేతిక నైపుణ్యం గలవారు, శాస్త్ర నిపుణులతో 45 నుంచి 50వేలకు పైగా ఉద్యోగాల కల్పన, దీనికి రెట్టింపు సంఖ్యలో పరోక్ష ఉద్యోగాల కల్పన ధ్యేయంగా పని చేస్తున్న మిడ్‌టెక్ ఇన్నోవేషన్ సెంటర్ పని చేస్తోందని వారు సీఎంకు తెలిపారు. వైజాగ్ మిడ్‌టెక్ పార్కులో భాగస్వామ్యం తీసుకుని క్రమంగా విస్తరణకు మిడ్‌టెక్ ప్రణాళికలు రూపొందించనుంది. అందులో భాగంగా యూరోపియన్ సెగ్మెంట్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది.

# రాయలసీమ ఇక పారిశ్రామిక సీమ

## ఐటీ మంత్రి నారా లోకేష్ ★ ‘ఇండస్ట్రియల్ కారిడార్స్ ఇన్ ఇండియా’ బిజినెస్ సెషన్‌లో ఆకట్టుకున్న మంత్రి ప్రసంగం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి



సదస్సులో పాల్గొన్న మంత్రి లోకేష్, తదితరులు

అమరావతి, జనవరి 23: దశాబ్దాలుగా నీరు లేక నిస్తేజమైన రాయలసీమ నేడు జలవనరులతో కళకళలాడుతోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన నవ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయలసీమ రూపురేఖలు మార్చి పారిశ్రామికాభివృద్ధికి బాటవేసిందని ఆంధ్రప్రదేశ్ ఐటీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. అనంతపురం జిల్లాలో దక్షిణ కొరియా కంపెనీ కియా మోటార్స్ తన కార్ల ఫ్యాక్టరీని నెలకొల్పడమే ఇందుకు నిదర్శనమని లోకేష్ అన్నారు. నదుల అనుసంధానంతో రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమకు మునుపెన్నడూ లేనంతగా నీరు తెచ్చిందని వివరించారు. అందువల్లనే అనంతపురం జిల్లా నేడు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధికి ముఖ్య కేంద్రంగా రూపుదిద్దుకుంటోందని ఆయన చెప్పారు. నదుల అనుసంధానం దశాబ్దాలుగా ఒక కలగా మిగిలిందని, గోదావరి-కృష్ణా అనుసంధానం ద్వారా తాము చేసి చూపించామని లోకేష్ చెప్పారు. సమీప భవిష్యత్తులో మరిన్ని నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రాన్ని అత్యున్నత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు.

మంగళవారం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో సీఐఐ, పీడబ్ల్యుసి సంయుక్తంగా నిర్వహించిన ‘ఇండస్ట్రియల్ కారిడార్స్ ఇన్ ఇండియా’ వ్యాపార విభాగ (బిజినెస్ సెషన్)లో మంత్రి నారా లోకేష్ ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్‌కు రెండు పారిశ్రామిక కారిడార్లు ఒక వరమని, వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, చెన్నై-బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్లని వ్యూహాత్మకంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి కోసం వినియోగించుకుంటున్నామని లోకేష్ వివరించారు. అనంతపురం జిల్లాలో జలవనరుల అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యతనిచ్చామని, అందుకే ప్రపంచ ప్రసిద్ధి చెందిన కియా మోటార్స్ సంస్థ ఈ జిల్లాలో కార్ల కంపెనీ ఏర్పాటుకు ముందుకు వచ్చిందని అన్నారు. వివిధ ప్రాంతాల్లో వనరులు, మౌలిక సదుపాయాల లభ్యతను అనుసరించి క్లస్టర్ల వారీగా పారిశ్రామికాభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు లోకేష్ వివరించారు. ఏపీలో ఏర్పాటు చేస్తున్న ఎలక్ట్రానిక్స్, సోలార్ క్లస్టర్లను ఉదహరించారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి అనువైన పరిస్థితులు సృష్టించడానికి ఉత్పాదక క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తిరుపతి ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో ఇప్పటికే సెల్కాన్, డిక్సన్, కార్బన్ లాంటి సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించాయని ఐటీ మంత్రి లోకేష్ గుర్తుచేశారు, శ్రీసిటీ సెజ్‌లో ఫాక్స్‌కాన్ మొబైల్ తయారీ కంపెనీలో ఒకేచోట 12వేల మంది మహిళలకు ఉద్యోగాలు వచ్చాయని మంత్రి లోకేష్ తెలిపారు. మొబైల్ ఫ్యానుఫ్యాక్చరింగ్‌లో బ్యాటరీ తయారీ నుంచి పూర్తిస్థాయి మొబైల్ తయారీ వరకూ ఉన్న అన్ని విడి భాగాల తయారీ కంపెనీలతో క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో ప్రతికూల పరిస్థితులను సానుకూలంగా మార్చుకుని దేశ చరిత్రలోనే తొలిసారిగా రాష్ట్ర రాజధాని నిర్మాణానికి 35వేల ఎకరాల భూమిని సమీకరణ పద్ధతిలో తీసుకున్నామని, రాజధాని అమరావతి నిర్మాణంలో వారిని భాగస్వాములను చేశామని తెలిపారు.

# అమెరికాలో ‘షట్‌డౌన్’ ముగిసింది

★ ద్రవ్య బిల్లుపై సంతకం చేసిన ట్రంప్

★ ఇదో ‘గొప్ప విజయం’ అని అధ్యక్షుడి ప్రకటన

★ ‘డ్రీమర్ల’పై చర్చకు డెమోక్రాట్లతో ఒప్పందం

వాషింగ్టన్, జనవరి 23: అమెరికాలో మూడురోజులుగా ‘మూతపడిన ప్రభుత్వం’ తిరిగి మంగళవారం నాడు యథాస్థితికి చేరుకుంది. దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ద్రవ్య బిల్లుపై సంతకం చేయడంతో ‘షట్‌డౌన్’కు తెరపడింది. తాజా పరిణామాన్ని ఆయన ‘గొప్ప విజయం’గా అభివర్ణించుకున్నారు. నిర్ణీత కాలవ్యవధిలోగా ద్రవ్య వినిమయ బిల్లు సెనేట్ ఆమోదం పొందలేక పోవడంతో ఈనెల 19న అర్ధరాత్రి సమయంలో అమెరికా ప్రభుత్వం మూతపడింది. మిలటరీ, ఇతర అత్యవసర సేవలను ‘షట్‌డౌన్’ నుంచి మినహాయించగా మిగతా ప్రభుత్వ శాఖలన్నీ మూతపడ్డాయి. లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులకు వేతనం లేని సెలవులు ఇచ్చారు. ఈ పరిస్థితుల నుంచి దేశాన్ని గట్టెక్కించేందుకు ట్రంప్ ప్రయత్నాలు ప్రారంభించారు.

అమెరికాలో ‘డ్రీమర్ల’ భవిష్యత్ ప్రశ్నార్థకమైందన్న ఆగ్రహంతో విపక్ష డెమోక్రాట్లు ద్రవ్య వినిమయ బిల్లును అడ్డుకున్న సంగతి తెలిసిందే. అమెరికాలో విదేశీ ఉద్యోగుల పిల్లలను ‘డ్రీమర్లు’ (స్వాప్నికులు)గా పేర్కొంటున్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా అమెరికాకు వలస వస్తున్న యువతను (డ్రీమర్ల)ను ఆదుకోవాలని డెమోక్రాట్లు పట్టుబడుతున్నారు. ‘డ్రీమర్ల’ భవిష్యత్‌పై చర్చించేందుకు డెమోక్రాట్లతో ట్రంప్ ఒప్పందం చేసుకోవడంతో ‘షట్‌డౌన్’ ముగిసింది. డెమోక్రాట్లను ట్రంప్ ప్రసన్నం చేసుకోవడంతో ఆయన ప్రతిపాదించిన ద్రవ్య బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభలోని 266 మంది సభ్యుల్లో 150 మంది అనుకూలంగా ఓటు వేశారు. ఫిబ్రవరి 8 వరకూ తాత్కాలికంగా నిధులు విడుదల చేసేందుకు ఉద్దేశించిన బిల్లుకు సోమవారం రాత్రి డెమోక్రాట్ల మద్దతు పొందడంలో ట్రంప్ విజయం సాధించారు. ‘సెనేట్’లోనూ, ‘హౌస్’ (ప్రతినిధుల సభ)లోనూ ఆ బిల్లు ఆమోదం పొందింది. కాగా, పూర్తిస్థాయిలో ద్రవ్య వినిమయం, అక్రమ వలసలకు సంబంధించి కొద్దిరోజుల్లో తిరిగి చర్చలు జరిపేందుకు డెమోక్రాట్లకు, అధికార రిపబ్లికన్స్‌కు మధ్య ఒప్పందం కుదిరింది. డెమోక్రాట్లతో ఒప్పందం కుదరడంతో ‘షడ్‌డౌన్’ ముగిసి, అమెరికాలో మంగళవారం ప్రభుత్వ కార్యకలాపాలు యథావిధిగా ప్రారంభమయ్యాయి. షట్‌డౌన్’ ముగియడం రిపబ్లికన్లు సాధించిన గొప్ప విజయమని ట్రంప్ చెప్పుకున్నారు. ప్రభుత్వం తిరిగి పనిచేసేలా వివిధ శాఖలకు నిధులు విడుదల చేసేందుకు డెమోక్రాట్లు సహకరించడం శుభ పరిణామమని ఆయన అన్నారు. మిలటరీ, సరిహద్దు భద్రత, ఇతర కీలక రంగాల్లో నిధులు ఖర్చు చేసేందుకు ఇపుడు అవకాశం కలిగిందన్నారు. వలసవాదుల వల్ల దేశానికి మేలు జరుగుతుందని భావిస్తే ఆ విషయంలో దీర్ఘకాల ప్రణాళిక అమలు చేస్తామని, నిధుల ఖర్చుకు సంబంధించి ఆమోదం లభించడంతో సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం తగిన కృషి చేస్తుందన్నారు.

# వైద్య పరికరాలు తయారు చేయండి

## రోషే సంస్థను ఆహ్వానించిన బాబు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: గ్లోబల్ ఫార్మా కంపెనీ రోషే ప్రతినిధి క్రిస్టోఫె ఫ్రాంజ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దావోస్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా భారత్‌లో దీర్ఘకాలంగా తమ కార్యకలాపాలు సాగిస్తోందని అయితే తమ కార్యకలాపాలను మరింత విస్తరించదల్చామని రోషే ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం తాము అత్యున్నత ఎలక్ట్రానిక్ మెడికల్ హెల్త్ రికార్డుల తయారీపై అధ్యయనం చేస్తున్నామని ముఖ్యమంత్రికి వివరించారు. దానికి స్పందించిన సీఎం కేంద్ర ప్రభుత్వ సహకారంతో 4నెలల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇలాంటి ఉత్తమ ప్రయత్నం మొదలుపెట్టామని, మీరు కూడా కలిసి వస్తే సంయుక్తంగా చేపడదామని ఆహ్వానించారు. రోషే సంస్థ తమ వైద్య పరికరాల తయారీ కేంద్రంగా ఏపీని ఎంచుకుంటే బావుంటుందని సూచించారు. ప్రస్తుతం భారత, ఆంధ్రప్రదేశ్ పాలసీల వల్ల తక్కువ సుంకాలు ఉన్నాయి. దాంతో పాటు ప్రభుత్వం తరపున వైద్య పరికరాల కొనుగోలుకు తయారీ సంస్థకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

# ఏపీలో పైలెట్ ప్రాజెక్టు ఏర్పాటుకు సుజ్లాన్ గ్రూపు ఆసక్తి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో సుజ్లాన్ గ్రూప్ సీఎండీ తుల్సి తంతి దావోస్‌లో మంగళవారం సమావేశమయ్యారు. పవన, సౌర, గ్యాస్ ఆధారిత విద్యుత్ రంగాల్లో తమ భవిష్యత్ విస్తరణ ప్రణాళికల గురించి ముఖ్యమంత్రికి తుల్సి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తమ సంస్థకు గ్యాస్ కేటాయింపుల అంశాన్ని పరిష్కరించిన విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. పునరుత్పాదక విద్యుత్ నిల్వ అంశంలో భారీ పరిశోధనలు చేస్తున్నామని ముఖ్యమంత్రికి వివరించారు. ఏపీలో పైలెట్ ప్రాజెక్టు ఏర్పాటుకు సుజ్లాన్ గ్రూప్ ఆసక్తి కనబరిచింది. ముఖ్యమంత్రితో మంత్ర డాటా సెంటర్స్ బోర్డ్ మెంబర్ మోహన్ చైనాని కలిసి సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో డాటా సెంటర్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రికి మోహన్ తెలిపారు. అందుకు అవసరమైన భూమి, విద్యుత్, ఫైబర్ వసతులు కల్పించాలని సీఎంను కోరారు. గూగుల్, యాక్సెంచర్ డాటా సెంటర్లు కూడా ఏపీలో ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. కావాల్సిన అన్ని అనుమతులు 21రోజుల్లో కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

# ఏబీబీ అధ్యక్షుడితో ముఖ్యమంత్రి భేటీ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: ఏబీబీ అధ్యక్షుడు చున్యున్ గుతో ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్‌లో సమావేశమయ్యారు.

సౌర, పవన, హైబ్రిడ్ విద్యుత్ రంగాల్లో ఏపీ అనుసరిస్తున్న నూతన విధానాలను, అమరావతిలో కాలుష్య రహిత విద్యుత్ వాహనాలకు ఇస్తున్న ప్రాధాన్యతను ముఖ్యమంత్రి ఆయనకు వివరించారు.

రాష్ట్రంలో రెండో తరం విద్యుత్ రంగ సంస్కరణలు అమలుతో విద్యుత్ వినియోగం పెరిగినా బిల్లులు పెరగకుండా చేశామని, నాణ్యమైన, స్వచ్ఛమైన విద్యుత్ కోసం సౌర, పవన విద్యుత్‌లను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నామని, అందుకోసం అత్యుత్తమ విధాన నిర్ణయాలు తీసుకున్నామని వివరించారు. తమ తయారీ కేంద్రాన్ని ఏపీలో నెలకొల్పాలని ఏబీబీ సంస్థను ఆహ్వానించగా, ఏపీ పాలసీలను అధ్యయనం చేసి తయారీ కేంద్ర ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని చున్యున్‌గు సీఎంకు హామీ ఇచ్చారు.

# ‘సింగరేణి’లో రక్షణ చర్యలపై మరింత అవగాహన అవసరం

★ మైన్స్ సేఫ్టీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎస్‌కె దత్తా

★ గోదావరిఖనిలో ఘనంగా సింగరేణి 50వ రక్షణ వారోత్సవాలు

గోదావరిఖని, జనవరి 23: సింగరేణి బొగ్గు పరిశ్రమలో రక్షణ చర్యలపై మరింత అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఎస్‌కె దత్తా సూచించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని సింగరేణి జవహార్ లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో మంగళవారం రాత్రి సింగరేణి 50వ వార్షిక రక్షణ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా బహుమతి ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్‌కె.దత్తా జ్యోతి ప్రజ్వలన అనంతరం బొగ్గు గని కార్మికులను, అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రమాదాల్లో చిన్నవి... పెద్దవి అనేవి ఉండవని, అన్నింటినీ ఒకేలాగా తీసుకోవాలని, ప్రమాదాలకు చోటు లేకుండా ఉత్పత్తి జరపాలని అన్నారు. గని కార్మికులకు రక్షణ చర్యలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని పేర్కొంటూ గత ఏడాది కంటే ప్రస్తుతం సింగరేణిలో ప్రమాదాల సంఖ్య పెరిగిందని, రక్షణ విషయాల్లో మైన్స్ అండ్ సేఫ్టీతో సింగరేణి ఎప్పటికీ అందుబాటులో ఉండాలని అన్నారు. సింగరేణి డైరెక్టర్ (పా) పవిత్రన్ కుమార్ మాట్లాడుతూ... సింగరేణి బొగ్గు పరిశ్రమలో ప్రమాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవడంతోపాటు సూత్రాలన్ని కూడా పాటిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు శంకర్, భాస్కర్ రావు, చంద్రశేఖర్, విజయ్ కుమార్, నర్సయ్య, క్రిష్ణ ప్రసాద్, వసంత కుమార్, జి ఎంలు విజయపాల్ రెడ్డి, విజయబాబు, రాజేందర్ రెడ్డి, సంఘాల ప్రతినిధులు వెంకట్రావ్, గట్టయ్యతో పాటు వేలాది మంది కార్మికులు, కార్మిక కుటుంబాలు పాల్గొన్నాయి.

# దమ్ముంటే బహిరంగ చర్చకు రా!

★ జగన్‌పై మంత్రి నక్కా విసుర్లు

ఆంధ్రభూమి బ్యూరో

గుంటూరు, జనవరి 23: దళితులకు మీరేం చేశారో..మా ప్రభుత్వం ఏం చేసిందో బహిరంగ చర్చలో తేల్చుకుందాం..దమ్ముంటే రా!.. వేలాది ఎకరాల దళితుల భూములు కాజేసి వాస్తవాలను వక్రీకరిస్తావా.. ఖబడ్దార్..ఇకపై నీ ఆటలు సాగవని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌కు గిరిజన, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు సవాల్ విసిరారు.. చిత్తూరు జిల్లాలో పాదయాత్ర సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై జగన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి నక్కా తీవ్రంగా స్పందించారు. మంగళవారం రాష్ట్ర టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాం నుంచి వైఎస్ వరకు చేసిన అభివృద్ధి.. ఇప్పుడు జరుగుతున్నదానిపైనా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఇడుపులపాయలో జగన్ తండ్రి వైఎస్, తాత రాజారెడ్డి దళితుల భూములను కబ్జా చేసింది నిజంకాదా అని ప్రశ్నించారు. అదేమని ప్రశ్నిస్తే వారిని వేధింపులకు గురిచేశారని, బండారం బయటపడిన తరువాత దళితుల భూములను ప్రభుత్వానికి స్వాధీనం చేస్తున్నట్లు శాసనసభలో వైఎస్ ప్రకటించారని గుర్తుచేశారు.

### మీకు బాబుకు పోలికనా!: మంత్రి జవహర్

వైఎస్ హయాంలో చేసిన మోసాలు, అన్యాయాలు, దారుణాలను దళితులు గ్రహించటంతోపాటు నేడు చంద్రన్న ప్రభుత్వం పెద్ద ఎత్తున చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై తెలుగుదేశం వైపు వస్తున్నందుకే మరోసారి దళితులను మోసం చేయడానికి ప్రభుత్వంపై ప్రతిపక్ష నేత జగన్ దుష్ప్రచారానికి పూనుకున్నారని మంత్రి జవహర్ ఆరోపించారు. ' మీ కుటుంబానికి, బాబు కుటుంబానికి పోలికే లేదు, అడుగడుగునా దళితులను దగా చేసిన చరిత్ర వైఎస్ కుటుంబానిది. బెదిరించి, బాధించి, వేధించి దళితుల భూములను లాక్కొన్న చరిత్ర వైఎస్ కుటుంబానిదే. నేటికీ ఇడుపులపాయలో మీ కుటుంబం అధీనంలో బినామీ పేర్లతో అసైన్డ్ భూములున్నాయి. మీ కుటుంబం అధీనంలో ఉన్న అసైన్డ్ భూములను దళితులకు అప్పగించి వారికి మీరు బహిరంగ క్షమాపణ చెప్పి మాట్లాడాలి' అని మంత్రి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు మంత్రి జవహర్ బహిరంగ లేఖ రాశారు.

### ఆ అసైన్డ్ భూములు దళితులకు అప్పగించండి

పాదయాత్రలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి దళిత సమావేశంలో ఆవేశంగా మాట్లాడుతూ దళిత కుటుంబాల్లో వెలుగు నింపుతానని కపట ప్రేమ వలకబోస్తూ మొసలి కన్నీరు కారుస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ వర్ల రామయ్య అన్నారు. విజయవాడలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డిగాని, ఆయన తండ్రి వైఎస్ గాని, వారి కుటుంబాలకు గానీ ఎవరికీ దళితుల మీద ప్రేమ లేదన్నారు. ఇడుపులపాయ ఎస్టేట్‌లో, ఇతర ప్రాంతాల్లో జగన్ కుటుంబం ఆధీనంలో ఉన్న దళితులకు సంబంధించిన ఎసైన్డ్ భూములు ఇంతవరకు పూర్తిగా ప్రభుత్వానికి ఎందుకు స్వాధీనపరచలేదని ప్రశ్నించారు. ఇప్పటికీ 400 ఎకరాలు దళితులకు చెందిన అసైన్డ్ భూములు మీ ఆధీనంలో ఉన్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 710 ఎకరాలు ఇడుపులపాయలో అసైన్డ్ భూములున్నాయని మీ తండ్రి ముఖ్యమంత్రిగా శాసనసభలో ప్రకటన చేసి క్షణంలోనే మాటమార్చి 310 ఎకరాలు మాత్రమే ప్రభుత్వానికి స్వాధీనం చేసింది నిజం కాదా? నీకు చిత్తశుద్ధి ఉంటే నిజంగా దళితులపై ప్రేమ ఉంటే మీరిప్పటికీ అనుభవిస్తున్న 400 ఎకరాల అసైన్డ్ భూములు ప్రభుత్వానికి స్వాధీనపరచి మీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సవాల్ చేశారు.

### వైసీపీకి, జగన్‌కు రాజకీయ విలువల్లేవ్: అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం: ప్రత్యేక హోదా ఇస్తే బీజేపీతో కలిసి పనిచేస్తానన్న వైసీపీ నేత జగన్‌కు, ఆ పార్టీకి రాజకీయ విలువల్లేవని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. బీజేపీతో కలిసి పనిచేసేందుకు సిద్ధమంటూ ప్రజలను మభ్యపెడుతున్న జగన్ ముందుగా వారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలన్నారు. మంగళవారం ఇక్కడి జెడ్పీ సమావేశ మందిరంలో మీడియాతో మంత్రి మాట్లాడారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఓటింగ్‌లో ఓటు వేయాలంటే ప్రత్యేక హోదా ఇవ్వాలని ఆ రోజుల్లో ఎందుకు మెలిక పెట్టలేకపోయారని ప్రశ్నించారు. అలాగే, హోదా ఇవ్వకపోతే తమ ఎంపీలతో రాజీనామా చేయిస్తానన్న జగన్ ఎందుకు వెనకడుగు వేసారని మరో ప్రశ్న సంధించారు. మాట వరసకు కూడా స్పెషల్ స్టేటస్ కావాలని అడగని జగన్ ఇప్పుడు ఇలా మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్‌కు అన్ని దారులూ మూసుకుపోయాయని, పార్టీలో నేతలంతా వెళ్ళిపోతుండటంతో అతనికి భయం పట్టుకుందన్నారు. పార్టీని నిలబెట్టుకునేందుకు జగన్ తాపత్రయపడుతున్నారని ఆరోపించారు.

# ప్రజలతో అడుగుకలిపిన జగన్

పెళ్లకూరు, జనవరి 23: వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర మంగళవారం ఉదయం జిల్లా పరిధిలోని పెళ్లకూరు మండలం పునబాక గ్రామానికి ప్రవేశించింది. జిల్లా నుండి పార్టీ అగ్రనాయకులు నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి, కాకాని గోవర్ధన్ రెడ్డి, ఎంపి వరప్రసాదరావు, ఎమ్మెల్యేలు మేకపాటి గౌతంరెడ్డి, కిలివేటి సంజీవయ్యలతో పాటు కేడరంతా పునబాక గ్రామానికి విచ్చేసి జగన్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగన్‌కు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జగన్ తన పాదయాత్రను పార్టీ శ్రేణులు, నాయకులు, ప్రజలతో కలసి పునబాక గిరిజన కాలనీ నుండి ప్రారంభించారు. దారి పొడవునా మహిళలు జగన్‌కు హారతులు పట్టి ఆశీర్వచనాలు పలికారు. యాత్రలో భాగంగా జగన్ పునబాక దళిత, ఎస్టీకాలనీ, అర్ధమాల క్రాస్ రోడ్డు, చెంబేడు, సిఎస్ పేటల కూడళ్ల వద్ద ప్రజలను ఉద్దేశించి కొద్దిసేపు ప్రసంగించారు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు అమలుకు వీలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. తనను ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేస్తే 45 ఏళ్లకే పించన్లు మంజూరు చేస్తానని ప్రకటించారు. ప్రతి విద్యార్థికి ఫీజురీయింబర్స్ మెంట్ సహా ఉన్నత విద్యకు రుణ సౌకర్యం కల్పిస్తానని హామీఇచ్చారు. సాయంత్రం ఐదుగంటలకు ఈ పాదయాత్ర చెన్నప నాయుడు పేట హరిజన వాడ వద్ద ముగిసింది.



నెల్లూరు జిల్లా పెళ్లకూరు వద్ద ప్రజలతో కలిసి అడుగువేస్తున్న వైకాపా అధ్యక్షుడు జగన్

# మోదీ మళ్లీ వస్తే దేశానికి విపత్తే

## మాజీ ఎంపీ ఉండవల్లి

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 23: రానున్న ఎన్నికల్లో మోదీని ప్రజలు తిరస్కరించకపోతే దేశానికి విపత్తేనని మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. పెద్ద నోట్ల రద్దువల్ల దేశ జీడీపీ పెరిగిందని ప్రధాని మోదీ బలవంతంగా చెప్పిస్తున్నారని ఆర్థిక గణాంక శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యస్వామి చెప్పడాన్ని బట్టి చూస్తుంటే దేశానికి మోదీ చాలా ప్రమాదమనే విషయం తెలుస్తోందన్నారు. 2019 ఎన్నికల్లో మోదీని నియంత్రించకపోతే 2024 నాటికి ఎన్నికల్లేకుండా చేసేస్తారన్నారు. మోదీకి దాసోహం అనకపోతే కనీస పరిపాలనే జరగనివ్వరని, రాజ్యం వీర భోజ్యం అనే ధోరణితో వ్యవహరిస్తారన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మంగళవారం విలేఖరుల సమావేశంలో ఉండవల్లి మాట్లాడారు. బీజేపీతో కలిసే ఏ పార్టీకి తాను ఓటెయ్యబోనన్నారు. ఏపీలో ఇప్పట్లో కాంగ్రెస్‌కు ఛాన్స్ లేదన్నారు. విశ్వసనీయత వేరు, ద్వేషం వేరని, కాంగ్రెస్‌పై ఏపీ ప్రజలు ద్వేషం పెంచుకున్నారని, విభజన పరిణామాల్లో బీజేపీ తప్పించుకుందన్నారు. విభజన హామీలు అమలుకావడంలేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాలుగేళ్లకు స్పందించారని ఉండవల్లి ఎద్దేవాచేశారు. అవసరమైతే సుప్రీం కోర్టుకు వెళ్తామంటోన్న చంద్రబాబు నాయుడు ముందు రాష్ట్రానికి ఎవరు అన్యాయం చేస్తున్నారో చెప్పాలన్నారు. ఎవరివల్ల అన్యాయం జరిగిందో చెప్పకుండా కోర్టుకెక్కితే అపరాథ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. సిఎం పక్కన కూర్చుని మరీ ప్రత్యేక హోదా ఎందుకని నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ అనడం చాలా దారుణమని, ప్రతిపాదనవస్తే పరిశీలిస్తామని చెప్పడాన్ని బట్టి చూస్తుంటే అసలు ఇప్పటి వరకు ప్రత్యేక హోదా గురించి ప్రతిపాదనే వెళ్ళలేదా అనే అనుమానం కలగకమాదన్నారు. వాతావరణాన్ని బట్టే ఐటి కంపెనీలు బెంగళూరు, హైదరాబాద్‌లలో అభివృద్ధి చెందాయని, అటువంటి వాతావరణాన్ని వదిలేసి ఐటి కంపెనీలు కోస్తాకు ఎందుకొస్తాయన్నారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల హెరిటేజ్ కంపెనీ హెడ్ ఆఫీస్ ఇప్పటికీ హైదరాబాద్‌లోనే ఉందని, ఆ సంస్థ తెలంగాణాకు పన్ను చెల్లిస్తోందన్నారు. టెండర్లు పిలవకుండా పోలవరం పనులు నవయుగ సంస్థకు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. 60 సి ప్రకారం ట్రాన్స్‌ట్రాయ్‌ని మార్చాల్సిందేనని సిఎం పట్టుబడితే అదే రేట్లకు పనిచేసేందుకు ఎవరు ముందుకొస్తారని గడ్కరీ ఒప్పుకోలేదని, ఇపుడు అదే రేట్లకు నవయుగకు కట్టబెట్టారంటే కేంద్ర మంత్రి గడ్కరి చెప్పిందే నిజమైందన్నారు. ప్రత్యేక హోదా ఇస్తే బీజేపీకి మద్దతిస్తామని జగన్ చెప్పడం దారుణమన్నారు. జగన్ కేంద్రంపై పోరాటం చేయకుండా కేవలం టీడీపీ మీదే పోరాటాన్ని సాగిస్తున్నారని ఉండవల్లి వ్యాఖ్యానించారు. హోదా ఇవ్వకుండా ప్యాకేజీ ఇస్తున్నామని చెప్పి, అదికూడా ఇవ్వని కేంద్రంతో జగన్ ఎలా కలుస్తారని వ్యాఖ్యానించారు. మోదీ ఎటూ ప్రత్యేక హోదా ఇవ్వరనే ఉద్దేశ్యంలో జగన్ ఉన్నారేమోనన్నారు. 2019 ఎన్నికల్లోపు ప్రత్యేక హోదా ప్రకటిస్తే బీజేపీతో జగన్‌కు రహస్య ఒప్పందం ఉందన్న చంద్రబాబు ఆరోపణ నిజం అవుతుందన్నారు. జగన్ బీజేపీతో కలిస్తే రాష్ట్రానికి మంచా..చెడా అనేది కాలమే నిర్ణయించాలన్నారు.

# పట్టపగలు మహిళతో డిఎఫ్ఓ రాసలీలలు!



కర్నూలు, జనవరి 23: హైదరాబాద్‌లో మహిళా డిఎస్పీతో ఓ సీఐ వివాహేతర సంబంధం వ్యవహారం సద్దుమణగకముందే కర్నూలులో అటవీశాఖ విజిలెన్స్ డీఎఫ్ఓ రాసలీలలు బయటపడ్డాయి. కర్నూలు జిల్లా అటవీశాఖ విజిలెన్స్ డీఎఫ్ఓ వెంకటేశ్వర్లు మంగళవారం ఉదయం తన ఇంట్లో ఓ మహిళతో రాసలీలలు సాగిస్తుండగా స్థానికులు, విద్యార్థి సంఘాల నాయకులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. డిఎఫ్ఓ వెంకటేశ్వర్లు కుటుంబం హైదరాబాద్‌లో ఉంటోంది. ఆయన ఒక్కరే కర్నూలు తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని వసంత రెసిడెన్సీలో ఉంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తన ఫ్లాట్‌లో ఓ మహిళతో రాసలీలలు సాగిస్తుండగా గమనించిన చుట్టుపక్కల ఫ్లాట్‌ల యజమానులు, విద్యార్థి సంఘాల నాయకులు ఇంటికి తాళం వేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు తాళం తీసి లోపలికి వెళ్లి చూడగా వెంకటేశ్వర్లు ఓ మహిళతో కలిసి ఉండడం కనిపించింది. స్థానికుల ఫిర్యాదు మేరకు డీఎఫ్ఓ వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

# మత్స్యకారులను షెడ్యూల్ ఫిషర్‌మెన్‌గా గుర్తించాలి: వైకాపా

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 23: మత్స్యకారులనుల ఎస్సీ,ఎస్టీల మాదిరి ఎస్ఎఫ్ (షెడ్యూల్ ఫిషర్‌మెన్)గా గుర్తించాల్సిందేనని వైసీపీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు. గత నెల రోజులుగా తమను మత్స్యకారులు ఎస్టీలుగా గుర్తించాలని చేస్తున్న ఉద్యమానికి ఆయన సంఘీభావం తెలిపారు. ఈ మేరకు మంగళవారం విశాఖలో పర్యటించిన ఆయన మత్స్యకారుల ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజిత ఆంధ్రప్రదేశ్ జనాభాలో ఏడు శాతం మత్స్యకార, ఉపకులాలు ఉన్నాయన్నారు. రాజ్యాంగంలోని 331,332 షెడ్యూళ్ల ప్రకారం ఎస్సీ,ఎస్టీలకు చట్టసభలు, విద్య, ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్లు అమలవుతున్నాయని గుర్తు చేశారు. అదే మాదిరి మత్స్యకారులను కూడా షెడ్యూల్ వర్గంగా గుర్తించి అన్ని రిజర్వేషన్లు వర్తింపచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మత్స్యకారులను ఎస్ఎఫ్‌గా గుర్తించాలని కోరుతూ పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు పెట్టేందుకు వైసీపీ చొరవ తీసుకుంటుందన్నారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఈ మేరకు ప్రైవేటు బిల్లు పెట్టేందుకు పార్టీ అధినేత జగన్‌మోహన రెడ్డి అంగీకరించారన్నారు. మత్స్యకారులకు రిజర్వేషన్లు అమలైతే అసెంబ్లీలో 15 మందికి, పార్లమెంట్‌లో ఇద్దరికి రాష్ట్రం నుంచి అవకాశం లభిస్తుందన్నారు. దీనికి రాజ్యాంగ సవరణ అవసరమని, అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే మత్స్యకారులను ఎస్ఎఫ్‌లుగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జగన్ అధికారంలోకి వస్తేనే మత్స్యకారుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. చంద్రబాబును కలిసిన మత్స్యకార నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇది ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. వైసీపీ సీనియర్ నాయకులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ధర్మాన ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి

1వ పేజీ తరువాయి

## రక్షిత ధోరణి వద్దు

తీసుకురారు' అని పేర్కొన్నారు. వసుదైక కుటుంబమే మొదటినుంచీ భారత్ ఆశయమని ఉద్ఘాటించిన మోదీ, ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునే విషయంలో ఏకాభిప్రాయం కొరవడిందన్నారు. అయితే ఉమ్మడి ప్రమాదం ముంచుకొచ్చినపుడు విభేదాలను పక్కనపెట్టి వాటిని ఎదుర్కొనేందుకు ఏ కుటుంబంలోనైనా ప్రతి ఒక్కరూ ముందుకొస్తారని, అదే తరహాలో ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను అధిగమించేందుకు అన్ని దేశాలూ విభేదాలను విస్మరించి ముందుకు రావాలన్నారు. అన్ని విధాలుగా అనుసంధానమైన ప్రస్తుత ప్రపంచంలో ప్రపంచీకరణ వేగం తగ్గుతోందని, దాని తేజమూ అడుగంటుతోందని అన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తరువాత ఏర్పడిన అంతర్జాతీయ సంస్థలు ప్రస్తుత తరం ఆశలు, ఆకాంక్షలకు అద్దం పడుతున్నాయా? అని ప్రశ్నించారు. ముఖ్యంగా వర్ధమాన దేశాలకు సంబంధించి ఎన్నో రకాలుగా వ్యత్యాసాలు ఉన్నాయని పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, ఆర్థిక వృద్ధి ప్రమాణాలు కూడా అనేక రకాలైన వైరుధ్యాలను సృష్టిస్తున్నాయన్నారు. శాంతియుత పరిస్థితులను సంక్లిష్టంగా మార్చే అడ్డుగోడలు అనేక మార్పుల వల్ల ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ కూడా ప్రపంచ దేశాలు అనుసంధానం కావాలని మాట్లాడతారని, కానీ ధనిక, వర్ధమాన దేశాల మధ్య పెరుగుతున్న అగాధం వల్ల ప్రపంచీకరణ ఉద్దేశిత ప్రయోజనాలే దెబ్బతింటున్నాయన్నారు. రక్షితవాదం మళ్లీ వెర్రితలలు వేస్తోందని, దీని కారణంగా కొత్తగా టారిఫ్‌లు, నాన్ టారిఫ్ అడ్డుగోడలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రపంచీకరణ వ్యతిరేకతను చాటుకోవడానికి విభేదాలను సృష్టించటం పరిష్కారం కాదన్నారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ చేసిన వ్యాఖ్యలనూ ఉటంకించారు. 'నేను నా ఇంటి తలుపులు, కిటికీలు మూసేసుకోవాలని అనుకోను. అన్ని దేశాల సాంస్కృతిక పవనాలు ఇంట్లోకి రావాలనే కోరుకుంటాను. అయితే వాటివల్ల నా సొంత సంస్కృతే దెబ్బతినడాన్ని అంగీకరించను' అన్న మహాత్ముడి మాటలను ప్రస్తుత ప్రపంచ స్థితిగతులకు అద్దంపడుతూ ఉటంకించారు. అలాగే భారత్‌లో వచ్చిన మార్పుల గురించి, పెట్టుబడులకు వచ్చిన అవకాశాల గురించి మోదీ ఈ సందర్భంగా వివరించారు. సంస్కరణలు, పనితీరు పరివర్తన అన్న మూడు సూత్రాల ప్రాతిపదికన తన ప్రభుత్వం పని చేస్తోందన్నారు. భారత్‌లో పెట్టుబడులకు అన్ని విధానాలను సరళతరం చేశామన్నారు. ఇన్వెస్టర్లు భారత్‌కు వచ్చి పెట్టుబడులు పెట్టి సంస్థలను స్థాపించేందుకు సానుకూల వ్యవస్థలను పాదుగొల్పామన్నారు. భారత్‌నుంచే ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి వీలుకల్పిస్తున్నామన్నారు. భారత కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రంగాల్లోనూ విస్తృత సంస్కరణలు తెచ్చాయని, లైసెన్సులు, పర్మిట్ వ్యవస్థలను తొలగించామన్నారు. రెడ్ టేప్ స్థానే రెడ్ కార్పెట్ వేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. అలాగే 1400లకు పైగా కాలం చెల్లిన చట్టాలను తొలగించామని, వస్తు సేవల పన్ను ద్వారా సరికొత్త వ్యవస్థను పాదుగొల్పామన్నారు. జన్‌ధన్ యోజన, బాలికా విద్య, నేరుగా లబ్దిదారులకు నిధుల బదిలీవంటి తమ ప్రభుత్వ విధానాలను మోదీ వివరించారు. శాంతి సంక్షేమం సంపద కోరుకునే వారు భారత్‌కు వచ్చి పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఉగ్రవాదం, వాతావరణ మార్పుల వల్ల నాగరికతకే పెనుముప్పు వాటిల్లుతోందన్నారు. హిమానీ నదాలు కరిగిపోతున్నాయని, దీవులు కుంగిపోతున్నాయని, ప్రతికూల వాతావరణ పరిస్థితులు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని అన్నారు. భారత్ ఏ దేశ ప్రకృతి వనరులకు హాని కలిగించదని ఉద్ఘాటించిన మోదీ, ప్రస్తుత సవాళ్లను ఎదుర్కొనే విషయంలో ఉమ్మడిగా ఎలా ముందుకు వెళ్లగలుగుతామన్న అంశంపై అన్ని దేశాలూ కలిసికట్టుగా ఆలోచించి ముందుకు సాగాలని మోదీ పిలుపునిచ్చారు.

## దేశంలో అతిపెద్ద సంస్కరణ జీఎస్‌టీ

వారు కనుక వీరికి ఉపాధి కల్పించాల్సి ఉందని, అయితే వీరికి మెరుగైన జీవనం అందించే నైపుణ్యాలను అందించాల్సి ఉందని అన్నారు.

దేశంలో ప్రతి పౌరుడు, పన్ను చెల్లించడం తమ పవిత్ర బాధ్యతను గుర్తెరగాలని నాయుడు పేర్కొన్నారు. పన్నుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరి, మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలను చేపట్టే వీలుందని అన్నారు. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు ప్రధాన ఉద్దేశయం పన్ను చెల్లింపులు పెంచడమేనని అన్నారు. ఆర్థిక రంగం పెరుగుతున్న కొద్దీ పన్ను చెల్లింపులు పెరిగి, అభివృద్ధికి రోడ్లు పాఠశాలలు, ఆస్పత్రులూ ఇతర మౌలిక సదుపాయాల కల్పన చేయడానికి ఆస్కారం ఉంటుందని వెంకయ్యనాయుడు అన్నారు. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి 2018లో భారత వృద్ధిరేటు 7.3 శాతంగా ఉంటుందని అంచనా వేశాయని, రానున్న 10-15 సంవత్సరాల వ్యవధిలో ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక శక్తిగా భారత్ అవతరిస్తుందన్నారు. బ్యాంకుల వద్దకు చేరిన 2.11 లక్షల కోట్ల వల్ల రుణ లభ్యత పెరిగి, ప్రైవేటు రంగంలో పెట్టుబడులు పెరుగుతాయని అన్నారు. ఆర్థిక రంగంలో అభివృద్ధి, సంస్కరణల వల్ల 50-100 మిలియన్ల జనాభా కొనుగోలు శక్తి గణనీయంగా పెరిగిందని, మరో 500-600 మిలియన్ల జనాభా , పేదరికం నుండి బయటపడి, ఆర్థికంగా ఎదుగుతున్నారని ఆయన అన్నారు. ద్విచక్రవాహనాలు ఉపయోగించిన వారు కార్లు కొంటున్నారని, సైకిళ్ల వాడిన వారు మోటార్ సైకిళ్లు కొంటున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ఎఫ్‌డిఐతో దేశానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. నూతన పన్ను సంస్కరణలూ, పెరుగుతున్న నిత్యావసరాల ధరలూ, ప్రపంచ ఆర్థిక రంగంలో నెలకొన్న అనిశ్చితి పరిస్థితులూ, భారత్ ఆర్థిక రంగంపై ప్రభావం చూపుతున్నాయని, ఈ సవాళ్లు ఎదుర్కొనేలా కళాశాలలు పాఠ్యాంశాలను రూపొందించి, సమకాలీన అవసరాలకు తగిన విధంగా విద్యార్థులు స్పందించేందుకు వారిని సంసిద్ధులను చేయాలని వెంకయ్యనాయుడు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్శిటీ విసి ప్రొఫెసర్ రామచంద్రం, యుజిసి సభ్యుడు ప్రొఫెసర్ గోపాలరెడ్డి, కేశవ మెమోరియల్ విద్యాసంస్థల అధ్యక్షుడు జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణకు బ్రేకులే..

పేర్కొంది. గత నెల 26న హైకోర్టు రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు నష్టపరిహారం చెల్లింపులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అందించాలని కోరింది. కాగా కేసు విచారణను హైకోర్టు మంగళవారం చేపట్టింది. తాము వివరాలు అందించేందుకు మరింత గడువు కావాలని హైకోర్టును ఏపీ ప్రభుత్వం తరపున న్యాయవాది కోరారు. గడువు కావాలని దరఖాస్తును కూడా ఇవ్వకపోవడం సరైన చర్య కాదని హైకోర్టు మందలించింది. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన నివేదికను చూసిన తర్వాత హైకోర్టు ఈ నివేదిక నామమాత్రంగా ఉందని పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం ఇంతవరకు రూ.500 కోట్లను మాత్రమే ఇచ్చిందని, కాని బకాయిలు పెద్దఎత్తున ఉండగా భూసేకరణ ప్రక్రియపై ఎలా ముందుకెళతారని కోర్టు ప్రశ్నించింది. రైతులు ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం చాలనప్పుడు కోర్టులను ఆశ్రయించే హక్కు కలిగి ఉంటారన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల భూసేకరణ నష్టపరిహారం కేసులను విచారించే కోర్టులపై కేసుల భారం పెరిగిందన్నారు. భూసేకరణకు సంబంధించి కోర్టులు ఇచ్చే ఆదేశాలను అమలు చేయాలని ఆదేశిస్తూ కేసు విచారణను హైకోర్టు మూడు వారాల పాటు వాయిదా వేసింది.

## కృష్ణపట్నంలో రిఫైనరీ

అండ్ టెక్నాలజీను స్థాపించనున్నామని, ఇందువల్ల నైపుణ్యం కలిగిన మానవ వనరులు లభిస్తాయని చంద్రబాబు వివరించారు. ఇది రాష్ట్రంలో సమీప భవిష్యత్‌లో పెట్రోలియం పరిశ్రమల ఏర్పాటుకు మరింత అనువైన వాతావరణం ఏర్పడేందుకు దారితీస్తుందని చెప్పారు. గతంలో సీఎం చంద్రబాబు భేటీ అయిన కంపెనీల్లో సౌదీ అర్మ్‌కో ఒక ప్రధాన కంపెనీ. కృష్ణపట్నంలో రిఫైనరీ ఏర్పాటుకు ఇప్పటికే ఆసక్తి చూపుతోంది. ఆ కంపెనీ ప్రతినిధులు రాష్ట్రాన్ని రెండు పర్యాయాలు సందర్శించారు. వారితో నిరంతర చర్చలు సాగిస్తున్న సీఎం చంద్రబాబు, రాష్ట్రానికి సౌదీ అర్మ్‌కో రిఫైనరీ తేవాలన్న పట్టుదలతో ఉన్నారు. ఈక్రమంలో ముంబయిలో ఈ నెలాఖరులో సౌదీ అర్మ్‌కో ప్రతినిధులను ఆంధ్ర ప్రభుత్వ ప్రతినిధులు మరోసారి కలవనున్నారు.

కాగా సౌదీ అర్మ్‌కో కంపెనీ మహారాష్ట్రలో 40 బిలియన్ల అమెరికన్ డాలర్ల పెట్టుబడితో ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ కంపెనీలతో సంయుక్త భాగస్వామ్యంలో మెగా రిఫైనరీ ఏర్పాటు చేయాలని భావిస్తున్న సౌదీ అర్మ్ సంస్థ రిఫైనరీ ఏర్పాటుకు అన్ని అవకాశాలు, సామర్థ్యం ఉన్న కీలక ప్రదేశంగా మన రాష్ట్రంలోని కృష్ణపట్నాన్ని గుర్తించింది. గత ఏడాది అక్టోబర్‌లో ఈ కంపెనీ భారత్ రాజధాని ఢిల్లీలో అర్మ్‌కో ఏషియా-ఇండియా శాఖ కార్యాలయాన్ని ప్రారంభించింది. భారత పశ్చిమ తీరంలో భారీ చమురు శుద్ధి కర్మాగారం ఏర్పాటుకు నిశ్చయించింది. భారత్ మార్కెట్‌లో మరింత వాటా దక్కించుకోవటానికి ఈ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

ఆంధ్రలో 640 చదరపు కిలోమీటర్లమేర చమురు, రసాయనాలు, పెట్రో కెమికల్స్ ఇన్వెస్టిమెట్ రీజియన్‌లో ఉందని, అలాగే 6 సెజ్‌లు ఉన్న విషయాలను అధ్యయనం చేసిన సంస్థ రాష్ట్రంలోని కృష్ణపట్నాన్ని తన పెట్టుబడులకు ప్రాధాన్యత కేంద్రంగా ఎంచుకుంది. ఈ దిశగా వారిని ఒప్పించి మన రాష్ట్రానికి భారీ రిఫైనరీ తీసుకురావాలన్న లక్ష్యంతో సీఎం బాబు ఈ సంస్థ ప్రతినిధులతో గతంలో సమావేశమయ్యారు.

### చంద్రబాబుకు అభినందనలు

ఫిబ్రవరిలో విశాఖలో నిర్వహించనున్న సీఐఐ పెట్టుబడుదారుల సదస్సుకు హాజరుకావాలని ఆయన సౌదీ అర్మ్‌కో ప్రెసిడెంట్ సైద్ అల్ హద్రమీని ఆహ్వానించారు. తమ రాష్ట్రంలో ప్రాజెక్టుల ఏర్పాటుకు శరవేగంగా చర్యలు తీసుకుంటున్నామని, వ్యాపార సానుకూల వాతావరణం ద్వారా పారిశ్రామికాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ స్థిరంగా ముందుకు దూసుకువెళుతోందని వివరించారు. సౌదీ అర్మ్‌కో ప్రెసిడెంట్ సైద్ అల్ హద్రమీ స్పందిస్తూ 'భారత్‌కు ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పారిశ్రామికవేత్తలను ఆకర్షించేందుకు మీరు చూపిస్తున్న వ్యక్తిగత శ్రద్ధను అభినందిస్తున్నానని' చెప్పారు. కాగా సౌదీ అర్మ్‌కో ప్రధానంగా చమురు అన్వేషణ రంగంలో అపార అనుభవం గడించిన సంస్థ. భూమిలో చమురు, సహజవాయు నిక్షేపాలు అన్వేషణ, ఉత్పత్తి, ఎల్‌పీజీ ఉత్పత్తి, చమురు శుద్ధి, చమురు పంపిణీ, క్రూడ్ ఆయిల్ మార్కెటింగ్‌లో ఎంతో ప్రసిద్ధి చెందింది. ముఖ్యమంత్రి బృందంలో రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, ఐటీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈఓ జాస్తి కృష్ణకిశోర్, పరిశ్రమలశాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్, వ్యవసాయ సలహాదారు టి.విజయకుమార్ ఉన్నారు.

# సీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలి

★ న్యాయవాదుల ఉద్యమం ఉధృతం

★ 27న కడపలో సమావేశం..జేఏసీ ఏర్పాటు

ఆంధ్రభూమి బ్యూరో

అనంతపురం, జనవరి 23: విభజన నేపథ్యంలో రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఊపందుకుంది. హైకోర్టు సాధన కోసం సీమ జిల్లాల్లో న్యాయవాదులు ఉద్యమిస్తున్నారు. తమ ఆందోళనలను ఉధృతం చేయడంలో భాగంగా మంగళవారం నుంచి ఈనెల 25 వరకు మూడు రోజుల పాటు కోర్టు విధుల్ని బహిష్కరించి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో విధుల బహిష్కరణ, ర్యాలీలు జరుగుతున్నాయి. చిత్తూరు జిల్లా మదనపల్లి బార్ అసోసియేషన్ ఉద్యమానికి మద్దతు ఇచ్చింది. అనంతపురంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి ర్యాలీ నిర్వహించారు. ఈనెల 27న కడపలో సీమ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు సమావేశం కానున్నారు. సీమ ప్రజల ఆకాంక్ష అయిన హైకోర్టు ఆశయ సాధనకు జాయింట్ యాక్షన్ కమిటీనీ ఏర్పాటు చేయనున్నట్లు అనంతపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భరత్‌భూషణ్‌రెడ్డి తెలిపారు.

# ఎమ్మెల్యే కలమటకు వారంట్

## ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దగ్ధం నేపథ్యం

ఆంధ్రభూమి బ్యూరో

శ్రీకాకుళం, జనవరి 23: జిల్లాలోని పాతపట్నం ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు కొత్తూరు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ మంగళవారం నాన్-బెయిలబుల్ వారెంట్ (ఎన్బీడబ్ల్యూ)ని జారీ చేసారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దిష్టిబొమ్మను తగలబెట్టినందుకు నమోదైన కేసులో కోర్టుకు హాజరుకాని ఎమ్మెల్యే కలమటకు ఈ నాన్-బెయిల్‌బుల్ వారెంట్ జారీ అయ్యింది. 2015, జూన్ 9న అలికాం - బత్తిలి సమీపంలోని హిరమండలం ప్రధాన రహదారిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేసి కలమట వెంకటరమణ నిరసన వ్యక్తం చేసారు. ఈ సంఘటనపై అప్పటి హిరమండలం ఎస్సై వి.శ్రీనివాస్ ఎమ్మెల్యే వెంకటరమణ, మరో 13 మందిపై ఐపీసీ సెక్షన్ 341, 143, 283, 285 కింద కేసులు నమోదు చేసారు. ఆ కేసుకు సంబంధించి సోమవారం కలమట వెంకటరమణ కొత్తూరు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుకావల్సివుండగా, రాకపోవడంతో ఆయనపై ఎన్బీడబ్ల్యూను న్యాయమూర్తి బి.కిరణ్‌కుమార్ జారీ చేసారు. ఎమ్మెల్యే కలమటతోపాటు సలాన మోహనరావు(మెళియాపుట్టి), పాలక రవి (కొత్తూరు), శివ్వాల కిషోర్‌బాబు (ఎల్ఎన్‌పేట) సోమవారం కోర్టుకు గైర్హాజరు కావడంతో వీరిపై కూడా ఎన్బీడబ్ల్యూ జారీ అయింది.

# క్రీడ

## సెమీస్‌లోకి అన్‌సీడెడ్ క్రీడాకారిణి

### ఆస్ట్రేలియా ఓపెన్ టెన్నిస్

మెల్బోర్న్, జనవరి 23: ఆస్ట్రేలియా ఓపెన్ టెన్నిస్ టోర్నీలో అన్‌సీడెడ్‌గా దిగిన మెర్టెన్స్ రూట్స్ మంగళవారం జరిగిన పోటీలో ప్రపంచ నాలుగో నంబర్ క్రీడాకారిణి ఎలినా సిటొలినాను ఓడించి ఏకంగా సెమీస్‌లోకి దూసుకెళ్లింది. బెల్జియంకు చెందిన 22 ఏళ్ల మెర్టెన్ ఇప్పటివరకు ప్రపంచ 37వ ర్యాంకర్‌గా ఉంది. ఒక గంట 13 నిమిషాలపాటు జరిగిన పోటీలో ఉక్రెయిన్‌కు చెందిన ఎలినాను ఆమె 6-4, 6-0 తేడాతో మట్టికరిపించింది. 2012 తర్వాత ఒక బెల్జియం క్రీడాకారిణి ఆస్ట్రేలియా ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సెమీస్‌లోకి దూసుకెళ్లడం ఇది రెండోసారి. ఈ ఘనతను మెర్టెన్ దక్కించుకుంది. సెమీస్‌లోకి వెళ్లడాన్ని మాటల్లో వర్ణించలేనని, చెప్పడానికి మాటలు కూడా రావడం లేదని, ఇన్నాళ్లూ చేసిన కృషికి తగిన ఫలితం దక్కిందని భావిస్తున్నానని పేర్కొంది. 2016 వరకు 127వ ర్యాంకర్‌గా ఉన్న మెర్టెన్స్‌ను ఆమె బోయ్ ఫ్రెండ్, కోచ్ అయిన రోబీ సెస్సన్స్ ఉత్తమ క్రీడాకారిణిగా తీర్చిదిద్దాడు. తాను ఆస్ట్రేలియా ఓపెన్‌లో సెమీస్‌లోకి దూసుకెళ్లడానికి కోచ్ రోబీ కృషి ఎంతో ఉందని, ఈ ఘనత అంతా అతనికే దక్కుతుందని ఆమె పేర్కొంది.



# మూడో టెస్టు మ్యాచ్ పరువు నిలిపేనా?

## నేడు వాండరర్స్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ అమీతుమీ



జోహాన్సెస్‌బర్గ్, జనవరి 23: దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు టెస్టు మ్యాచ్‌లలో ఘోర పరాజయం పాలైన భారత్ క్రికెట్ జట్టు బుధవారం వాండరర్స్‌లో జరిగే మూడో మ్యాచ్‌లోనైనా మన దేశ పరువు నిలబెడుతుందా? లేదా? అన్న సందేహాలు అభిమానుల్లో వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే జరిగిన రెండు మ్యాచ్‌లలోనూ అన్ని విభాగాల్లోనూ పటిష్ఠంగా ఉన్న దక్షిణాఫ్రికా జట్టు కెప్టెన్ ఫఫ్ డుప్లెసిస్ సారథ్యంలో మూడో టెస్టులోనూ భారత్‌పై పైచేయి సాధించేందుకు తద్వారా టెస్టు సిరీస్‌ను కైవసం చేసుకునేందుకు ఉరకలేసిన ఉత్సాహంతో ముందుకు సాగుతోంది. రెండు టెస్టుల్లోనూ పేలవమైన ఆటతీరుతో భంగపడిన భారత్ మూడో టెస్టులోనైనా ప్రత్యర్థికి గట్టి పోటీనిచ్చి విమర్శకుల నోటికి తాళం వేయడానికి కెప్టెన్ సారధ్యంలోని జట్టు అస్త్రశస్త్రాలు సంధిస్తోంది. కేప్‌టౌన్‌లో జరిగిన తొలి టెస్ట్‌మ్యాచ్‌లో 72 పరుగులు, సెంచూరియన్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో 135 పరుగుల ఆధిక్యంతో వచ్చిన విజయగర్వంతో మూడో టెస్టులోనూ భారత్‌ను మట్టికరిపించేందుకు దక్షిణాఫ్రికా సన్నాహాలు చేస్తోంది. విరాట్ కోహ్లీ నాయకత్వంలో జరిగిన పలు టెస్టుమ్యాచ్‌లలో వరుసగా రెండింటిలోనూ భారత్ ఓటమిపాలు కావడం ఇదే తొలిసారి. అయితే, 2015 వరకు ప్రపంచ వ్యాప్తంగా జరిగిన టెస్టు సిరీస్‌లలో భారత్ తొమ్మిదిసార్లు గెలుపు బావుటాను ఎగురవేసి ఇప్పటివరకు సాధించిన తొలి ర్యాంక్‌కు ఎలాంటి ఢోకా లేకపోయింది. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు టెస్టు మ్యాచ్‌లలో జట్టు ఎంపికలో ఎన్నో విమర్శలను ఎదుర్కొంటున్న కెప్టెన్ కోహ్లీ తనదైన రీతిలో స్పందించినప్పటికీ మ్యాచ్‌లలో ఫలితాలు వెక్కిరించడంతో ఓటమికి బ్యాట్స్‌మెన్‌లదే బాధ్యత అంటూ వ్యాఖ్యానించడం గమనార్హం. గడిచిన రెండు టెస్టులకు పేసర్ భువనేశ్వర్ కుమార్‌తోపాటు జస్‌ప్రీత్ బుమ్రా ఎంపిక పలు విమర్శలకు దారితీసినా బుధవారం జరిగే ఫైనల్ మ్యాచ్‌పైనే అభిమానుల ఆశలు ఉన్నాయి. ఇప్పటికే మూడో టెస్టు కోసం సిద్ధంగా ఉన్న భారత్ జట్టులోని ఐదుగురు పేసర్లలో భువనేశ్వర్ కుమార్, ఇషాంత్ శర్మ, ఉమేష్ యాదవ్, మహ్మద్ షమీ తదితరులంతా సోమవారం నుండి నెట్ ప్రాక్టీస్ చేస్తున్నారు. ఇపుడున్న జట్టులోని పేసర్లలో కనీసం ఒకరినైనా మార్చే దిశగా కోహ్లీ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. జట్టులో ఐదారుగురు పేసర్లు, మరో ఆరుగురు బ్యాట్స్‌మెన్‌లతో భారత్ జట్టు తుది పోరుకు సిద్ధమవుతోంది. కెప్టెన్‌గా ఆరు నెలల కిందట జరిగిన టెస్టు మ్యాచ్‌లలో 3-0 తేడాతో శ్రీలంక జట్టును మట్టి కరిపించిన కోహ్లీ దక్షిణాఫ్రికా టూర్‌లోనూ అదే సంచలనం నమోదు చేస్తాడనుకున్న అభిమానుల ఆశలను పటాపంచలు చేస్తూ ఇప్పటికే 2-0 స్కోరుతో భారత్ వెనుకబడి ఉంది. ఇప్పటి వరకు ఏ భారత్ జట్టు కూడా దక్షిణాఫ్రికాలో ఆ దేశ జట్టును వైట్‌వాష్ చేయలేకపోయింది. 1992 నుండి భారత్ ఆరుసార్లు దక్షిణాఫ్రికాలో పర్యటించింది. 1996-97లో సచిన్ తెండూల్కర్ నాయకత్వంలో ఆడిన మూడు టెస్టు సిరీస్‌లలో 2-0 తేడాతో భారత్ అపజయాన్ని మూటకట్టుకుంది.

బుధవారం జరిగే తుది పోరులో దక్షిణాఫ్రికా జట్టులో మేజర్ మార్పులు చేయడం ద్వారా వచ్చే తలనొప్పులను భరించలేనందున చిన్నపాటి మార్పులు, చేర్పులతోనే సిద్ధమైంది. ఈ జట్టులో రెండో టెస్టులో తొడ సంబంధ నొప్పితో బాధపడుతున్న ఓపెనర్ ఎయిడెన్ మార్కంను మూడో టెస్టులోకి తీసుకునే అవకాశాలున్నాయి. దక్షిణాఫ్రి బ్యాట్స్‌మన్ టెంబా బౌమా చేతి వేలి గాయం కారణంగా ప్రస్తుతం ఆడే అవకాశం లేకపోయినా క్రిస్ మోరిస్, ట్యూనిస్ డి బ్రూన్ ఆ స్థానాన్ని భర్తీ చేయొచ్చు. ఇదిలావుండగా, మూడో టెస్టులో భారత్‌ను 3-0 తేడాతో వైట్‌వాష్ చేయడంతోపాటు త్వరలో ఆస్ట్రేలియా జరిగే టెస్టుమ్యాచ్‌లలో 2-0 తేడాతో విజయం సాధించి ప్రపంచంలోనే తొలి ర్యాంక్‌ను సాధిస్తామనే ధీమాను కెప్టెన్ ఫఫ్ డుప్లెసిస్ వ్యక్తం చేస్తున్నాడు. భారత్‌తో జరిగే మూడో టెస్టుమ్యాచ్‌ల అనంతరం ఆస్ట్రేలియాతో జరిగే నాలుగు టెస్టు సిరీస్‌లలో ఆడబోయే జట్టులో మార్పులు చేసే అవకాశం ఉంది.



## ఎందుకలా జరిగింది?

### భారత్ వైఫల్యంపై బీసీసీఐ దృష్టి

న్యూఢిల్లీ, జనవరి 23: దక్షిణాఫ్రికా టూర్‌లో భారత్ ఘోర వైఫల్యంపై విశ్లేషణ, సమీక్షకు రంగం సిద్ధమైంది. భారత్ ఇంత ఘోరంగా పరాజయం పాలుకావడానికి కారణం ఏమిటన్న దానిపై బీసీసీఐ నిర్వహించే అడ్మినిస్ట్రేటర్ల కమిటీ దృష్టి సారించబోతోంది. కేప్‌టౌన్, సెంటూరియన్‌లో జరిగిన మ్యాచ్‌ల్లో ఘోరంగా ఓడిన భారత్, సరీస్‌ను కోల్పోయిన విషయం తెలిసిందే. రేపటినుంచి మూడో టెస్ట్ మ్యాచ్ జరుగుతున్న దృష్ట్యా భారత ఆటగాళ్ల ఇంత పేలవమైన ఆటతీరును ఎందుకు కనబర్చారన్న దాన్ని విశ్లేషించాల్సిన అవసరం ఉందని నిర్వాహకుల కమిటీ అధినేత వినోద్ రాయ్ పేర్కొన్నారు. రేపు భారత్ మ్యాచ్ గెలిచినా, ఓడినా ఎలాంటి తేడా ఉండదు. అయితే అందరి నుంచి పూర్తిస్థాయి లభించినా, టీం మేనేజర్ కూడా పూర్తి ప్రోత్సాహాన్ని అందించినా భారత ఆటగాళ్లు ఎందుకు సరిగా ఆడలేకపోయారన్నది పరిశీలించాల్సిన విషయమన్నారు. అయితే, ఇప్పటికిప్పుడు ఆ వైఫల్యంపై దృష్టిపెట్టే అవకాశం లేదని, కారణం ఇటు అధికారులు, అటు ఆటగాళ్లు దక్షిణాఫ్రియాలోనే ఉన్నారని తెలిపారు. నేడు జరిగిన సమావేశంలో వినోద్‌రాయ్‌తో పాటు సభ్యులు డయానో ఎడూజీ, బీసీసీఐ సిఈవో రాహుల్ జోహ్రీలు పాల్గొన్నారు. బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సికె ఖన్నా, తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరి సహా కార్యవర్గ సభ్యులు ఎవరినీ ఈ సమావేశానికి పిలవలేదు. అయితే, ఆ మ్యాచ్‌లో భారత్ ఓడిపోవడానికి ప్రధాన కారణాలంటూ అనేక అంశాలు ఇప్పటికే వెలుగు చూశాయి. అయితే మాజీ ఆటగాళ్లు మాత్రం ఎలాంటి సన్నద్ధత లేకుండా భారత్ ఆ మ్యాచ్ ఆడిందని, అదికూడా పరాజయానికి కారణమై ఉండొచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా సౌతాఫ్రికా టూర్‌కు ముందు శ్రీలంకతో ఆడటం అన్నది అంత సరైన ఆలోచన కాదని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికా టూర్‌కు ముందు పది రోజులపాటు భారత ఆటగాళ్లకు సంసిద్ధమయ్యే అవకాశం ఇచ్చివుంటే ఫలితం మరోలా ఉండేదని భారత కోచ్ రవిశాస్త్రి ఇప్పటికే స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

## కొంతకాలమే పగ్గాలు?

### కోహ్లీకి కెప్టెన్సీపై స్మిత్ అనుమానం

జోహాన్నెస్‌బర్గ్, జనవరి 23: భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ ఎక్కువ కాలం కెప్టెన్‌గా కొనసాగే అవకాశాలు కనిపించడం లేదని దక్షిణాఫ్రికా జట్టు మాజీ కెప్టెన్ గ్రేమీ స్మిత్ అభిప్రాయపడ్డాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఇప్పటివరకు జరిగిన రెండు టెస్టుమ్యాచ్‌లలో భారత్ ఓటమి చెంది, ఈనెల 24న మూడో మ్యాచ్‌కు తయారవుతున్న వేళ స్మిత్ ఈ వ్యాఖ్యలు చేశాడు. కెప్టెన్‌గా కోహ్లీ తీసుకున్న నిర్ణయాలు ఆ జట్టును ఏదశలోనూ ఆదుకోలేకపోయాయని ఇప్పటికే తమతో జరిగిన రెండు మ్యాచ్‌ల ఫలితమే నిదర్శనమని అన్నాడు. సరైన జట్టు ఎంపికతో సమర్థవంతంగా ముందుకు నడిపించడంలో కోహ్లీ సరిగా వ్యవహరించలేకపోవడం వల్లే భవిష్యత్‌లో ఎక్కువ కాలం కెప్టెన్‌గా కొనసాగలేడేమోనన్న అనుమానం తనకు ఉందని అన్నాడు. ఇప్పటివరకు జరిగిన రెండు టెస్టుమ్యాచ్‌లలో జట్టు కూర్పులో కోహ్లీ నిష్పక్షపాతంగా వ్యవహరించలేకపోవడం వల్లనే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని పలువురు క్రీడా మేధావులు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో స్మిత్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. కోహ్లీపై వస్తున్న విమర్శల జడివానను తట్టుకునేందుకు, అతనిని సరైన మార్గదర్శకత్వంలో నడిపించేందుకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు వచ్చేవారిని ఆహ్వానించాలని ఆయన సూచించాడు. మైదానంలో కోహ్లీ వైఖరి, హావభావాలు ఆ జట్టు సభ్యులపై పడే అవకాశం ఉందని అన్నాడు. కోహ్లీ అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడైనా, తన ఆటతీరుతో ఎందరో విమర్శకుల ప్రశంసలు పొందినా అవి అతని వ్యక్తిగతమని, కానీ జట్టును సమర్థవంతంగా ముందుకు నడపడంలో ఇతరుల ప్రభావం ఉంటుందని మరువరాదని అన్నాడు. నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకుని అందర్నీ కలుపుకునిపోయే తత్వం ఉంటే అన్ని విభాగాల్లోనూ రాణించగలమన్నాడు. 117 టెస్టు మ్యాచ్‌లు, 197 వండే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు ఆడిన స్మిత్ తన జట్టును విజయవంతంగా నడపడంలో పరిణితి చెందిన క్రీడాకారునిగా వినుతికెక్కాడు.

### ఆస్ట్రేలియా ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో

## బొపన్న-బబోస్ జోడీ

మెల్బోర్న్, జనవరి 23: ఆస్ట్రేలియా ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్ ఆటగాడు బొపన్న, హంగేరీ ఆటగాడు థిమియా బబోస్‌తో కలసి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. మంగళవారం ఇక్కడ జరిగిన టోర్నీలో ఐదో సీడ్ జంట అయిన బొపన్న, థిమియా జోడీ అమెరికాకు చెందిన జోడి వానియా కింగ్, క్రొయేషియాకు చెందిన ఫ్రాంకో కుగోర్‌పై 6-4, 6-4 తేడాతో విజయం సాధించారు. ఈ ఇండో-హంగేరి జోడి అంతకుముందు జరిగిన రౌండ్‌లో ఆస్ట్రేలియా అన్‌సీడెడ్ జోడీ విట్టింగ్టన్, పెరెజ్‌ను 6-2, 6-4 తేడాతో ఓడించారు. ఈ విజయంతో బొపన్న, థిమియా జోడీ బుధవారం జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో అన్‌సీడెడ్ కొలంబియా ఆటగాడు జువాన్ సెబాస్టియన్, అమెరికా ఆటగాడు అభిగెయిల్ స్పియర్ జోడీతో తలపడతారు. ఇదిలావుండగా సోమవారం జరిగిన పురుషుల డబుల్స్‌లో భారత్ ఆటగాళ్లు లియాండర్ పేస్, పురవ్ రాజా, దివిజ్ శరణ్ పరాజయం పాలైన సంగతి తెలిసిందే.

## నా ఆలోచనలను పిల్లలపై రుద్దను

### టెన్నిస్ స్టార్ ఆటగాడు రోజర్ ఫెదరర్

మెల్బోర్న్, జనవరి 23: తన పిల్లలకు కూడా ఆటలంటే చాలా ఇష్టమని, అలాగని వారిని కూడా తనలాగే టెన్నిస్‌పైనే దృష్టి సారించాలని కోరుకోవడం లేదని టెన్నిస్ స్టార్ ఆటగాడు రోజర్ ఫెదరర్ అన్నాడు. తన ఆట తీరును భార్య మిర్కాతోపాటు పిల్లలు అదే పనిగా చూడరని అన్నాడు. గత కొన్నేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పలు టోర్నీల్లో పాల్గొనేందుకు వెళ్తున్నపుడు సైతం తన ప్రదర్శనను చూడమని వారిపై ఒత్తిడి తీసుకురానని పేర్కొన్నాడు. అయితే, తన పిల్లలు ఏ రంగాన్ని ఎంచుకుంటే దానిలోనే ఉత్తములుగా ఉండాలని తాను ఒక తండ్రిగా అభిలషిస్తానని అన్నాడు. ఒక తండ్రిగా పిల్లల ఎదుగుదలను ప్రోత్సహిస్తానని, కానీ వారు ఏ దారిలో వెళ్తున్నారో అన్న విషయాన్ని తానేమీ చెప్పలేనని స్పష్టం చేశాడు. అయితే, వారు క్రీడారంగం ఎంచుకున్నా, లేదా వ్యాపార రంగం ఎంచుకున్నా, ఆర్థిక రంగం ఎంచుకున్నా తాను అభ్యంతరం పెట్టబోనని, వారు ఎంచుకున్న మార్గం సరైనదైతే చాలని కోరుకుంటానని, దానినే ప్రోత్సహిస్తానని అన్నాడు.

## స్మిత్‌కు విశ్రాంతి

### వార్నర్‌కు పగ్గాలు

మెల్బోర్న్, జనవరి 23: వచ్చేనెల దక్షిణాఫ్రికాలో జరిగే టి-20 ఇంటర్నేషనల్ ట్రై సిరీస్‌లో పాల్గొనే ఆస్ట్రేలియా జట్టు కెప్టెన్ స్టీవ్ స్మిత్‌కు విశ్రాంతినిచ్చారు. ఆతని స్థానంలో డేవిడ్ వార్నర్‌కు కెప్టెన్సీ పగ్గాలు అప్పగించారు. న్యూజిలాండ్, ఇంగ్లాండ్‌తో ఈ జట్టు తలపడనుంది. ఆస్ట్రేలియా ఓపెనర్‌గా వార్నర్‌ను దక్షిణాఫ్రికాతో జరిగే టి-20తో ఆడేందుకు వీలుగా ఎంపిక చేసిన జట్టులో ఇప్పటివరకు వైస్‌కెప్టెన్‌గా ఉన్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగే సిరీస్‌ను తాము ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నామని, కెప్టెన్ మార్పు విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదని చీఫ్ సెలెక్టర్ ట్రెవర్ హాన్స్ పేర్కొన్నాడు. స్టీవ్ స్మిత్‌కు కొంతకాలంపాటు విశ్రాంతి ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నాడు. వార్నర్ బాగా పరిణితి చెందిన క్రీడాకారుడైనందున స్టీవ్ స్మిత్ లేని లోటును భర్తీ చేస్తాడనే నమ్మకం ఉందని పేర్కొన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్‌లో మంచి సామర్థ్యం ఉన్న వారినే ఎంపిక చేశామని, వీరందరి కృషితో ముక్కోణపు టోర్నీలో విజయం సాధించగలమనే ధీమాను ఆయన వ్యక్తం చేశాడు.

**ట్రై సిరీస్‌కు ఆస్ట్రేలియా జట్టు:** డేవిడ్ వార్నర్ (కెప్టెన్), ఆరోన్ పించ్, ఆస్టన్ అగర్, అలెక్స్ కారీ, బెన్ వార్షూష్, ట్రావిస్ హెడ్, క్రిస్ లిన్, గ్లేన్ మాక్స్‌వెల్, కేన్ రిచర్డ్‌సన్, డార్సీ షార్ట్, బిల్లీ స్టాన్‌లేక్, మార్కస్ స్టోయిన్‌సిస్, ఆండ్రూ టై, ఆడం జంపా.

## పీఎం ఎలెవెన్ జట్టు కెప్టెన్‌గా నాథన్ లియాన్

సిడ్నీ, జనవరి 23: కాన్‌బెరాలో వచ్చేనెలలో ఇంగ్లాండ్‌తో జరిగే ప్రైమ్ మినిస్టర్ ఎలెవెన్ టీ-20లో ఆడే ఆస్ట్రేలియా జట్టు కెప్టెన్‌గా స్పిన్నర్ నాథన్ లియాన్ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని ఆస్ట్రేలియా క్రికెట్ కంట్రోల్ బోర్డు పేర్కొంది. ఇంగ్లాండ్‌తో జరిగిన యాషెష్ టెస్టు సిరీస్‌లో ఆస్ట్రేలియా 4-0 తేడాతో విజయం సాధించడంలో లియాన్ ప్రముఖ పాత్ర వహించాడు. ఐదు మ్యాచ్ ఈ సిరీస్‌లో లియాన్ 21 వికెట్లు తీసుకున్నాడు. కెరీర్‌లో అతను ఇంతవరకు 290 టెస్టు వికెట్లు తీసి, విజయవంతమైన ఆఫ్‌స్పిన్నర్‌గా ఖ్యాతి గడించాడు. కాగా, కెప్టెన్‌గా లియాన్ అన్ని అర్హతలు కలిగినవాడని క్రికెట్ ఆస్ట్రేలియా పేర్కొంది. గతంలో కెప్టెన్లు వ్యవహరించిన బ్రెట్ లీ, మైఖేల్ హస్సీ, రికీ పాంటింగ్ సరసన నాథన్ లియాన్ చేరుతాడని తెలిపింది.

## దక్షిణాఫ్రికా టూర్‌కు హోలాండ్, రిచర్డ్సన్

### 15 మంది జట్టును ప్రకటించిన ఆస్ట్రేలియా

మెల్బోర్న్, జనవరి 23: వచ్చేనెల 15న దక్షిణాఫ్రికా టూర్‌కు 15 మంది సభ్యులు కలిగిన జట్టును ఆస్ట్రేలియా ప్రకటించింది. అయితే, ఈ జట్టులో అనూహ్యంగా స్పిన్నర్ జాన్ హోలాండ్, పేసర్ జేరిచర్డ్సన్‌ను ఎంపిక చేయడం గమనార్హం. ఎడమ చేతివాటం కలిగిన 30 ఏళ్ల హోలండ్ 2016లో శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుమ్యాచ్‌లలో ఆడాడు. అయినా, అతనిని ఇంగ్లాండ్‌తో ఇటీవల జరిగిన యాషెష్ సిరీస్‌కు ఎంపిక చేయలేదు.

గత షఫీల్డ్ షీల్డ్‌లో సీజన్‌లో ఆడిన హోలాండ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. 21 ఏళ్ల రిచర్డ్సన్ జట్టులోని ఐదుగురు పేసర్లలో ఒకడుగా ఉన్నా అద్భుతంగా బౌలింగ్ వేయడంలో దిట్టగా పేరుగాంచాడు. తొలిసారిగా ఆడిన అంతర్జాతీయ మ్యాచ్‌లోనే తన ఆటతీరుతో అందరి మెప్పు పొందడం వల్లనే దక్షిణాఫ్రికా టూర్‌కు మళ్లీ అతనిని ఎంపిక చేశామని జట్టు చీఫ్ సెలక్టర్ ట్రెవర్ హాన్స్ తెలిపాడు. ఈ టూర్‌లోనూ అతను అద్భుతంగా ఆడి జట్టును గెలిపిస్తాడనే ఆశిస్తున్నట్టు ఆయన పేర్కొన్నాడు.

**జట్టు వివరాలు:** స్టీవ్ స్మిత్ (కెప్టెన్), డేవిడ్ వార్నర్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్, జాక్సన్ బర్డ్, పాట్ కమిన్స్, పీటర్ హ్యాండ్స్‌కోమ్, జోష్ హాజెల్‌వుడ్, జాన్ హోలాండ్, ఉస్మాన్ ఖాజా, నాథన్ లియాన్, మిచెల్ మార్ష్, షాన్ మార్ష్, టిమ్ పైన్, జే రిచర్డ్‌సన్, మిచెల్ స్టార్క్.

## లాయిడ్ పోప్ అద్భుత ప్రదర్శన

### ● ఐసీసీ అండర్-19 టోర్నీ

డబ్ల్యుసి క్వీన్‌స్టన్, జనవరి 23: ఇక్కడ జరుగుతున్న ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో సూపర్ లీగ్ క్వార్టర్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా సెమీస్‌లోకి దూసుకెళ్లింది. ఇంగ్లాండ్‌తో మంగళవారం జరిగిన ఈ పోటీలో ఆస్ట్రేలియా స్పిన్నర్ లాయిడ్ పోప్ బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శనతో మెరిశాడు. టోర్నీలో 35 పరుగులిచ్చి 8 వికెట్లు తీసుకోవడం ద్వారా జట్టును సెమీ ఫైనల్‌లో తీసుకెళ్లడంలో ప్రముఖ పాత్ర పోషించాడు. 18 లోయిడ్ పోప్ తన అత్యుత్తమ ఆటతీరుతో జట్టు కెప్టెన్ జోసన్ రాల్‌స్టోన్ సహా సహచర సభ్యుల అభినందనలు అందుకున్నాడు.



### సెమీ ఫైనల్‌లోకి ఆస్ట్రేలియా

లెగ్‌స్పిన్నర్ లాయిడ్ పోప్ అద్భుత ఆట తీరుతో ఇక్కడ జరిగిన ఐసీసీ అండర్-19 ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో ఆస్ట్రేలియా సెమీ ఫైనల్‌లోకి దూసుకెళ్లింది. ఇంగ్లాండ్‌తో మంగళవారం జరిగిన పోటీలో ఆస్ట్రేలియా లెగ్‌స్పిన్నర్ లాయిడ్ పోప్ 35 పరుగులిచ్చి ఎనిమిది వికెట్లు తీసుకున్నాడు. కేవలం 23.4 ఓవర్లలో 96 పరుగులు మాత్రమే చేసిన ఇంగ్లాండ్ ఏ దశలోనూ ప్రతిఘటన ఇవ్వలేక చతికిలపడింది. ఆస్ట్రేలియా కెప్టెన్ జాసన్ సంగా అత్యధికంగా 58 పరుగులు చేశాడు. గురువారం న్యూజిలాండ్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య క్వార్టర్ ఫైనల్‌లో గెలుపొందే జట్టుతో ఈనెల 29న క్రిస్ట్‌చర్చ్‌లో జరిగే ఆస్ట్రేలియా సెమీఫైనల్‌లో తలపడుతుంది.

## ఆస్ట్రేలియా ఓపెన్ సెమీ ఫైనల్

### కెయిల్ ఎడ్మండ్ గెలుపు ● డిమిట్రోవ్ ఓటమి

మెల్బోర్న్, జనవరి 23: ఆస్ట్రేలియా ఓపెన్ టెన్నిస్ గ్రాండ్ శ్లామ్ సెమీ ఫైనల్స్‌లో ప్రపంచ నెంబర్ 3 ఆటగాడు గ్రిగర్ డిమిట్రోవ్ ఓటమి చెందాడు. ఇతనితో తలపడిన ఇంగ్లాండ్‌కు చెందిన అన్‌సీడెడ్ ఆటగాడు 23 ఏళ్ల కెయిల్ ఎడ్మండ్ విజయం సాధించి ఆస్ట్రేలియా ఓపెన్‌లో సెమీస్‌లోకి వెళ్లిన ఆరో బ్రిటీష్ ఆటగాడిగా ఘనత సాధించాడు. రెండు గంటల 49 నిమిషాలపాటు జరిగిన టోర్నీలో ప్రపంచ 49 నెంబర్ ఆటగాడైన కెయిల్ 6-4, 3-6, 6-4 తేడాతో విజయం సాధించాడు. ఈ విజయంతో కెయిల్ 16 సార్లు గ్రాండ్ శ్లామ్ చాంపియన్‌షిప్ సాధించిన రాఫెల్ నాదల్ లేదా మారిన్ సిలిస్‌తో ఫైనల్‌లో తలపడతాడు. సెమీఫైనల్స్‌లో గెలుపు క్షణాలను మరువలేనని ఎడ్మండ్ సంతోషం వ్యక్తం చేశాడు. రోడ్ లావర్ అరెనా మైదానంలో ఆడడం తనకు ఇదే మొదటిసారని, ఈ గెలుపు తనకు ఒక ప్రత్యేకతగా నిలుస్తుందని అన్నాడు. ఇంగ్లాండ్‌కు చెందిన ఆండీ ముర్రే ఐదుసార్లు ఆస్ట్రేలియా గ్రాండ్ శ్లామ్‌లో సెమీఫైనల్‌కు చేరిన ఆటగాడిగా ఘనత సాధించి, గాయం కారణంగా టోర్నీకి ముందే తప్పుకున్నాడు. ముర్రే తర్వాత ఆ స్థానాన్ని ఎడ్మండ్ భర్తీ చేస్తూ ఘనత సాధించాడు.


కెయిల్ ఎడ్మండ్

## వ్యూహాత్మకంగానే వెళ్తున్నాం: మిథాలీరాజ్

ముంబయి, జనవరి 23: దక్షిణాఫ్రికా టూర్‌కు ముందుగా వెళ్లడం వల్ల అక్కడి వాతావరణానికి అలవాటుపడి జట్టు రాణించే అవకాశం ఉంటుందని భారత మహిళా క్రికెట్ స్కిప్పర్ మిథాలీ రాజ్ అన్నారు. ఫిబ్రవరి 5నుంచి కింబర్లీలో జరగనున్న మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్ కోసం మిథాలీ సారథ్యంలోని మహిళా జట్టు దక్షిణాఫ్రికా టూర్‌కు బుధవారం బయలుదేరుతోంది. ఈ టూర్‌లోనే ఫిబ్రవరి 13నుంచి పోచెఫ్‌స్ట్రూమ్‌లో టి-20 సిరీస్ కూడా జట్టు ఆడనుంది. జట్టు ముందుగానే సౌతాఫ్రికాకు బయలుదేరడంపై మీడియా ప్రశ్నించినపుడు 'గత ఏడాది ఇంగ్లాండ్‌లో వరల్డ్ కప్‌కు వెళ్లినపుడూ ముందుగానే వెళ్లాం. అది జట్టుకు ఒకవిధంగా చాలా మంచిదైంది. ఉన్న సమయాన్ని ప్రాక్టీస్ మ్యాచ్‌లకు వాడుకున్నాం. అలాగే, పిచ్ పరిస్థితిని అర్థం చేసుకునే అవకాశం దక్కింది. ఉపఖండంలో వికెట్ల పరిస్థితిని ముందుగా అర్థం చేసుకోవడం వల్ల జట్టు రాణించే అవకాశాలు మెండుగా ఉంటాయి. ఆ ఆలోచనతోనే టూర్‌కి జట్టు ముందుగా బయలుదేరుతోంది. అంతేకాదు, ఈసారి రెండు కొత్త బంతులతో మ్యాచ్‌లు ఆడాల్సిన పరిస్థితి ఉంది' అని అన్నారు. 'రెండు కొత్త బంతులతో ఆడుతోన్న మొట్టమొదటి అంతర్జాతీయ మ్యాచ్‌లు ఇవి. అక్కడి పరిస్థితులకు అలవాటుపడి జట్టు రాణించాలంటే ముందుగా వెళ్లక తప్పని పరిస్థితి' అని 35ఏళ్ల మిథాలి వ్యాఖ్యానించారు. మిథాలీ వ్యూహాన్ని కోచ్ తుషార్ ఆరోథె బలపర్చారు. 'ఉపఖండంలో కొత్త వాతావరణానికి అలవాటుపడటం అన్నది జట్టుకి చాలా అవసరం. ముందస్తు సమయంలో ప్రాక్టీస్ మ్యాచ్‌లకూ అవకాశం ఉంటుంది. వరల్డ్ కప్ కోసం గత ఏడాది ఇంగ్లాండ్ టూర్‌కు పది రోజులు ముందుగా వెళ్లాం. అదే జట్టుకు ఉపకరించింది' అని అరోథె అన్నారు. ఇదిలావుంటే, ఇప్పటికే దక్షిణాఫ్రికా టూర్‌లోవున్న భారత క్రికెట్ జట్టు ఘోర వైఫల్యాలతో విమర్శలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. అన్ని సౌకర్యాలు కల్పించినా జట్టు ఎందుకు పేలవమైన ఆటతీరు కనబర్చిందన్న అంశంపై ఇప్పటికే బీసీసీఐ సమీక్షలకు సిద్ధమవుతోంది.



## ప్రీ ఒలింపిక్స్ తనిఖీలకు

### ఉత్తర కొరియా ప్రతినిధుల రాక

సియోల్, జనవరి 23: వచ్చే నెలలో వింటర్ ఒలింపిక్స్ నిర్వహించేందుకు వీలుగా అనువైన స్థలం ఎంపికతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణను పరిశీలించేందుకు రెండు రోజుల పర్యటనలో భాగంగా ఉత్తర కొరియా ప్రతినిధి బృందం సియోల్ చేరుకుంది. హేన్ సోంగ్ వోల్ నేతృత్వంలోని ఏడుగు సభ్యులు గల బృందం గట్టి భద్రత మధ్య ఇక్కడకు వచ్చింది. ఇక్కడి మీడియా ప్రతినిధులతో మాట్లాడేందుకు ఆ బృందం నిరాకరించింది.

Printed and Published from Vijayawada by K.Sudhakar on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor T.V.Ravi Reddy, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

# భూమిక

bhoomika@andhrabhoomi.net

ఆంధ్రభూమి

బుధవారం 24, జనవరి 2018




భారతీయ నృత్యం పవిత్ర గంగానదిలాంటిది. అందరినీ పునీతుల్ని చేసే ఆ గంగాప్రవాహం వంటిదే తెలుగువారి నృత్యరీతి కూచిపూడి ఈ రసగంగ ప్రవాహంలో ఎందరో కళాకారులు తమ జీవితాలను ధన్యం చేసుకున్నారు. అసమాన రీతిలో కళకు సేవచేస్తూ ఆ కళావైభవానికి వన్నెలద్దుతున్నారు. ఈ రసామృతాన్ని ఆస్వాదిస్తూ, పావనులవుతున్న నాట్యాచారుడు, కూచిపూడి అనే ఈ పవిత్ర రసగంగలో విరిసిన పద్మం డా॥ చింతా రవి బాలకృష్ణ.

# నిత్య విద్యార్థి..

• శాస్త్రీయ నృత్యానికి సొబగులు • కూచిపూడికి పూర్వ వైభవం



కళాంజలి

-డా. శ్రీలేఖ కొచ్చెర్లకోట, పిహెచ్.డి

డా॥ చింతా రవి బాలకృష్ణ కూచిపూడి నృత్యంలో ఎం.ఏ చేసి, స్వర్ణపతకం కూడా అందుకున్నారు. అలాగే కూచిపూడి నృత్యంలో సర్టిఫికెట్, డిప్లొమా పొందారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో కూచిపూడిలో పరిశోధన చేసి, 'కూచిపూడివారి రూపానుసారం -వేదాంతం సత్యనారాయణ శర్మ' అనే అంశంమీద సిద్ధాంత వ్యాసం రాసి, 2016లో పిహెచ్‌డి పొందారు. చింతా రామమూర్తి, వేదాంతం రత్తయ్య శర్మ, పసుమర్తి రత్తయ్య శర్మ ,పద్మశ్రీ వేదాంతం సత్యనారాయణ శర్మ వంటి గురువుల వద్ద నృత్యాన్ని అభ్యసించారు. ఈయన పిహెచ్‌డికి పరిశోధన చేస్తున్నప్పుడు వీరి మార్గదర్శి డా.వేదాంత రామలింగ శాస్త్రి. అలాగే పి.సత్యనారాయణ వద్ద మృదంగం చాలా సంవత్సరాలు నేర్చుకున్నారు. ఎన్నో ప్రముఖ పత్రికలలో, సావనీర్లలో వ్యాసాలు ప్రచురించారు. ప్రస్తుతం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో, శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి కళాపీఠంలో నృత్య శాఖలో గత 12 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. వీరు ఇప్పటివరకు వందల శిష్యులను తయారుచేసి సర్టిఫికెట్, డిప్లొమా పరీక్షలలో ఉత్తీర్ణులను చేశారు. వీరివద్ద శిక్షణ పొందిన విద్యార్థులు ఎంతోమంది సిసిఆర్‌టి, హెచ్‌ఆర్‌డి స్కాలర్‌షిప్స్ పొందారు. తిరిగి వారు నృత్యానికి కూడా సేవ చేస్తున్నారు.

**పొందిన గౌరవాలు**

డా. చింతా రవి బాలకృష్ణ ఎన్నో గౌరవాలు, సత్కారాలు పొందారు. 1995లో న్యూఢిల్లీ, భారత ప్రభుత్వం నుండి సిసిఆర్‌టి స్కాలర్‌షిప్ పొందారు. 2002లో హెచ్‌ఆర్‌డి, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్, న్యూఢిల్లీ నుండి యంగ్ ఆర్టిస్ట్ స్కాలర్‌షిప్ పొందారు. 2010 హెచ్‌ఆర్‌డినుండి జూనియర్ రీసెర్చి ఫెలోషిప్ పొంది 'కూచిపూడి నాట్యయోగం - విశ్లేషణ' అనే అంశంమీద పరిశోధన చేశారు. వేదాంతం సత్యనారాయణ శర్మ వద్ద స్త్రీ వేషం నేర్చుకున్నారు. నర్తనశాలలో బృహన్నలగా వేశారు. అలాగే సీతాపహరణంలో సీతగా ఇంకా రావణుడిగా కూడా చక్కగా చేస్తారు. స్త్రీవేషం ఎంత బాగా చేస్తారో ఉషాపరిణయంలో బాణాసురుడిగా అంతే బాగా చేస్తారు . దూరదర్శన్‌లో బి గ్రేడు కళాకారునిగా రాణిస్తున్న ఈయన 2009లో ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం సంగీత నాటక అకాడమీ నుండి లభించింది. 2007లో యువ సూత్రధారి పురస్కారం సిద్ధేంద్రయోగి ఫెస్టివల్‌లో పొందారు. 2008లో నృత్య కౌముది, 2009లో విశిష్టరత్న- ఉగాది పురస్కారం, 2017లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉగాది పురస్కారం, నటరాజ సాంస్కృతిక కళాపీఠం, విజయవాడ నుండి నటరాజ పురస్కారం పొందారు. స్వర్ణకంకణంతో సత్కారం పొందారు.

**1900 నృత్య ప్రదర్శనలు**

డా. చింతా రవి బాలకృష్ణ దాదాపు 1900 నృత్య ప్రదర్శనలు దేశ విదేశాలలో ఇచ్చారు. ఎన్నో నృత్య రూపకాలకు రూపకల్పన చేశారు. వెంకటేశ్వర వైభవము, శ్రీరామ పట్టాభిషేకము, మహిషాసుర మర్దని, గోదా కళ్యాణం, అన్నమయ్య, తరిగొండ వెంగమాంబ, భగవద్గీత, మోహినీ భస్మాసుర, అమరావతీ వైభవం- ఎన్నో కొత్త వ్యస్త నృత్యాంశాలను కొరియోగ్రఫి చేసి అందరి మన్ననలు పొందారు. స్త్రీ పాత్రలు పురుష పాత్రలు సమానంగా, అవలీలగా, సునాయాసంగా చేయగలరు. భామకలాపంలో సత్యభామ, మాధవి, శ్రీకృష్ణుడు చేశారు.

**ప్రహ్లాద యక్షగానం:** సూత్రధారుడు, హిరణ్యకశ్యపుడు, నరసింహస్వామి, వేత్రహస్తుడు, చండామార్కులు, పాములవాళ్ళు, లీలావతి.





ఉషాపరిణయం: ఉష, చిత్రలేఖ, అనిరుద్ధుడు, శ్రీకృష్ణుడు, శివుడు, వేత్రహస్తుడు, నారదుడు, సూత్రధారి.

**శశిరేఖాపరిణయం:శ్రీకృష్ణుడు.**
**పార్వతీ కళ్యాణం:మన్మథుడు, భృంగి.**
**మోహినీ భస్మాసురుడు : భస్మాసురుడు.**
**నర్తనశాల: బృహన్నల, భీముడు**
**వినాయకచవితి: మయావిష్ణువు**
**గోదాకళ్యాణం:గరుత్మంతుడు.**
**కృష్ణవిజయం : వసుదేవుడు.**
**విజయవిలాసం:బ్రాహ్మణుడు**
**రుక్మిణీ కళ్యాణం: అగ్నిజ్యోనుడు**

స్పిక్ మెకీ ఆధ్వర్యంలో డా. చింతా రవి బాలకృష్ణ ఎన్నో లెక్చర్ డెమాన్‌స్ట్రేషన్స్ భారతదేశమంతటా ఇచ్చారు. కాకినాడ, హైదరాబాద్ మొదలగు ముఖ్య పట్టణాలలవో కేంద్రీయ విద్యాలయాల్లో ఇచ్చారు. అలాగే పగటి వేషాలమీద పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బుడబుక్కలు, శారద వేషం వేసి చూపించారు.

**సంగీతం:** నాట్యం సమాహారకళ. ఇందులో సంగీతం, సాహిత్యం, శిల్పం, చిత్రలేఖనం, నృత్యం అన్నీ ఇమిడి ఉన్నాయి. వీరు తండ్రి నాట్యభూషణ చింతా రామమూర్తిగారి వద్ద సంగీతం, నాట్యశాస్త్రం నేర్చుకున్నారు. మృదంగం పి.సత్యనారాయణగారి వద్ద నేర్చుకున్నారు.

**ఆశయం:** ఎన్ని కష్టాలు వచ్చినా కూచిపూడి గ్రామంలోనే వుండి మా పెద్దలు, గురువులు అందించిన కూచిపూడి సంప్రదాయ నృత్యాన్ని భావితరాలకు కుల తమ భేదాలు లేకుండా అందించడమే నా ఆశయం. ఇది నా తండ్రి మాట మరియు ఆశయం. ఎల్లప్పుడూ నేను నిత్య విద్యార్థినే అని అంటారు డా. చింతా రవి బాలకృష్ణ.

# ఆరోగ్య ప్రదాయిని.. ఆదిత్యుని పూజ

## నేడు సూర్య భగవానుని జయంతి



''మతం అని ఒకదానిని ఎంచుకోవలసి వస్తే, లోకానికి అంతటికీ వెలుగును ప్రసాదించే సూర్యుడిని దేవునిగా ఎంచుకుంటాను'' అన్నాడు నిఖిల లోక విఖ్యాతుడైన నెపోలియన్ చక్రవర్తి. భారతావనిలో సూర్యారాధన ప్రాచీనమైనది. రుగ్వేదంలో సూర్యుని స్తుతితో పది రుక్కులు ఉన్నాయి. వేద మంత్రం గాయత్రి సూర్యపరమైనదే. వేదంలోని సూర్యస్తుతిలో సూర్యరథ, సూర్య గుర్రాల ప్రస్తావన ఉంది. సూర్యుడు ప్రత్యక్ష దైవం. అయినా ఆదిలో విగ్రహ పూజ, ఆలయాలు లేకుండేవి. నవగ్రహాలలో సూర్యపూజ ఉత్కృష్టమైనది. వేదాలలో సౌరసూక్తాలు, రామాయణంలో ఆదిత్య హృదయం భారతదేశంలో సూర్యపూజ పౌరాతనాన్ని స్పష్ట పరుస్తాయి. యాలెన్ అనే చరిత్రకారుని ప్రకారం ఆదిలో సూర్యుని రూపానికి ప్రతినిధిగా కిరణాలతో కూడిన బింబం పుట్టి, పూజార్హమైంది. ఆదిలో నాణాల మీద క్రీ.పూ.రెండు, ఒకవంద ఏళ్ళ మధ్య తొలుత కిరణాల బింబం కానవచ్చేది. పాంచాలంలోని రాజులైన సూర్యమిత్ర, భానుమిత్ర నామముల నాణేలపైన ఉండేవి. విగ్రహ రూప మిత్ర (సూర్య) పూజ పారశీకమున (ఇరేనియన్) ప్రారంభమైనట్లు కనిపిస్తుంది. సూర్యాలయాలు భారతావనికి శకనృపులతో వచ్చిన మగి పూజారుల భిక్ష. కృష్ణుని కుమారుడు సాంబుడు చంద్రబాగా (చీనాబ్) నదీ తీరాన సూర్యదేవాలయం నిర్మించాడని భవిష్యత్ పురాణ కథనం. నంబాపురం లేదా మూలాస్థానం (ముల్తాన్)లో ఒక సూర్యాలయం ఉందని హూయన్‌త్సాంగ్ పేర్కొన్నాడు. ఒరిస్సాలోని కోణార్కాలయం మగి బ్రాహ్మణ పూజారుల ప్రాబల్యానికి ప్రతీకగా ఉంది. గుప్తుల పాలనానంతరం, హర్షవర్ధనుని కాలాన సూర్యారాధన పెరిగి, ఆదిత్య భక్తులైన ఆయన తండ్రి తాతలకు ప్రభాకర, ఆదిత్య వర్ధన నామాలున్నాయి.

నవ గ్రహాలలో సూర్యపూజ ప్రధానమైనందున, అట్టి సూర్యుని కొలుచుట ఏడాదికోసారి మాత్రమే, రథ సప్తమినాడే కావడం విశేషం. ఈశ్వరుడు మాఘ శుద్ధ సప్తమి నాడు సూర్యుడిని సృష్టించాడని పేర్కొంటారు. పంచాంగ కర్తలు ఈదినాన్నే 'సూర్య జయంతి'గా, 'రథ సప్తమి'గా, 'మన్వాది'గా పేర్కొంటారు. రథ సప్తమిని రాజపుటానాలో సౌర సప్తమియని, వంగ దేశంలో భాస్కర సప్తమియని, కొన్ని చోట్ల జయంతి సప్తమి యని, మరికొన్ని చోట్ల మహా సప్తమియని అంటారు. సూర్యునికి వివస్వంతుడని పేరు. వివస్వంతుని కుమారుడు ఏడవ మనువైన వైవస్వతుడు. మన్వంతరానికి రథ సప్తమి మొదటి తిథి. వైవస్వత మన్వాది దినమైనందున పితృదేవతలకు ప్రియకరమైనది. ఒకప్పుడు భారత దేశంలో వైవస్వత మన్వాది తిథి సంవత్సరాదిగా చెప్పబడి, ఉగాది పండగగా ఉండేదని భావించ బడుతున్నది. తెలుగుదేశంలోనూ రథసప్తమినాడు అనేక స్త్రీల వ్రతాలు పట్టే ఆచారం ఉంది. సూర్య ఆరాధన ప్రధానంగా ఆచరించే ఈనాడు సూర్య రథాలు మళ్ళుతాయని, అవి ఉత్తర గతిని సూచిస్తాయని పురాణ కథనం. రథ సప్తమి నాడు సూర్య గ్రహణ తుల్యమైన పుణ్యకాలమని భావించే భక్తులు సూర్యోదయానికి పూర్వమే స్నానాదులు ఆచరించి, దానాదులు సూర్యోదయానంతరం చేయాలని ధర్మ సింధువు స్పష్ట పరుస్తున్నది. అతి పుణ్యప్రదమైన గ్రహణ కాలాలు వేయింటి ఫలితం ఒక్క రథ సప్తమికే ఉండగలదని మత గ్రంథాలు వివరిస్తున్నాయి.

**- సంగనభట్ల రామకిష్టయ్య**



హర్షుడు ఆదిత్య విగ్రహ పూజ చేశాడని చరిత్ర చెపుతున్నది. ఆ కాలపునాటి మయూర కవి సంస్కృతంలో సూర్య శతకం వ్రాశాడు. సూర్య విగ్రహపూజ ఆరంభ తొలినాళ్ళలో, ఆంధ్రదేశాన ఎక్కువగా సూర్యరథ పూజ జరుగుతుండేది. క్రీ.శ.మూడు, నాలుగు శతాబ్దులలో కృష్ణా, గోదావరీ మధ్య తీరాన్ని ఏలిన శాలంకాయనులు చిత్రరత స్వామి భక్తులు. ఆరాధిత మూల విగ్రహం సూర్యునిదే అయినా చిత్ర రథ స్వామి అనే పేరు వ్యావహారికమైంది. కవి మారన విరచిత మార్కండేయ పురాణంలో సూర్య స్తుతి రథపరంగా సాగింది.

''ఒక సూర్యుండు సమస్త జీవులకు తానొక్కొక్కడై తోచు'' అంటాడు పోతనామాత్యుడు. మిత్ర, రవి, సూర్య, భాను, ఖగ, పూష, హిరణ్యగర్భ, మరీచి, ఆదిత్య, సవిత, అర్క, భాస్కర నామాలతో ద్వాదశాత్మకుడని సూర్యోపాసకులు వర్ణిస్తారు. వివిధ నామాలన్నింటికీ మూలం రథరూప పూజ. రథ సప్తమి అందులోనుండే పుట్టింది. అదే సూర్య జయంతి. సకల చరాచర జీవరాసుల ప్రాణ ప్రదాతయైన సూర్య భగవానుని జయంతిని ''సూర్య జయంతిగా, రథ సప్తమి''గా పేరెన్నికగన్న మాఘ శుక్ల పక్ష సప్తమి నాడు సూర్య రథాలు మళ్ళుతాయని, అవి ఉత్తర గతిని సూచిస్తాయని, ఈదినం సూర్య గ్రహణ తుల్యమైన పుణ్యకాలమని భక్తుల భావన.

# అన్నం దివ్యమైన ఔషధం



- కాలిన గాయం మీద బియ్యపు పిండి జల్లితే త్వరగా తగ్గిపోతుంది. గడ్డల మీద ఉడికించిన బియ్యపు పిండిని వేడివేడిగా చేసి, కట్టుకట్టితే ఆరంభంలో ఉన్నవి అణిగిపోతాయి. కొంతకాలం అయిన తరువాత పగిలి చీము పోతుంది.
- శరీరానికి పూర్తిపోషణ అందడానికి మెత్తగా వండిన అన్నంలో పాలు కలిపి ప్రతిరోజూ తినాలి. పాలు, అన్నం కలిపి తినడం వలన ప్రొటీన్లు కూడా అందుతాయి. రెండూ కలిపి తినడం వలన ఆహారంలో తీసుకున్న ఇనుము, సక్రమంగా రక్తంలోకి చేరుతుంది.
- టైఫాయిడ్, అల్సర్, విరేచనాలు వంటి అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు మెత్తగా వండిన అన్నంలో ఒక గ్లాసు మజ్జిగ, ఒక అరటిపండు కలిపి తీసుకుంటే మంచిది. అలా చేస్తే తేలికగా అరుగుతుంది. ఇది ఔషధంగా పని చేసి జీర్ణమండలాన్ని రక్షిస్తుంది.
- చంటి పిల్లలకు విరేచనాలు అవుతుంటే బియ్యాన్ని వేయించి పొడి చేసి, జావలా చేసి, దానిని మజ్జిగలో కలిపి కొద్దికొద్దిగా తినిపిస్తుంటే విరేచనాలు తగ్గుతాయి. డీహైడ్రేషన్ సమస్య రాదు.



# కాలేయంలో కొవ్వు ప్రమాదమా?



కాలేయంలో ఎక్కువగా నిలువ ఉన్న కొవ్వు ద్వారా కాలేయానికిగానీ, శరీరానికిగానీ 80శాతం మందిలో ఎలాంటి ప్రమాదం ఉండదు. మిగిలిన 20శాతం మందిలో ఫ్యాట్ లివర్ వ్యాధికి కారణమవుతోంది. ఈ వ్యాధి రెండో దశకు చేరుకోవచ్చు. అది నాన్ అల్కహాలిక్ స్టాటో హైపటైటిస్ (ఎన్ఎఎస్‌హెచ్) దశలో దీనిని గుర్తించనట్లయితే, ఇది మూడో దశకు చేరుకునే అవకాశం కూడా ఉంటుంది. దీనిని 'సిర్రోసిస్ ఆఫ్ లివర్'అంటారు దీనిలో కాలేయ కణాలు స్కార్ అనే కణజాలంలో మార్పిడి చేస్తారు. ఇది చాలా ప్రమాదానికి దారి తీస్తుంది. రక్తపు వాంతులు అవ్వడం, కడుపులో నీరు నిండటం, కాలేయ సంబంధిత కోమా వంటి సమస్యలు ఉంటాయి. ఫ్యాటీ లివర్ అనేది వ్యాధి కాదు. ఇది వివిధ రకాల ఇతర వ్యాధుల వల్ల సంభవించవచ్చు. ప్రధానంగా 'మెటబోలిక్ సింట్రోమ్' అనే అవాంఛిత చర్య వల్ల ఏర్పడుతుంది. దీని వల్ల గుండె, మెదడు సంబంధిత ప్రమాదాలకు దారితీస్తుంది. వాస్తవానికి కాలేయం కొవ్వుకి కోశాగారం లాంటిది. ఇది కొవ్వు పదార్థాలను గ్రహించి, దేహానికి ఉపయోగపడే విధంగా తయారుచేస్తుంది. కాలేయం కూడా కొన్ని రకాలైన కొవ్వు పదార్థాలను ఉత్పత్తి చేస్తూ కరిగిస్తూ ఉంటుంది. ఇది ఒక సంక్లిష్టమైన చర్య. ఈ చర్యలో ఏమాత్రం తేడా వచ్చినా కొవ్వు కరిగించకుండా, కాలేయ కణాలలో నిలువ చేస్తాయి. ఇదే ఫ్యాటీ లివర్‌కి దారితీస్తుంది.



# వ్యూహం

27

## అలపర్తి రామకృష్ణ

తనను ఫూల్ చెయ్యడానికి ఏవేవో నెంబర్లు కాగితంమీద రాసిచ్చాడా? ఒకసారి హైదరాబాద్ వెళ్లి నిజంగానే అతనికి స్విస్ ఎకౌంట్ వుందో లేదో చెక్ చేసుకోవాలి.

అరవింద్ ఇచ్చిన పేపర్లు, బ్యాంక్ అకౌంట్ డాక్యుమెంట్లు భద్రంగా తన షెల్ఫ్‌లో పెట్టుకున్నాడు కాశి.

⁂

హాస్పిటల్ దగ్గర వున్న హెలిపాడ్ దగ్గర హడావుడి మొదలంది. ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు ఆ ప్రాంతమంతా చుట్టుముట్టేశారు.

అరిఫ్ అక్కడకు ఎప్పుడు వచ్చినా వుండేది ఓ గంట మాత్రమే! హాస్పిటల్‌కు సంబంధించి కీలకమైన నిర్ణయాలు అతనే తీసుకుంటాడు. అతను తిరిగి వెళ్లిపోయేంతవరకు డాక్టర్ అరవింద్‌కు టెన్షన్.

సొంత హెలికాప్టర్‌లో వచ్చాడు అరిఫ్

హాస్పిటల్‌లో వున్నంతసేపు డాక్టర్ అరవింద్‌ను తప్పితే మరొకరిని కలవడు. అతి ముఖ్యమైన విషయం వుంటే తప్పితే మరొకరికి ఇంటర్వ్యూ ఇవ్వడు.

డాక్టర్ ఫణి ఫోన్ చేశాడు ఇంటర్‌కం నుంచి డాక్టర్ అరవింద్‌కు.

''అరిఫ్‌గారితో మాట్లాడాలి.. మీ ఛాంబరుకు వచ్చేయ్యమంటారా?'''

''దుబాయ్ కాల్ అటెండ్ అవుతున్నారు.. చాలా బిజీగా ఉన్నారు.. వెంటనే వెళ్లిపోవాలట! ఆయన వస్తున్నారని లంచ్ అరేంజ్ చేశాం! లంచ్ చేసే సమయం కూడా లేదట.. హైదరాబాద్ తిరిగి వెళ్లిపోవాలట!'' సమాధానమిచ్చాడు అరవింద్.

''నేను కూడా అర్జెంట్ విషయం మాట్లాడాలి.. నా విషయం ఆయనతో మాట్లాడాలి.. టెన్‌మినిట్స్ కంటే ఎక్కువగా మాట్లాడను'' అన్నాడు ఫణి.

''దుబాయ్ కాల్ అయ్యేక మీకు ఫోన్ కనెక్షన్ ఇస్తాను.. మాట్లాడుతారా?''

''నో.. నో.. ఐ వాంట్ టు టాక్ పర్సనల్లీ...''

''సరే.. వచ్చేయండి నా ఛాంబర్‌కు''

డాక్టర్ ఫణి ఛాంబర్‌లోకి అడుగుపెట్టేసరికి ఏదో చిరాకుపడుతూ అరుస్తున్నాడు అరిఫ్.

''ప్లీజ్ బీ సీటెడ్'' అన్నాడు డాక్టర్ అరవింద్ డాక్టర్ ఫణిని చూసి.


''ఏమిటి నాతో మాట్లాడాలన్నారట.. మీ మంత్లీ పేమెంట్స్ రెగ్యులర్‌గానే మీ బ్యాంక్ ఎకౌంట్‌లో జమ అవుతున్నాయి కదా!'' డాక్టర్ ఫణి వైపు తీక్షణంగా చూస్తూ.

''శాలరీ ప్రాబ్లమ్ కాదు''

''మరేమిటి?''' మీకేం ఇబ్బందులు వున్నాయి?

వాళ్లిద్దరిమధ్య సంభాషణ హిందీలో జరుగుతూ వుంది.

''ఈ హాస్పిటల్లో నాకు అపాయింట్‌మెంట్ ఇచ్చినపుడు మనిద్దరిమధ్య ఓ ఒడంబడిక జరిగింది.. ఆ సంభాషణలు జరిగినపుడు డాక్టర్ అరవింద్



గారు కూడా ఉన్నారు.. ఈ హాస్పిటల్లో చేరేక రిజైన్ చేసి మరో హాస్పిటల్‌లో చేరకూడదు.. అది మొదటి కండిషన్.. డెడికేటెడ్‌గా పనిచేయాలి. రెండో కండిషన్.. హాస్పిటల్లో జరిగే ఆపరేషన్స్ సంగతి ఎవరికీ లీక్ చెయ్యకూడదు.. పదేళ్లు కంపల్సరీగా పనిచెయ్యాలి! అవి మూడు, నాల్గవ కండిషన్స్.. ఆ కండిషన్స్ నేను ఫుల్‌ఫిల్ చేశాను'' అన్నాడు డాక్టర్ ఫణి, ఒక్క నిమిషం ఆగి అరిఫ్ మొహంలోకి చూస్తూ.

''ఓ.కె.. గుడ్.. దెన్ వాట్? ఇప్పుడు మీ ప్రాబ్లమ్ ఏమిటి?''' అడిగాడు అరిఫ్ కుర్చీలో నుంచి లేచి నిలబడి.

''పదేళ్లు కంప్లీట్ అయ్యేక నాకు మీ చైన్ ఆఫ్ హాస్పిటల్స్ బిజినెస్‌లో పార్ట్‌నర్‌షిప్ ఇస్తానన్నారు. పన్నెండేళ్ళు పూర్తి అయింది నేను మీ హాస్పిటల్లో చేరి.. ఐ వాంట్ మై పార్ట్‌నర్‌షిప్!'' మనస్సులోని మాట స్పష్టంగా చెప్పాడు.

''పార్ట్‌నర్‌షిప్ ఇస్తానని మీకు చెప్పానా?'' అడిగాడు అరిఫ్.

అవును.. స్పెసిఫిక్‌గా చెప్పారు. ఆ సమయంలో డాక్టర్ అరవింద్‌గారు కూడా మనం అగ్రిమెంట్ రాసుకున్నప్పుడు ఉన్నారు.. విట్‌నెస్ సంతకం కూడా పెట్టారు. అగ్రిమెంట్ పేపరులో పదేళ్ళ తరువాత పార్ట్‌నర్‌షిప్ ఇస్తానని మెన్షన్ చేశారు'' అంటూ కోటు జేబులోని అగ్రిమెంటు పేపరు బయటకు తీసి అరిఫ్‌కు చూపించాడు.

''మీ మాట మీద నమ్మకం ఉంది.. పేపరు చూడాల్సిన అవసరం లేదు..తప్పకుండా మీకు పార్ట్‌నర్‌షిప్ ఇస్తాం!''

''ఎప్పుడు?''

అరిఫ్ నవ్వాడు.

''అంత తొందరపడితే ఎలా? మీకు ఫ్యామిలీ లేదు.. బంధువుల్ని దూరం చేసుకున్నారు.. పార్ట్‌నర్‌షిప్ అంటే కోట్లలో వుంటుంది.. వందల కోట్లు ఏం చేసుకుంటారు?''

''డాక్టర్ అరవింద్‌గారిక్కూడా ఫ్యామిలీ లేదు.. భార్యకు విడాకులు ఇచ్చారు.. ఒంటరిగానే వుంటున్నారు.. మరి ఆయనకు పార్ట్‌నర్‌షిప్ ఇచ్చారుగా?''

అరిఫ్ అసహనంగా అటూ ఇటూ తిరిగేడు, విండో ప్లేన్ నుంచి దూరంగా కన్పిస్తున్న గోదావరి నదిని చూస్తూ.

''మీ ఇష్యూ తొందరగా సెటిల్ చేస్తాం... నో ప్రాబ్లమ్''

''ఎప్పుడు? నెల రోజుల్లోనా? పది రోజుల్లోనా?'' అడిగాడు డాక్టర్ ఫణి.

''మీరు మరీ తొందర పడుతున్నారు.. రెండు రోజుల్లోనే మీ పని పూర్తవుతుంది.. ఓ.కె!'' అన్నాడు అరిఫ్.

ఛాంబర్‌లోనుంచి బయటకు వెళ్లిపోయాడు డాక్టర్ ఫణి.

అతనికి ఎంతో ఆనందంగా వుంది.. తను అనుకున్నది రెండు రోజుల్లోనే జరగబోతున్నదని.

తనిప్పుడు వందల కోట్ల రూపాయలకు అధిపతి!

తన జీవిత ధ్యేయం నెరవేరబోతూ వుంది..

తనుండే విల్లాకు వెళ్లాడు.

ఆ లివింగ్ రూములోనే ఓ ప్రక్కన ఏర్పాటుచేసిన బార్ దగ్గరకు వెళ్లాడు. షెల్ఫ్‌నుంచి మాల్ట్ స్కాచ్ విస్కీ బాటిల్ కొత్తది తీసి మూత తిప్పాడు.

స్కాట్‌లెండ్‌లో తయారైన ఆ విస్కీబాటిల్‌ను చెంపకు ఆనిచ్చుకున్నాడు రెండు క్షణాలు.

మనస్సులో ఏదో తెలియని ఆనందం గోదావరి వరదలా ఉప్పొంగింది.

ఆ విజయం సాధించడానికి ఎన్నో కష్టాలు పడ్డాడు.. అయినవాళ్ళను దూరం చేసుకున్నాడు.

గుండెల్లో గుచ్చుకున్న బాణాలు గుర్తుకువచ్చాయి.

- ఇంకా ఉంది

## నేర్చుకుందాం

శ్రీ నరసింహ శతకములోని పద్యము



శీ

సీ. ఉర్విలో నాయుష్యమున్న పర్యంతంబు
మాయ సంసారంబు మఱcగి వరుcడు
సకల పాపములైతె సంగ్రహించును గాని
నిన్నుc జేరెడి యుక్తి నేర్వలేcడు
తుదకుc గాలుని యొద్ద దూత లిద్దఱు వచ్చి
గుంజుక చనివారు కొట్టుచుండ
హింస కోర్వcగ లేక యేడ్చి గంతులు వైచి
దిక్కు లేదని నాల్గు దిశలు చూడ

తే. తన్ను విడిపింప వచ్చెడి ధన్యుcడేడి
ముందె నీ దాసుcడై యున్న ముక్తి గలుగు
భూషణ వికాస ! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురిత దూర!

భావం : ఓ స్వామీ! మానవుడు ఈ ప్రపంచంలో బ్రతికినంతకాలం సంసార మాయకి లోబడి సమస్తపాపాల్ని ప్రోగు చేసుకుంటాడే కాని నిన్ను పొందే ఉపాయాన్ని కనుగొనలేడు. చిట్ట చివర యమభటులిర్వురు వచ్చి ప్రాణాల్ని గుంజుతూ ఉంటే ఆ బాధకు తట్టుకోలేక కాపాడమని నల్దిక్కులు చూస్తారు. విడిపించే పుణ్యాత్ముడెవడూ కన్పించడు. అందువల్ల ముందే నీ భక్తుడై ఉంటే మేలు కదా. మోక్షం సిద్ధిస్తుంది.

## మాటాట : 1545

నిర్వహణ: సుధామ

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | | | 2 | ■ | ■ | 3 |
| | ■ | ■ | | ■ | 4 | |
| | ■ | 5 | ■ | 6 | ■ | |
| ■ | 7 | | ■ | 8 | | ■ |
| 9 | ■ | | ■ | | ■ | 10 |
| 11 | | ■ | 12 | ■ | ■ | |
| | ■ | 13 | | ■ | 14 | |

### ఆధారాలు

అడ్డం:

1. బంగారం
4. నల్లబంగారం
7. దుర్గము
8. సేన, ఆకు
11. దీన్ని తన్నేవాడి తలదన్నే వాడుంటాడు
13. లజ్జ
14. మృణాళము

నిలువు:

1 రాహుల్ గాంధీ ఈ పార్టీ అధ్యక్షుడు
2. మురిపెము తోడిది
3. రంగవల్లికలు
5. వీటి మీద కూర్చునే పెళ్లి వ్రతము వంటివి చేస్తుంటారు
6. అందం
9. సుభాష్ చంద్రబోస్ బిరుదు
10. రవి
12. పసిపిల్లలకు త్రాగించేది ఈ గిన్నె కూడా ఉంటుంది

### మాటాట - 1544 సమాధానం

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 బ | ■ | ■ | 2 ద | 3 యా | ల్బా | 4 గు |
| 5 సం | బ | 6 రం | ■ | త్ర | ■ | రు |
| త్ | ■ | 7 గు | డి | ■ | 8 పా | వు |
| ■ | ■ | లు | ■ | 9 గి | ■ | ■ |
| 10 ప | ర్యం | ■ | 11 పం | డు | ■ | 12 స |
| న | ■ | 13 ప్రా | ■ | 14 గు | శ్వ | ము |
| 15 స | ర | స్వ | తి | ■ | ■ | ద్రం |



## రాశిఫలం

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
వృత్తిరీత్యా ఇబ్బందులను అధిగమిస్తారు. మానసికాందోళనతో కాలం గడుపుతారు. స్ర్తీలు చేసే వ్యవహారాల్లో సమస్యలెదురవుతాయి. ఆకస్మిక ధన నష్టం ఏర్పడే అవకాశముంటుంది.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
ధననష్టం కలిగే అవకాశముంది. పక్కదోవ పట్టించేవారి మాటలు వినరాదు. క్రీడాకారులకు, రాజకీయరంగాల్లోనివారికి మానసికాందోళన తప్పదు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
వృత్తి, ఉద్యోగ రంగాల్లో కోరుకున్న అభివృద్ధి ఉంటుంది. ఆకస్మిక ధనలాభాన్ని పొందుతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. గౌరవ మర్యాదలు పెరుగుతాయి. స్ర్తీలు, పిల్లలపట్ల మిక్కిలి శ్రద్ధ వహిస్తారు.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
అనారోగ్య బాధలను అధిగమిస్తారు. ఆటంకాలున్నా సత్ఫలితాలు పొందుతారు. వృత్తి, వ్యాపార రంగాల్లో ధననష్టమేర్పడకుండా జాగ్రత్త వహించాలి.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
అనారోగ్య బాధలు అధికమవుతాయి. అకారణంగా కలహాలేర్పడే అవకాశాలుంటాయి. విద్యార్థులు చంచలంగా ప్రవర్తిస్తారు.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
నూతన వస్తు, వస్త్ర, వాహన, ఆభరణ లాభాలను పొందుతారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది. శుభవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
లాభదాయకంగా వుంటుంది. తొందరపాటువల్ల ప్రయత్న కార్యాలు చెడిపోతాయి. చెడును కోరేవారికి దూరంగా నుండుట మంచిది.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
కుటుంబ కలహాలు దూరమవుతాయి. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. చెడు పనులకు దూరంగా వుండుట మంచిది.అత్యంత సన్నిహిలను కలుస్తారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
బంధు, మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది. చేసే పనులలోవ ఇబ్బందులుండును. క్రొత్త పనులను ప్రారంభించుట మంచిది కాదు.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
స్ర్తీల మూలకంగా లాభాలుంటాయి. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయం పొందుతారు. శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభముంటుంది.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
డబ్బు ఖర్చుగుటచే ఆందోళన చెందుదురు. విదేశయాన ప్రయత్నాలకు మార్గం సుగమమవుతుంది. ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించక తప్పదు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
మనోధైర్యాన్ని కోల్పోకుండా జాగ్రత్త వహించుట అవసరం. నూతన కార్యాలకు ఆటంకాలేర్పడతాయి. కోపాన్ని తగ్గించుకుంటే మంచిది. కఠిన సంభాషణవల్ల ఇబ్బందులనెదుర్కొంటారు.

## మంచిమాట

### సూర్యారాధన

బ్రహ్మస్వరూపముదయే, మధ్యాన్నేతు మహేశ్వరం
సాయంధ్యాయే సదా విష్ణుం, త్రయీమూర్తిర్దివాకరః

మనకు ప్రతిరోజూ సాక్షాత్కరించే సూర్యభగవానుడు త్రిమూర్తి స్వరూపుడని పైశ్లోకానికి అర్థం. ముల్లోకములలోనివారికి త్రికాలలో ఆరాధనీయుడు సూర్యుడు. ఈ చరాచర జగత్తునుండి తిమిరాలను పోగొట్టి తన కరుణా కటాక్ష వీక్షణాలనుండి వెలుగును ప్రసాదించే అవతారమూర్తి సూర్యభగవానుని వేద స్వరూపునిగా, కర్మసాక్షిగా పేర్కొంటున్నాయి పురాణాలు.'సూర్య' అను పదమునకు సకల జగత్తును చైతన్యపరిచేవాడని భావము. 'సువతి ప్రేరయతి వ్యాపారేష్టితి సూర్యః' అని ఉపనిషద్ నిర్వచనం. జగత్తును చైతన్యపరిచేవాడు కనుక జగదారాధ్యుడైనాడు.

సూర్యుడు అదితి కశ్యపుల తొలి సంతానం. కశ్యప పుత్రుడు కనుక కాశ్యపేయుడని, అదితి కుమారునిగా ఆదిత్యుడని పిలువబడుతున్నాడు. సూర్యునికి సంజ్ఞ, ఛాయ అని ఇద్దరు భార్యలు. యముడు, శని పుత్రులు. సూర్యరథానికి చిత్రరథమని పేరు. ఆ కారణంగా చిత్రరథుడనే పేరు వచ్చింది. సూర్యుని రథానికి ఒకే ఒక చక్రం. సూర్యరథాన్ని సప్త అనే అశ్వం లాగుతుంది. అది 'సప్తకాంచన సన్నిభం' అంటే ఏడు రంగుల కిరణాలను ప్రసరింపజేస్తుంది. ఆ ఏడు రంగులు వ్యక్తి శరీరంలో ఉండే ఏడు ధాతువులు- మజ్జ, మాంసం, మేధస్సు, ఎముక, శుక్రం, శోణితం, చర్మం అనువాటిపై ప్రభావం కలిగివుంటాయి. అనంత శక్తిమయమైన ఆ కిరణాలు వ్యక్తిపై ప్రసరిస్తే వాటివల్ల ఆయా ధాతువులపై ఉన్న రోగ లక్షణాలు నిర్మూలనమై ఆరోగ్యం లభిస్తుంది. అందుకే మనుస్మృతి 'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్' అని కీర్తించింది.

సూర్యుని నుండి ప్రసరించే ఏడు కిరణాలు-

**1. సుషుమ్నము - నాడీ మండలాన్ని ఉత్తేజపరుస్తుంది.**
**2. హరికేశము - గుండె జబ్బులను నివారిస్తుంది.**
**3. విశ్వకర్మము - రక్తహీతను, తత్సంబంధమైన వ్యాధులను నిర్మూలిస్తుంది.**
**4. విశ్వత్వచము - శ్వాసకోస సంబంధిత వ్యాధులను తొలగిస్తుంది.**
**5.సంపద్వసుము - జననేంద్రియ వ్యవస్థను దృఢపరుస్తుంది**
**6.అర్వాగ్యాసుము - నరాల బలహీనతను నివారిస్తుంది.**
**7. స్వరాద్యసుము - స్వరపేటికకు, మూత్రపిండాలను వ్యాధులను నివారిస్తుంది.**

సూర్యారాధన గురించి రామాయణము, మహాభారత గ్రంథాలలో విస్తృతంగా చెప్పడం జరిగింది. అగస్త్యుని ద్వారా ఆదిత్య హృదయము అను స్తోత్రాన్ని ఉపాసించి శ్రీరాముడు రావణ సంహారం చేసినట్లు, వన పర్వంలో ధర్మరాజు ఆదిత్యుని ఉపాసించి అక్షత పొందినట్లు కథలున్నాయి. దివోదాసుడనే రాజు సూర్యకిరణాల సాయంతో జీవితమంతా ఆహారాన్ని వండుకుని భుజించినట్లు స్కాందపురాణం వచిస్తున్నది. శ్రీకృష్ణుని పుత్రుడు సాంబుడు సూర్యోపాసనతో తనకు సంక్రమించిన కుష్ఠు రోగం నుండి విముక్తుడయ్యాడు.

జ్యోతిష శాస్త్రం ననుసరించి ప్రళయాంతరంలో సకల జగత్తు అంధకారమయం కాగా పరాశక్తి ఆదేశానుసారం పరమేశ్వరుడు తిరిగి సృష్టిని ప్రారంభిస్తూ తొల్దొల్తగా గ్రహ నక్షత్రాదులను సృష్టించి గ్రహాధిపతియైన సూర్యునిగా తానే వెలుగొందాడని పురాణ వచనం. అట్టి భాస్కరుని నుండి సృష్టి రచించబడిందని సూర్యోపనిషత్తు తెలియజేస్తుంది.

భగవతారాధనలో ఆదిత్యుని మించిన దైవం లేదని చెబుతూ శ్రీ శంకర భగవత్పాదులు ఏర్పాటుచేసిన పంచాయతన అర్చనావిభాగంలో ఆదిత్యునికి ప్రముఖ స్థానం కల్పించారు.

సూర్యోదయ సమయంలో సూర్య నమస్కారాలు చేస్తే ఆరోగ్యం, ఐశ్వర్యం, శరీర కాంతి, పటుత్వం, పాపక్షయంతోపాటు సకల సౌభాగ్యాలు లభిస్తాయని శాస్త్రవచనం. సూర్య నమస్కారాల విశిష్టతను యోగ శాస్త్రం అతిఘనంగా చెప్పింది. సూర్యుడు సకల విద్యలకు అధినేత. యాజ్ఞవల్క్యునికి, ఆంజనేయునికి సకల విద్యలు ప్రసాదించిన గురువు. సూర్యారాధన ప్రశస్తి త్రేతాయుగం నాటికే ఉందని ప్రశస్తి. విశ్వామిత్రుడని గాయత్రీ మంత్రం సూర్యోపాసనే. వైవశ్వత మనువుకు సూర్యనారాయణుడు మాఘ శుక్ల సప్తమినాడు దర్శనమిచ్చాడు. ఆ రోజును రథసప్తమిగా, సూర్య జయంతిగా పరిగణింపబడుతున్నది. అందరూ రథసప్తమి నాడు శుచిగా సూర్యారాధనతోపాటు సూర్య నమస్కారాలు చేసి ప్రత్యక్ష దైవమైన సూర్యనారాయణుని అనుగ్రహం పొందాలని ఆకాంక్ష.

**ఎ.సీతారామారావు**


## యాజ్ఞసేని



- త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము 19

ఈ విషయం పాంచాల రాజ్యానికి చుట్టూ యున్న రాజులందరికీ తెలిసిన విషయమే. అయితే పాండవులందరూ లాక్షగృహంలో మరణించారన్న వార్త దావానలంగా జనపదాలకు తెలిసిపోయింది.

అది అదనుగా కొందరు రాజులు అతిలోక సుందరి అయిన యాజ్ఞసేనిని



పొందాలనే ఉద్దేశ్యంతో ద్రుపదునికి కబురంపినవారు, చిత్రపటాలను పంపినవారు ఉన్నారు.

చెలికత్తెలు ఆనందంతో హడావుడిగా ద్రౌపది వద్దకు వచ్చారు. బలవంతాన ఆమెను చేయి పట్టుకొని చిత్రపటములు పేర్చిన ప్రాంగణానికి కొనివచ్చారు. ద్రౌపది అయిష్టంతో వాటిని చూడవచ్చింది.

రాకుమారి! ఇదిగో చూడుము. ఈ చిత్తరువు హస్తినాపురాధీశ్వరుడైన ధృతరాష్ట్రుని జ్యేష్ఠ పుత్రుడు దుర్యోధనునిది అని అన్నది చిత్రలేఖ.

అతడికి ఇదివరకే వివాహమైంది కదా. భానుమతి అనే భార్య ఉంది గదా! అన్నది యశస్విని. అయితేనేం సౌందర్యరాశి అయిన ద్రౌపది కూడా కావాలనుకుంటున్నాడేమో? అన్నది మరొక చెలికత్తె. అంతేకాదు ఈతడు కళింగ దేశపు రాజైన చిత్రాంగదుడు తన కూతురు శుభాంగికి స్వయంవరాన్ని ప్రకటింపగా అక్కడికి వెళ్ళాడు. స్వయంవరంలో శుభాంగి ఇతడిని చూడటం ఇష్టం లేక దాటివెళ్లిందని ఆగ్రహించి ఆమెను బలవంతంగా ఎత్తుకొని రథంపై నిడుకొని వెళ్లగా, అడ్డుపడినవారినందరినీ సూతపుత్రుడైన కర్ణుడు ఎదుర్కొన్నాడట. అంతటి ఘనుడీతడు'' అని అన్నది మరొక చెలికత్తె.

''అలానే ఇక్కడ కూడా చేద్దామనా?'' అని అన్నది కాహళి.

''ఇది ద్రుపద మహారాజు రాజ్యం, అంత తేలిక కాదు'' అని అన్నది యశస్విని.

''ఈతడి తండ్రి ధృతరాష్ట్ర మహారాజుకు లెక్కకు మించిన భార్యలని వింటున్నాము గదా!'' అన్నది కాంపిలిని.

''గాంధారిదేవితో సహా ఆమె పది మంది చెల్లెళ్ళను వివాహం చేసికొన్నాడు. వారుగాక ఒక వైశ్య కన్య అయిన సుగాధ అనే ఆమెను కూడా వివాహం చేసికొని యుయుత్సుడు అనే కొడుకును కూడా పొందాడు గదా!'' అన్నది ధాత్రేయిక.

అంతేనా! నాలుగు వర్ణాల్లోని నాలుగో వర్ణం కన్యలను వందమందిని కూడా పెండ్లాడాడు కదా?'' అన్నది కాహళి.

మౌనంగా వింటున్న ద్రౌపది ముందుకు కదిలింది.

''ఇదిగో! ఈ చిత్రపటం ఛేదిభూపతి శిశుపాలునిది'' అని అన్నది యశస్విని.

''ఇతగాడు మగధరాజైన జరాసంధునికి మిత్రుడు గదా!'' అని అన్నది కాంపిలిని.

''ఇతడికి కూడా ఒక చరిత్ర ఉన్నది'' అని అన్నది కాహళి. ''అదేమిటి'' అడిగింది కాంపిలిని. ''ఈతడు భభ్రువు అనే ఒక యాదవ శ్రేష్ఠుని భార్యను ఎత్తుకొని పోయి ఆమెను బలవంతంగా తన భార్యగా చేసికొన్నాడు'' అని చెప్పింది కాహళి.

''అవును జరాసంధుడు కూడా తన మనుమడైన మేఘసంధి చిత్ర పటమును మహారాజుగారికి పంపారు కదా!'' అని అన్నది ధాత్రేయిక.

''ఇదిగో ఆ చిత్తరువు!'' అని చూపించింది మనస్విని.

ద్రౌపది ఒకింత చలించినట్లయింది. ''తన బలాన్ని చూసి భయపెట్టాలని అనుకుంటున్నాడా?'' అని అన్నది ద్రౌపది.

''ఇదిగో ఈ చిత్తరువు కళింగ దేశాధిపతిది రాజకుమారి'' అన్నది మనస్విని.

యాజ్ఞసేని ముందుకు కదలింది.

''అమ్మా! ఈ చిత్రంలో ఉన్నది సుమిత్ర దేశాధిపతి!'' అన్నది వనమంజరి.

అహా! అని మౌనంగా కదిలింది.

''ఇంతమంది చిత్రపటములలోనివారు ఎవరు కూడా రాకుమారికి నచ్చనట్లున్నది'' అన్నది యశస్విని.

''మనసంతా అర్జునుని కోసం వెదుకులాడుచున్నది గదా!'' అని అన్నది ధాత్రేయిక చిలిపిగా.

ఇంతలో దృష్టద్యుమ్నుడు అక్కడికి వచ్చాడు. చిత్రాలను తిలకిస్తున్న చెల్లెలు ద్రౌపదిని చూశాడు.

''యాజ్ఞసేని! వీరిలో ఎవరైనా నచ్చారా!'' అని అడిగాడు.

సోదరా! పాండవుల జాడ ఏమైనా తెలిసిందా? వెళ్లిన వేగులవారు తిరిగి వచ్చారా!'' అని అడిగింది ద్రౌపది ఆత్రుతతో.

ఇంతవరకు పాండవులు ఎక్కడ ఉన్నారో, ఏమైనారో తెలియరాలేదు. వెదకబోయినవారు కొంతమంది తిరిగి రావలసి యున్నది. తండ్రిగారు చింతాక్రాంతులై ఉన్నారు.

పాండవుల గురించి పూర్తి వివరాలు తెలిసేటంత వరకు నాకు ఈ చిత్రాలను తిలకించాలనే ఆశ లేదు. పద తండ్రిగారి వద్దకు పోయి వారికి కొంత మనశ్శాంతి కలిగించటానికి ప్రయత్నిద్దాము.

⁂

13

హస్తినాపురము.

రాజాంతఃపురం. దుర్యోధనుడు ఎవరి కోసమో ఎదురుచూస్తున్నాడు.

ఇంతలో మహారాణి గాంధారి తమ్ముడైన శకుని వచ్చాడు.

తరువాత దుశ్శాసనుడు వచ్చాడు.

తదుపరి కర్ణుడు వచ్చాడు.

అందరూ కలిసి మంతనాలు మొదలుబెట్టారు.

- ఇంకా ఉంది

రచనలు పంపవలసిన చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక,
36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003




నేటి వ్యాపార వాణిజ్య కార్యకలాపాలకు ప్రాచీన మూలం వస్తు మార్పిడి. బార్టర్ వ్యవస్థగా పేర్కొనే ఈ విధానం శతాబ్దాలుగా భారత్ అంతా విస్తరించి ఉంది. వ్యాపార వాణిజ్యాల్లో ఆధునికత పెరిగినా ఈ ప్రాచీన విధానం చాలాచోట్ల ఇంకా అమలులోనే ఉంది. అస్సాంలోని మోరిగావ్ జిల్లాలో స్థానికులు ఈ వస్తు మార్పిడి విధానాన్నే ఇప్పటికీ అనుసరిస్తున్నారు. జాన్‌బీల్ మేలాగా పేర్కొనే ఈ ఉత్సవంలో వివిధ గిరిజన వర్గాలు తమ వస్తువులను మార్చుకుని స్థానికుల నుంచే కొత్త వస్తువులను పొందుతారు.




భిన్న రకాలకు చెందిన అమెరికా మహిళలు సమానత్వం, సామరస్యం, వివక్ష నిర్మూలనపై దేశ వ్యాప్తంగా ప్రదర్శనలు జరిపారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో జరిగిన పరిణామాలను, వర్గ వర్ణ వ్యతిరేక ధోరణులను నిరసించారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ వివక్షను గర్హిస్తూ మహిళలు లక్షలాది సంఖ్యలో ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ట్రంప్ విధానాలపట్ల మహిళల్లో గూడు కట్టుకున్న వ్యతిరేకత మరింతగా బయటపడింది.

# మార్పుతో అవకాశాల కూర్పు

## అంతర్జాతీయంగా రాణిస్తున్న భారత్ ◆ నిన్న ప్యారిస్.. నేడు దావోస్




ప్రపంచ ఆర్థిక సదస్సు జరుగుతున్న తరుణంలో భారత వ్యాపార, వాణిజ్య అవకాశాలు సమీప భవిష్యత్తులో మరింతగా ఇనుమడించే సంకేతాలు కనిపిస్తున్నాయి. భవిష్యత్ లక్ష్యాలను వర్తమానానికి ముడిపెడుతూ విధానపరమైన స్పష్టతతో దూర ఆలోచనతో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అనేక రకాలుగా ఆర్థిక పుష్టిని కల్పిస్తున్నాయి. ఫలితంగా అభివృద్ధి వేగాన్ని పుంజుకుంది. ప్రగతి పరుగులు పెడుతోంది. అన్నింటికీ మించి సంపద కేంద్రీకృతం కాకుండా ప్రభుత్వ విధానాల ప్రయోజనాలు అందరికీ అందే స్పష్టత కూడా క్రమంగా వ్యవస్థీకృతం అవుతోంది. బహుముఖీయంగా విస్తరిస్తున్న నేటి ప్రపంచంలో రాణించాలంటే 'నా దారి నాదే అంటే కుదరదు'. మన ఆలోచనలను అవసరాలను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటూ ముందుకు వెళ్లగలిగినప్పుడే సంపద చూకూరుతుంది. ఆ లక్ష్యంతోనే భారత్ అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటోంది. అంతర్జాతీయంగా పరివర్తనాపరంగా వస్తున్న మార్పుల పరంపరను అవగతం చేసుకుంటూ ఆ వేగాన్ని అందుకునేందుకు ప్రయత్నిస్తోంది. అంతర్జాతీయంగా అనేక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ వాటిని ఎదుర్కొంటూనే దేశ అవసరాలను తీర్చేందుకు ముఖ్యంగా ఆదాయంలో నెలకొన్న సమతూక రాహిత్యాన్ని తొలగించేందుకు నిత్యం వెంటాడే నిరుద్యోగ సమస్య తీవ్రతను తగ్గించేందుకు ఇటు సంఘర్షణలు, అటు హింసాకాండలను అరికట్టేందుకు ఎప్పటికప్పుడు తదేక దీక్షతో కృషి చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచం అంతటా ఈ రకమైన సవాళ్లు, సమస్యలు విస్తరించాయి. ఆయా ప్రభుత్వాల సుస్థిరతకే ముప్పు వాటిల్లే పరిణామాలు ఎప్పటికప్పుడు తీవ్రమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటు వృద్ధిని, అటు అభివృద్ధిని ఏకకాలంలో సాధిస్తూ ప్రగతిపథంలో దూసుకువెళుతున్న భారత్ అంతర్జాతీయంగా తన ప్రభావశీలతను ఇనుమడింపజేసుకోవాల్సిన సమయమిది. ప్రపంచంలో ఏ దేశానికీ లేని ప్రత్యేకత, అలాగే సంక్లిష్టత భారత్‌కు ఉంది. అత్యంత సంక్లిష్టమైన పాలనా వ్యవస్థను ముందుకు తీసుకువెళుతూ భిన్నస్వభావాలు కలిగిన స్వభావాన్ని ఒకే తాటిపై నడిపిస్తూ ఎప్పటికప్పుడు విజయాలను నమోదు చేసుకుంటూనే వస్తోంది. అయినప్పటికీ అసాధారణ విజయాలనే నమోదు చేసుకుంటోంది. దీన్నిబట్టి చూస్తే వ్యవస్థాగతంగా భారత్‌కు తిరుగులేని అంతర్గత సత్తా ఉందన్న విషయం స్పష్టమవుతోంది. ఇవన్నీ కూడా భారత్ అంతర్గత శక్తికి, బాహ్యయుక్తికి ప్రపంచ దేశాలకు బలమైన సంకేతాలు ఇచ్చేదే. అందరికోసం ప్రభుత్వం, ప్రతి ఒక్కరిదీ అభివృద్ధి అన్న లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న విధానాలు మరింతగా ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఎలాంటి ఒడిదుడుకులు తలెత్తినా తట్టుకోగలిగే



**ప్రపంచంలోనే అత్యధిక స్థాయిలో యువత కలిగిన భారత్ తలచుకుంటే ఏదీ అసాధ్యం కాదు. ప్రస్తుత ధనిక దేశాల్లో కొన్నింటిని సమీప భవిష్యత్తులోనే భారత్ ప్రగతిపరంగా అధిగమించే అవకాశ ఉందన్న సంకేతాలు ప్రస్ఫుటిస్తున్నాయి. అంతేకాదు అనేక అంతర్జాతీయ వేదికలపై భారత్ మాటే వేదమన్న వాక్కు బలంగా వినిపించింది. పర్యావరణ సమతూకాన్ని కబళిస్తున్న వాతావరణ ప్రతికూల మార్పులను నిరోధించేందుకు చారిత్రక రీతిలో కుదిరిన ప్యారిస్ పర్యావరణ ఒప్పందం వెనుక కూడా భారత్ క్రియాశీలక పాత్ర వహించింది.**

అంతర్గత సామర్థ్యం భారత్‌కు ఉందని చెప్పడానికి కొన్నేళ్ల క్రితం ప్రపంచ దేశాలను అట్టుడికించిన ఆర్థిక మాంద్యం సమయంలోనే భారత్ వృద్ధిరేటు నిలకడగా ఉండడమే నిదర్శనం. అంతటి ప్రతికూల పరిస్థితులను సైతం తట్టుకున్న భారత్ ప్రస్తుత సంక్లిష్ట వాతావరణాన్ని అందిపుచ్చుకుని అందులో అవకాశాలను సద్వినియోగం చేసుకుంటుందనడంతో ఎలాంటి సందేహం లేదు. ఇందుకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరం వార్షిక సమావేశమే బలమైన వేదిక కాబోతోంది. సంక్లిష్ట ప్రపంచంలో భాగస్వామ్య భవితవ్యాన్ని రూపొందించుకోవాలన్న ఆశయంతో జరుగుతున్న ఈ సదస్సులో భారత్‌కు సముచిత స్థానం లభించడమే కాకుండా భారత మాట ఏమిటన్న ఆసక్తిని కూడా అంతర్జాతీయంగా రేకెత్తించింది. ప్రపంచంలోనే అత్యధిక స్థాయిలో యువత కలిగిన భారత్ తలచుకుంటే ఏదీ అసాధ్యం కాదు. ప్రస్తుత ధనిక దేశాల్లో కొన్నింటిని సమీప భవిష్యత్తులోనే భారత్ ప్రగతిపరంగా అధిగమించే అవకాశ ఉందన్న సంకేతాలు ప్రస్ఫుటిస్తున్నాయి. అంతేకాదు అనేక అంతర్జాతీయ వేదికలపై భారత్ మాటే వేదమన్న వాక్కు బలంగా వినిపించింది. పర్యావరణ సమతూకాన్ని కబళిస్తున్న వాతావరణ ప్రతికూల మార్పులను నిరోధించేందుకు చారిత్రక రీతిలో కుదిరిన ప్యారిస్ పర్యావరణ ఒప్పందం వెనుక కూడా భారత్ క్రియాశీలక పాత్ర వహించింది. అలాగే అంతర్జాతీయ సోలార్ అలయెన్స్‌లో కూడా నిరుపమానమైన భూమికనే పోషించింది. ఇటు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలోనూ, మరోపక్క ఎన్ఎస్‌జీలోనూ సభ్యత్వాన్ని పొందేందుకు ప్రయత్నిస్తున్న భారత్ ఆ విధంగా తన అంతర్జాతీయ నాయకత్వ పటిమను ఎప్పటికప్పుడు నిరూపించుకుంటోంది. ముఖ్యంగా ఈ మూడేళ్ల కాలంలోనే అంతర్జాతీయంగా తిరుగులేని గుర్తింపును సాధించిన భారత్, రానున్న కొన్నేళ్ల కాలంలో తన నిరుపమానతను కూడా అద్వితీయంగా నిరూపించుకునే అవకాశం పుష్కలంగా ఉంది. ఎంతగా అంతర్జాతీయ వేదికల్లో నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తే క్రియాశీలక రీతిలో విధానపరమైన మార్పులకు ఊతాన్ని ఇవ్వగలిగితే అంతగానూ భారత్‌కు వరుస విజయాలు చేకూరుతాయి.

బి.రాజేశ్వర ప్రసాద్

# థెరిసాకు సవాలే

## • బ్రెగ్జిట్‌పై టోరీల నుంచే సెగలు • ఐరోపా యూనియన్ షరతులపై నిరసనలు • లేబర్ పార్టీని చుట్టుముడుతున్న సమస్యలు • బ్రిటన్‌లో వేడి తగ్గని రాజకీయం

బ్రిటన్ ప్రధాని థెరిసామేకు బ్రెగ్జిట్ కష్టాలు ఇప్పట్లో తీరేట్లు కనిపించడం లేదు. ఎప్పటికప్పుడు ప్రతిపక్ష లేబర్ పార్టీతో మంతనాలు సాగిస్తున్నా, ఎన్నో కీలక అంశాలు కొత్త సమస్యలను రేకెత్తిస్తూనే వస్తున్నాయి. బ్రిటన్ ప్రయోజనాలపై ఏ విధంగానూ రాజీ పడకుండా ఐరోపా యూనియన్ నుంచి వైదొలగాలని, అదే విధంగా సాధ్యమైనంత మేర తమ డిమాండ్లను సాధించుకునే ప్రయత్నించాలన్నదిని ప్రతిపక్షాల వాదన. ఈ విషయంలో ప్రతిపక్షాల నుంచి ఎంతగా ఒత్తిళ్లు వస్తున్నాయో అధికార కన్సర్వేటివ్ పార్టీల నుంచి కూడా ప్రధాని అంతకుమించిన స్థాయిలో ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారు. తుది ఒప్పందం కుదిరే లోగా తాత్కాలిక ప్రాతిపదికన ఐరోపా యూనియన్‌తో ఒడంబడిక కుదర్చుకోవాలన్న థెరిసామే ప్రయత్నాలకు తాజాగా జరిపిన ఓ సర్వే గండికొట్టింది. పరిపూర్ణమైన రీతిలోనే బ్రిటన్ ప్రయోజనాలను కాపాడుకోవాలి తప్ప ఈ రకమైన తాత్కాలిక ఒడంబడికల వల్ల ఏ రకమైన ప్రయోజనం ఉండదని మెజారిటీ టోరి (కన్సర్వేటివ్ పార్టీ) ఎంపీలు తెగేసి చెప్పడంతో థెరిసా పరిస్థితి మరింత ఇరకాటంలో పడినట్టయింది. ఇదే రకమైన వాతావరణం కొనసాగితే ఆమె నాయకత్వానికే పెనుసవాళ్లు ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బ్రెగ్జిట్ ప్రభావం బ్రిటన్‌పై ఏ విధంగా చూసినా కూడా ప్రతికూలంగానే ఉండేలా కనిపిస్తోంది. ఆ రకమైన ప్రతికూలత ఉంచి కొంతలో కొంతయినా వెసులుబాటు పొందాలన్న ఉద్దేశంతో ఈ తాత్కాలిక ఒప్పంద ఆలోచనకు థెరిసా తెరతీశారు. అయితే దీనిపై జరిగిన సర్వేలో మెజారిటీ ప్రజలు అలాగే అధికార పార్టీ ఎంపీలు వ్యతిరేకిస్తున్నట్టుగానే సంకేతాలు వ్యక్తమయ్యాయి. దాదాపు 74 శాతం మంది టోరీ ఎంపీలు థెరిసా ఆలోచనను ప్రతిఘటిస్తున్నారు. అలాగే మరో 63 శాతం మంది ఐరోపా యూనియన్‌కు సంబంధించి బ్రిటన్ చేసే చెల్లింపుల పైన అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయితే ఈ రెండు అంశాలను తాత్కాలిక ఒప్పందం ద్వారా పరిష్కరించుకోవచ్చునని దాదాపు రెండేళ్లపాటు బ్రెగ్జిట్ ప్రతికూల ప్రభావాన్ని తట్టుకునేందుకు ఇది దోహదం చేస్తుందన్నది థెరిసా ఆలోచన. అయితే తాము ప్రతిపాదిస్తున్న రెండు షరతులను కచ్చితంగా అమలుచేసి తీరుతామని బ్రెగ్జిట్ తాత్కాలిక ఒప్పందంలోనైనా



కూడా ఈ షరతులను థెరిసా ప్రభుత్వం అంగీకరించక తప్పదని ఐరోపా యూనియన్ స్పష్టం చేసింది. దాంతో మరో మార్గాంతరం లేకపోవడంతో ఈ షరతులను ఒప్పుకుంటున్నట్లుగా థెరిసా సంకేతాలు ఇవ్వడంతో అధికార కన్సర్వేటిట్ పార్టీలోనే కలకలం చెలరేగింది. ఐరోపా యూనియన్ షరతులను ఏమాత్రం అంగీకరించకూడదని 65 శాతం మంది టోరీ ఎంపీలు స్పష్టం చేశారు. గతంలో అనుకున్నదానికంటే కూడా ఐరోపా యూనియన్ అడుగులకు మగుడులు ఒత్తడానికి వీల్లేదని చెప్పే అధికార పార్టీ ఎంపీల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది చివరలోనే ఐరోపా యూనియన్ షరతులను అంగీకరించి తాత్కాలిక ఒప్పందం కుదుర్చుకునేందుకు థెరిసా ముందుకు వెళ్లే అవకాశం స్పష్టం కావడంతో కన్సర్వేటివ్ పార్టీ ఎంపీలు మరింతగా ఆమెపై ఒత్తిడి తెస్తున్నారు. థెరిసా తన ఆలోచనను మార్చుకోకపోతే పార్టీ విధానాలను, సిద్ధాంతాలను పట్టించుకోకుండా ఐరోపా యూనియన్ షరతులకు అంగీకరిస్తే కచ్చితంగా అది ఆమె నాయకత్వాన్ని సవాలు చేసే పరిస్థితికి దారితీసే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికీ కూడా బ్రెగ్జిట్ చర్చలైతే జరుగుతున్నాయి కాని, అవి ఏ కోశానా కొలిక్కి వచ్చిన దాఖలాలు కనిపించడం లేదు. ఏ రకమైన ఒప్పందం కుదుర్చుకోకుండానే ఐరోపా యూనియన్ నుంచి వైదొలగాలంటూ మెజారిటీ సంఖ్యలో టోరీ ఎంపీలు ఈ సర్వేలో స్పష్టం చేయడాన్ని బట్టి చూస్తే ఈ ఒప్పంద వ్యవహారం అంత తేలిగ్గా ఓ కొలిక్కి అవకాశం ఉండదన్నది తేలతెల్లం అవుతున్నది. సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడంతోపాటు ఇటు సొంత పార్టీ ఎంపీలను, అటు లేబర్ పార్టీని తనవైపు తిప్పుకునే ప్రయత్నాలను థెరిసా చిత్తశుద్ధితో చేపట్టకపోతే ఏకంగా పార్లమెంటులోనే ఆమెకు సెగలు తథ్యమని చెబుతున్నారు. అయితే బ్రెగ్జిట్ అన్నది ఒక అధికారంలో ఉన్న పార్టీకి ఎదురవుతున్న సమస్యగానే భావించడానికి వీలులేదు. అటు లేబర్ పార్టీ కూడా ఏదో విధమైన సమస్యను ఎదుర్కొంటూనే ఉంది. ప్రస్తుతం లేబర్ పార్టీ విపక్షం కాబట్టి దానిపై ఒత్తిడి లేకపోవచ్చునేమోగానీ, ఇప్పటికైనా ఓ స్పష్టమైన వైఖరిని కనబరచకపోతే లేబర్ పార్టీకి కూడా బ్రెగ్జిట్ సెగలు తప్పవని తెలుస్తోంది. టోరీ లేబర్ పార్టీల ఎంపీల అభిప్రాయానికి, ఆ పార్టీ అధినాయకత్వ ఆలోచనకు ఏ కోశానా పొంతన లేని పరిస్థితి నెలకొన్నది. అలాగే ఈ రెండు పార్టీల నుంచి కూడా ఇటు ఎంపీలు, అటు బ్రిటన్ ప్రజలు కూడా బ్రెగ్జిట్ ద్వారా భారీ ప్రయోజనాలనే ఆశిస్తున్నారు. అవి నెరవేర్చడంలో ఈ పార్టీలు ఎంతమేరకు కృతకృత్యం అవుతాయన్నది ప్రస్తుతానికి సమాధానం లేని ప్రశ్నే.

# ఏమిటి.. లోగుట్టు!

పెద్దన్న పాత్ర పోషిస్తూ, ప్రపంచాన్ని తమ ఆదుపాజ్ఞల్లో ఉంచుకోవాలని ఎపుడూ ప్రయత్నించే అమెరికా మరోమారు చిన్నబోయింది.అమెరికా ప్రభుత్వం అధికారికంగా మూతపడింది. అమెరికా పాలనా యంత్రాంగాన్ని నడిపేందుకు అవసరమైన ఖర్చులను నిర్ధేశించే ద్రవ్యవినిమయ బిల్లును సెనేట్ తిరస్కరించడంతో షట్‌డౌన్ మొదలైంది. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా డోనాల్డ్ ట్రంప్‌కు ఇది ఇబ్బందికరమై పరిస్థితే. పెంటగాన్ సహా ఇతర కేంద్ర సంస్థలు పనిచేసేందుకు అవసరమైన నిధులు ఆగిపోయాయి. నిజానికి అమెరికాకు ఇది కొత్త కాదు, ఇలా ఇప్పటికే 17 సార్లు జరిగింది. ఆక్రమంలో 18వ సారి షట్‌డౌన్ జరిగింది. చివరి సారిగా 2013 అక్టోబర్ 16 నుండి 16 రోజుల పాటు, అంతకు ముందు 1995 నవంబర్‌లో ఐదురోజులు, 1996లో నెల రోజుల పాటు షట్‌డౌన్ అయ్యిం ది. రోజుల పాటు షట్‌డౌన్ అయ్యింది. సెనేట్, వైట్‌హౌస్‌లు ఒకే పార్టీ ఆధిపత్యంలో ఉన్న సమయంలో షట్ డౌన్ కావడం అమెరికా చరిత్రలో ఇదే ప్రథమం. డెముక్రాట్లు కావాలనే ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చాలని చూస్తున్నారని, పన్ను తగ్గింపు విజయాన్ని తక్కువ చేసేందుకే డెముక్రాట్లు కుట్రపన్నుతున్నారని డోనాల్డ్ ట్రంప్ వాదన. ఫిబ్రవరి 16వరకూ ప్రభుత్వ నిర్వహణకు అవసరమైన నిధులు ఇచ్చే ఈ బిల్లు ప్రతినిధుల సభలో 230-197 ఓట్లతో ఆమోదం పొందినా, 50-48 తేడాతో సెనేట్‌లో వీగిపోయింది. తల్లిదండ్రుల వెంట అమెరికా చేరుకున్న సుమారు ఏడు లక్షల మంది అక్రమ వలసదారులున్నారు. వాళ్లను తరిమేయాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. గత సెప్టెంబర్‌లో ట్రంప్ ప్రభుత్వం దానికి భిన్నమైన నిర్ణయం తీసుకుని వారిని దేశం నుండి తరిమేయాలని భావించింది. డ్రీమర్ల భద్రత అంశంపై కొందరు రిపబ్లికన్లు కూడా డెమోక్రాట్లకు మద్దతు ఇస్తున్నారు. వలసదారులను రక్షించుకోవాలని చూస్తున్నారు. ఈ నేపథ్యం షట్‌డౌన్‌కు కారణమైంది.




ఫలితంగా అమెరికా ప్రభుత్వానికి వారానికి 42వేల కోట్ల రూపాయిల నష్టం వాటిల్లుతుందని అంచనా. మొత్తంగా 8 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు వేతనాలు లేకుండానే 40 రోజుల పాటు సెలవులో పంపారు. అమెరికాలో 15 లక్షలమంది సైనికులున్నారు. 40వేల మంది హోంలాండ్ సెక్యూరిటీ ఉద్యోగులు విధుల్లో ఉంటారు. పెంటగాన్‌లో పనిచేసే 7.4 లక్షల మంది పౌరుల్లో మూడింట రెండొంతుల మంది ఇంట్లోనే ఉండాలి. వైట్ హౌస్, కాంగ్రెస్, కేంద్ర కోర్టులు, వైద్యం, పోలీసు, పౌర విమానయానం వంటి అత్యవసర సేవలు మాత్రం అందుబాటులో ఉంటాయి. అంతర్గత రెవిన్యూ, సోషల్ సెక్యూరిటీ, పట్టణాభివృద్ధి, విద్య, వాణిజ్యం, కార్మిక, పర్యావరణ శాఖలు మూతపడతాయి. 2010లో ఆర్థిక మాంద్యం కన్నా తీవ్రమైన ప్రభావాన్ని చూపే ఘటనగా ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అత్యవసరాలు మినహా అన్ని ప్రభుత్వ కార్యకలాపాలకు షట్‌డౌన్ ఆటంకం కలిగిస్తుంది. దీని కారణంగా వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేసే 8 లక్షల మంది ఉద్యోగులను అత్యవసరం. షట్‌డౌన్ ముగిసే వరకూ వివిధ వీసాలపై అమెరికా వెళ్లేవారు తమ ప్రయత్నాలను మానుకోక తప్పదు. 1.15 లక్షల మంది న్యాయశాఖలో పనిచేస్తున్నారు.

- బి వి ప్రసాద్

ఆంధ్రభూమి
# చిత్ర
12 బుధవారం, 24 జనవరి 2018

# 'జై సింహా' విజయోత్సవం




నందమూరి బాలకృష్ణ, నయనతార, హరిప్రియ, నటాషా దోషి నటించిన చిత్రం 'జై సింహా'. నిర్మాత సి.కల్యాణ్, కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సక్సెస్ మీట్‌లో డిస్ట్రిబ్యూటర్స్ పార్థసారధిరెడ్డి, శివారెడ్డి, ఫణి, శక్తి పిక్చర్స్, రమేశ్, విజయ్, మహేశ్, కృష్ణ తదితరులు పాల్గొని సినిమా సక్సెస్ పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ- 'జై సింహా' సినిమా 50 కోట్ల క్లబ్‌లో చేరింది. నేను గతంలో కల్యాణ్‌తో 'పరమవీరచక్ర' సినిమా చేశాను. ఆ సినిమాకు నేషనల్ ఇంటిగ్రిటీ అవార్డు వచ్చింది. ఇపుడు 'జై సింహా' మంచి సక్సెస్‌ను సాధించింది. ఈ సక్సెస్‌తో అందరూ సంతోషంగా ఉన్నారు. నాకు రికార్డులు ముఖ్యం కాదు. పరిశ్రమ బాగుండాలి. కె.ఎస్.రవికుమార్‌తో సినిమా చేయాలనేది ఎనిమిదేళ్ల కల ఈ సినిమాతో నెరవేరింది. ఇందులో మాటలు, పాటలు, సంగీతం అన్నీ చక్కగా కుదిరాయి. అందుకే ఈ సినిమా సాధించింది.

# ఓ నవ్వుల యాత్ర!

## దర్శకుడు జి.నాగేశ్వర్‌రెడ్డి



మంచు విష్ణుతో 'దేనికైనా రెడీ', 'ఈడోరకం ఆడోరకం' చిత్రాల్ని తెరకెక్కించిన నాగేశ్వర్‌రెడ్డి మూడోసారి 'ఆచారి అమెరికా యాత్ర'తో మన ముందుకు రానున్నారు. ఈ చిత్రం త్వరలోనే విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా దర్శకుడు జి.నాగేశ్వర్‌రెడ్డి ఈ సినిమా గురించి విషయాలు తెలియజేస్తూ..

**ఆచారి యాత్ర..**

ఆచారి ఓ పర్సన్ కోసమే అమెరికా వెళ్తాడు.. అదేమిటన్నది తెరపైనే చూడాలి.. ఒక మంచి కథని హాస్య ప్రధానంగా చెప్పే ప్రయత్నమే ఈ చిత్రం. థియేటర్‌కి వెళ్లిన ప్రేక్షకులకు ఒక నవ్వుల యాత్ర లాగా వుంటుంది. మల్లాది వెంకట కృష్ణమూర్తి సినిమా కోసమే ఈ కథని రాశారు. దాసరి నారాయణరావు పాతికేళ్ల కిందట వాళ్ల వూళ్లో చూపిన ఒక పాత్రని తీసుకొని ఒక నవలలో రాశారు. ఆ పాత్ర ఆధారంగానే మల్లాది ఈ కథ రాశారు. అది నచ్చి నిర్మాత ఎం.ఎల్.కుమార్ చౌదరి నాకు చెప్పారు. మొదట ఈ కథ నేపథ్యం గురించి తెలిశాక చేయకూడదనుకున్నా. దేనికైనా రెడీ సమయంలో చాలా వివాదాలొచ్చాయి. అందుకే మళ్లీ బ్రాహ్మణుల నేపథ్యంలో సినిమా చేయడం ఎందుకనుకొన్నా. కానీ ఇది అలా ఉండదని చెప్పాకే సినిమా చేయాలని నిర్ణయించుకొన్నా. చాలా జాగ్రత్తలు తీసుకొని ఈ సినిమా చేశాం.

**విష్ణుతో బాగా కుదిరింది..**

నాకూ, కామెడీకి మధ్య కెమిస్ట్రీ బాగుంటుంది. అలాగే విష్ణుకి, కామెడీకి మధ్య కూడా మంచి కెమిస్ట్రీ ఉంటుంది. ఈ కథ వినగానే విష్ణు, బ్రహ్మానందం అయితేనే బాగుంటుందనుకొన్నా. విష్ణు, బ్రహ్మానందం మొదలుకొని ప్రతి ఒక్కరూ అద్భుతంగా చేశారు. రచయిత మల్లాదితో కలిసి పనిచేయడం నా అదృష్టం.

**కామెడీ ముద్ర..**

కామెడీపై పట్టున్న దర్శకుడనే గుర్తింపు నిజంగా అదృష్టంగా భావిస్తా. కామెడీ లేకుండా నేను సినిమా చేయను. ఇప్పుడు ఏ స్టార్ హీరో చూసినా కామెడీనే చేస్తున్నాను. స్టార్ హీరోలతో సినిమా చేసే అవకాశమొచ్చినా కామెడీకే పెద్ద పీట వేస్తూ సినిమా చేస్తా. అయితే చేసినవన్నీ సక్సెస్ అవుతాయని చెప్పలేం.. ఏ సినిమా చేసినా ఎంచుకొన్న కథ బాగుందా లేదా? నేను బాగా చెప్పానా లేదా? అనేదే ముఖ్యం. దర్శకుడిగా నేను ఏ సినిమా విషయంలోనూ నిరాశపడలేదు.

**కామెడీ దర్శకులు..**

యాక్షన్, హారర్, థ్రిల్లర్ అయినా, కుటుంబ నేపథ్యంలో సాగినా కామెడీ లేకుండా మాత్రం సినిమా ఉండదు. కాకపోతే పూర్తిస్థాయి కామెడీ సినిమాల సంఖ్యే తగ్గిపోతోంది. అందుకు దర్శకులు లేకపోవడమే కారణం అనుకోను. కథలు, దర్శకులు ఉన్నా, కామెడీ హీరోల సంఖ్యే తగ్గిపోతోంది. యువ కథానయకులంతా ప్రేమ కథలు, యాక్షన్ వైపు దృష్టి పెడుతున్నారు. దర్శకులు కూడా వాళ్ల శైలికి తగ్గట్టుగానే కథలు రాసుకుంటూ వాటిలోనే కామెడీని జొప్పించే ప్రయత్నం చేస్తున్నారు. అంతే.

- శ్రీ

# రిపబ్లిక్‌డేకు ప్రత్యేక పాట



అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయేల్ జంటగా రచయిత వక్కంతం వంశీ దర్శకత్వంలో శ్రీరామలక్ష్మి క్రియేషన్స్ బ్యానర్‌పై లగడపాటి శ్రీధర్, బన్నీ వాసు నిర్మిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. ఇందులో బన్నీ ఆవేశం కలిగిన సైనికుడి పాత్రలో కనిపించనున్నాడు. ఇదివరకే విడుదలైన ఫస్ట్ ఇంపాక్ట్ కూడా బ్రహ్మాండమైన స్పందనను దక్కించుకుంది. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 27న విడుదల చేయనున్నారు. అయితే ఈనెల 26 రిపబ్లిక్‌డే సందర్భంగా ఓ ప్రత్యేక పాటను విడుదల చేయనున్నారు. ఈ చిత్రం ప్రస్తుతం నానక్‌రామ్‌గూడలో షూటింగ్ జరుపుకుంటున్న సందర్భంగా పాత్రికేయుల సమావేశంలో గీత రచయిత రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ- టైటిల్ వింటుంటేనే రోమాలు నిక్కబొడుచుకుంటున్నాయి. ముఖ్యంగా ఈనెల 26న రిపబ్లిక్‌డే సందర్భంగా విడుదల చేస్తున్న పాట చాలా ప్రత్యేకం. నిర్మాత లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ- బన్నీ హీరోగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నందుకు ఆనందంగా వుంది. సినిమా ఇప్పటికే ఓ షెడ్యూల్ మినహా పూర్తికావచ్చింది. ఈ చిత్రానికి బాలీవుడ్ పాపులర్ మ్యూజిక్ డైరెక్టర్ విశాల్ శేఖర్ సంగీతం అందిస్తున్నారు. దర్శకుడు వంశీకి ఇది మొదటి సినిమా అయినా ఎంతో అనుభవం వున్నవాడిలా తీస్తున్నారు.



# కొత్త తరహా కథలపై మోజు!

హీరో నాగార్జున ఈ మధ్య కొత్త తరహా కథలపై మోజు పెంచుకుంటున్నారు. దానిలో భాగంగానే ఎప్పటికప్పుడు కథలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా ప్రయోగాత్మకమైన సినిమాలు చేస్తున్న సీనియర్ హీరో నాగార్జున, ఎప్పటికప్పుడు కొత్త తరహా కథల్ని ఎంచుకుంటూ ప్రేక్షకుల్ని అలరిస్తున్న యంగ్ హీరో నానిలు కలిసి మల్టీస్టారర్‌లో నటించనున్న సంగతి తెలిసిందే. యువ దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. తాజా సమాచారం మేరకు ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 24 నుండి మొదలుపెడతారని సమాచారం. ప్రముఖ దర్శకుడు అశ్వినీదత్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా వుండబోతున్న ఈ చిత్రంలో మంచి మలుపులతో కూడిన కథ కథనాలు కూడా ఉంటాయని తెలుస్తోంది. ఇకపోతే ప్రస్తుతం నాగార్జున ఆర్‌జివి చిత్రంలోను, నాని 'కృష్ణార్జున యుద్ధం'లోను నటిస్తున్న సంగతి తెలిసిందే.

# శివాని తొలి చిత్రం



లక్ష్య ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అడివి శేష్ హీరోగా ఓ కొత్త చిత్రం షూటింగ్ ఫిబ్రవరిలో ప్రారంభం కానుంది. వెంకట్‌రెడ్డి దర్శకత్వంలో ఎం.ఎల్.వి.సత్యనారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హిందీలో ఘన విజయం సాధించిన '2 స్టేట్స్' చిత్రానికి తెలుగు రీమేక్ ఇది. రాజశేఖర్-జీవిత తనయ శివాని ఈ చిత్రం ద్వారా హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. శివాని తొలి చిత్రం కోసం ఎన్నో కథలు విన్నప్పటికీ నటనకు ఎంతో ఆస్కారం వున్న ఈ కథను ఎంచుకోవడం విశేషం. బ్యూటిఫుల్ లవ్ అండ్ రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. దర్శకుడు వెంకట్ రెడ్డి వి.వి.వినాయక్‌తో అసోసియేట్‌గా చాలా చిత్రాలకు పనిచేశారు. ఈ సినిమాకు సంబంధించిన మిగతా నటీనటులను, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో ప్రకటిస్తారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, నిర్మాత: ఎం.ఎల్.వి.సత్యనారాయణ, దర్శకత్వం: వెంకట్‌రెడ్డి.

# దేశంలో తొలి స్పేస్ సినిమా ఇదే..

## హీరో 'జయం' రవి



జయం రవి, నివేదా పెతురాజ్ జంటగా చదలవాడ బ్రదర్స్ సమర్పణలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలింస్ బ్యానర్‌పై పద్మావతి చదలవాడ నిర్మితగా వస్తోన్న సినిమా 'టిక్ టిక్ టిక్'. శక్తి సౌందర్‌రాజన్ దర్శకుడు. ఇండియన్ సినిమా చరిత్రలో ఫస్ట్ స్పేస్ సినిమాగా రూపొందింది. త్వరలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా జయంరవి చెప్పిన విశేషాలు.. ఈ నిర్మాతలు సినిమాను బాగా ప్రమోట్ చేస్తున్నారని వాళ్లకి థాంక్స్ చెప్పడానికి వచ్చా. మన దేశంలో ఫస్ట్ స్పేస్ ఫిలిం ఇది. ఇటువంటి సినిమాలు ఈజీగా చేయలేం. ఒక్కొక్క షాట్ వెనుక చాలా కష్టం ఉంటుంది. దర్శకుడు శక్తి సౌందర్‌రాజన్ వచ్చి ఏ జానర్‌లో మనం సినిమా చేయబోతున్నామో చెప్పుకోండి అన్నారు. నేను జురాసిక్ పార్క్ అన్నాను. తర్వాత స్పేస్ ఫిలిం అనగానే అందరిలా నేనూ షాక్ అయ్యాను. 90లో కొన్ని స్పేస్ సినిమాలు వచ్చాయి. అలా చేయాలంటే నో ప్రాబ్లమ్ కానీ అంతకంటే బాగా చేయాలంటే బడ్జెట్ కావాలి అన్నారు. లక్కీగా మా ప్రొడక్షన్ టీం, చెన్నైలో అజాక్స్ గ్రాఫిక్ స్టూడియో దొరికాయి. అందరూ నెగెటివ్‌గా చూసిన విషయంలో నేను పాజిటివ్‌గా తీసుకొని చేస్తున్నా. టీజర్, ట్రైలర్‌లో ప్రేక్షకులు చూసినదానికంటే ట్రైలర్‌లో పదిరెట్లు ఎక్కువ ఉంది.



# సెట్స్ కథలో భాగం కావాలి

## ఆర్ట్ డైరెక్టర్ రవీంద్ర



సినిమాకు కథ ఎంత ముఖ్యమో.. ఆర్ట్‌కూడా అంతే ముఖ్యం. సదరు ఆ సన్నివేశాన్ని బలంగా పండించాలంటే అక్కడి పరిసరాలు కథలో భాగం అవ్వాలి. అప్పుడే ప్రేక్షకుడు ఆ సన్నివేశానికి సంబంధించిన మూడ్‌ని ఫీల్ అవుతారు. కొన్ని సినిమాల్లో సెట్స్ కూడా పాలు పంచుకుని యాక్టర్స్‌గా మారతాయి. ఇపుడు అలాంటిదే 'భాగమతి' సెట్. అద్భుతమైన కథలకు అంతకన్నా అద్భుతంగా సెట్స్‌వేసి ఆకట్టుకోవడంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు ఆర్ట్ డైరెక్టర్ రవీంద్ర. ఆయన ఇప్పటివరకు చేసిన సినిమాలన్నీ సంచలన విజయాలు అందుకోవడంతోపాటు ఆయనకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. తాజాగా అనుష్క ప్రధాన పాత్రలోనటిస్తున్న 'భాగమతి' చిత్రానికి పనిచేస్తున్నారు. ఇప్పటికే భారీ అంచనాలు పెంచుకున్న ఈ చిత్రానికి అశోక్ దర్శకత్వం వహిస్తున్నాడు. యువి క్రియేషన్స్ బ్యానర్‌పై తెరెకెక్కిన ఈ చిత్రం ఈనెల 26న విడుదలవుతున్నసందర్భంగా ఆర్ట్ డైరెక్టర్ రవీంద్రతో ఇంటర్వ్యూ..

**★ 'భాగమతి' కోసం భారీ సెట్స్ వేయడానికి కారణం?**

- దర్శకుడు అశోక్ ఈ సినిమా కథ చెప్పినదాని ప్రకారం నాలుగు వందల సంవత్సరాల క్రితంనాటి ఓ పురాతన భవనం కావాలి. ఓ రాజు తన భార్యకు కానుకగా ఇచ్చిన భవంతి అది. అలాంటి భవంతి కోసం దేశం నలుమూలాల గాలించాం. ముఖ్యంగా నార్త్ ఇండియాలో వెదికాము. మాకు కావాల్సిన హంగులతో వున్న బంగ్లా ఎక్కడా కనిపించలేదు. దాంతో సెట్ వేయడం తప్ప మరో మార్గం లేదనిపించింది. 400 సంవత్సరాల క్రితం భవంతులు ఎలా ఉన్నాయో తెలుసుకోవడానికి కొంత పరిశోధన అవసరమైంది. అప్పటి మన కట్టడాలపై పాశ్చాత్య దేశాల ప్రభావం ఉండేది. అందుకే భారతీయత, విదేశీయత కలగలపిన డిజైన్లు రూపొందించాం. దానికోసం వేసిన డిజైన్‌లలో ఇది ఫైనల్ అయింది. ఎంతో రీసెర్చి చేసి కొత్త టెక్నాలజీని ఉపయోగించి డిజైన్ తయారుచేసి కేవలం 29 రోజుల్లో బంగ్లా సెట్‌ను వేశాం. సెట్ చూసి అందరూ ఆశ్చర్యపోయారు. నిజానికి సెట్ యొక్క భారీతనం, లుక్ ఇంకాస్త ఎక్కువ కష్టపడి బెటర్ ఔట్‌పుట్ ఇచ్చేలా దోహదపడింది.

**★ బంగ్లా నేపథ్యంలో చాలా కథలు వచ్చాయి.. మరి 'భాగమతి'కి తేడా ఏమిటి?**

- 'భాగమతి' పూర్తిస్థాయి హారర్ చిత్రంకాదు. హారర్ కంటెంట్ కొంత మాత్రమే వుంటుంది. ఇతర సినిమాలకి దీనికి పోలిక ఉండదు. సుమారు 45 రోజులపాటు బంగ్లాలో షూటింగ్ జరిపాం. అక్కడ షూట్ చేసిన సన్నివేశాలు సినిమాకే హైలెట్‌గా నిలుస్తాయి. సగం కథ ఈ సెట్లోనే సాగుతుంది. సాధారణంగా ఒకేచోట ఓ ఇరవై రోజులు షూటింగ్ జరిపితే బోర్ కొట్టేస్తుంది. కొత్త బ్లాకులు పెట్టుకోవడానికి కెమెరామెన్‌కి అవకాశం దక్కదు. కానీ మేం ఉపయోగించిన కొత్త టెక్నాలజీవల్ల సరికొత్త ఫ్రేమింగులకు అవకాశం దక్కింది. 'మర్యాద రామన్న'లో వేసిన ఇంటి సెట్‌కి పేటెంట్ దక్కింది. ఈ 'భాగమతి' బంగ్లాకి పేటెంట్ సక్కుల కోసం ప్రయత్నిస్తాం.

**★ ఈ సెట్ కోసం ఖర్చు కూడా భారీగా పెట్టారని విన్నాం?**

- అవును నిజమే. ఈ సెట్‌మీద ఎక్కువే ఖర్చు చేశాం. 12గదులున్న రెండు అంతస్థుల భవనం ఇది. ఆ రోజుల్లోనే లిఫ్ట్ సౌకర్యం ఉండేది. అయితే లిఫ్ట్‌ని మనుషులు తాళ్లతో లాగేవారు. వాటికి తగ్గట్టుగా లిఫ్ట్‌ని రూపొందించాం. ఫైబర్‌ని ఎక్కువగా వాడాం. రంగుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. ఇప్పటివరకూ ఎవరూ వాడని రంగులు సెట్లో కనిపిస్తాయి. ఇంత పెద్ద సెట్‌ని కేవలం 29 రోజుల్లో పూర్తి చేశాం. 200మంది కార్మికులు రాత్రి పగలు పనిచేశారు. బడ్జెట్ ఎక్కువ అవుతుందని ముందే తెలుసు. దానికి యువి క్రియేషన్స్ కూడా సిద్ధమయ్యింది. సెట్ బాగుండాలి. ఎంత ఖర్చు అయినా ఫర్వాలేదు అని ప్రోత్సహించారు. దాదాపుగా రూ.3 కోట్ల వ్యయంతో ఈ సెట్‌ని నిర్మించాం. పెట్టిన ప్రతి పైసా స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఇప్పటివరకు నేను చేసిన వర్క్సులో ఇదే బెస్ట్ అని చెప్పగలను.

**★ ఇంతకీ సినిమా ఎలా ఉండబోతోంది?**

- అందరూ మంచి సినిమా చేశామని అంటున్నారు. కానీ మా వరకు మేము ఒక సిన్సియర్ ప్రయత్నం చేశాం. ఆ ప్రయత్నం అందరినీ మెప్పిస్తుందని నా నమ్మకం.

**★ సినిమా ఒప్పుకునే ముందు కథ మొత్తం వింటారా?**

- అవును. ఏ సినిమాకైనా కథ వింటాను. అప్పుడే సినిమా యొక్క కాన్సెప్ట్ అర్థమై ఎలాంటి సెట్స్ కావాలో అలాంటివే ఇవ్వగలం. కథ నాకు నచ్చితే ఓకె లేదంటే చేయనని చెబుతా. అందరూ ఓ టీమ్‌గా ఉండడంవల్ల బాలీవుడ్‌లో మంచి ఫలితాలు వస్తున్నాయి. 'భాగమతి' విషయంలోనూ మేం అదే చేశాం. నేను సెట్ వేస్తుంటే.. సంగీత దర్శకుడు థమన్ కూడా వచ్చి చూశారు. నేపథ్య సంగీతంలో ఈ సెట్‌ని ఎలా వాడుకోవాలో తన సౌండ్ ఎఫెక్ట్స్ నిపుణులతో మాట్లాడారు. ఇలాంటి సమన్వయం ఉంటే ఖచ్చితంగా మంచి ఫలితాలొస్తాయి.

**★ మీ తదుపరి ప్రాజెక్ట్స్?**

- ప్రస్తుతం మారుతి, నాగచైతన్యల సినిమా, మోహన్ కృష్ణ ఇంద్రగంటి చిత్రం చేస్తున్నాను. ఈమధ్యే సుధీర్ వర్మ ప్రాజెక్టు ఒప్పుకున్నాను. ఇవి కాకుండా ఒక తమిళ సినిమా కూడా చేస్తున్నాను.

- శ్రీనివాస్ ఆర్.రావు

# ఆస్కార్ గౌరవం

బాలీవుడ్ క్రేజీ భామ ప్రియాంక చోప్రాకు ఓ అరుదైన గౌరవం దక్కింది. 90వ అకాడమీ అవార్డుల (ఆస్కార్) బరిలో వున్న అభ్యర్థుల జాబితాను ప్రకటించేందుకు ప్రియాంకను ఆస్కార్ కమిటీ ఎంపిక చేయడం విశేషం. 'బిహైండ్ ద సీన్స్ విత్ ప్రియాంక చోప్రా'. మంగళవారం ఉదయం 5.22 ని.లకు ఆస్కార్ అభ్యర్థుల ఎనౌన్స్‌మెంట్ అంటూ ఆస్కార్ కమిటీ సభ్యులు రెబెల్ విల్సన్, మిచెల్లి రాడ్రిగ్, రోసారి డాసన్ తమ అధికార ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. క్వాంటికో టెలివిజన్ సీరిస్‌తో హాలీవుడ్ బుల్లితెర ప్రేక్షకులకు సుపరిచితురాలైన ప్రియాంకకు మరోసారి ఆస్కార్ వేదికపై మెరిసే అవకాశం రావడం విశేషం. 2016లో ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా అద్భుతమైన కాస్ట్యూమ్స్‌తో ప్రియాంక రెడ్ కార్పెట్‌పై హల్‌చల్ చేసిన విషయం విదితమే.